భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938-1972)

*

సంపుటము : 65   నవంబరు 1988   సంచిక : 11


విడిపత్రిక వెల ఐదు రూపాయలు

విషయానుక్రమణిక

నవంబరు - 1988

స్వాస్

మింట్స్



స్వవిషయం

హరి వంశానువాదంలో ఎఱ్ఱన ఉభయభాషా పాండిత్యప్రకర్ష, పల్లీ జనజీవనవిధాన వర్ణనాచణత్వం, నన్నయ తిక్కనల శైలీ విన్యాస రీతులను కలిపే శయ్యాసౌభాగ్యం, సంయమనంతో కూడుకున్న కవిత్వ పటుత్వం — ఏ విధంగా దర్శనమిస్తాయో ప్రొఫెసర్ ఎస్. గంగప్పగారు తమ వ్యాసంలో స్థూలంగా వివరించారు. సాహితీ సుగతులకు ఈ వ్యాసం ఎంతో రుచికరంగా ఉండగలదు.

శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రిగారి "పెదకొండూరు శిలాశాసనము" శాసనప్రియులైన "భారతీ"యులకు ఎంతో ఆసక్తిని కలిగించగలదు.

విజ్ఞానశాస్త్ర సంబంధమైన విషయాలతో సృజనాత్మక సాహిత్యాన్ని సృష్టించడంలో విశిష్టస్థానం ఉన్న వ్యక్తి మరాఠీ రచయిత శ్రీ జయంత్ నారళీకర్. ఈయన రచన "గణపతి"ని (తెలుగు అనువాదాన్ని) "చిత్రమైన ఇతివృత్తాలు గల కథలను అభిమానించేవారి కోసం అందిస్తున్నాము.

ఆంధ్రదేశంలోని పంచారామాల ఆవిర్భావంపై డా॥ మైనేని కృష్ణకుమారిగారి పరిశీలనాత్మక వ్యాసం ఈ శైవాలయాల పుట్టుపూర్వోత్తరాల గురించి కొంతయినా తెలియజేయగలదు.

రఫి గారి "స్వేచ్ఛాగీతం", శ్రీ నిఖిలేశ్వర్ "ఆదిమవాంఛ", డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు దర్శించిన "వర్షాలక్ష్మి", డాక్టర్ జి. యస్. శివరుద్రప్పగారి "అవస్థ" - మంచి కవిత్వం కోరుకునే వారికి - ఎంతయినా ఊరటను ఇవ్వగలవు.

కేవలం మేథస్సే కాదు, హృదయం ఉన్న రచనలను కూడా భారతి కోరుకుంటోందన్న సంగతిని రాసేవారు మనసారా గమనించగలరు.

తెలుగు రథం

శ్రీ వజ్ఝల కాళిదాసు

రారండోయ్ రారండి!
రథాన్ని లాగలి రారండి!

ఇది తెలుగు రథం
మన అందరి రథం....నవ్యపథం!

నడుములు బిగించుకొని
నవభావాలను పెంచుకొని
నిర్మాణాత్మకమైన చూపుతో
నిత్యం నిలిచే క్రొత్త ఊపుతో....రారండోయ్

ఆవేశాలూ అంతఃకలహాల్
అవతల పెట్టండీ
కల్ల కబురులూ కంఠశోషలూ
కట్టిపెట్టండీ.... రారండోయ్

క్రమశిక్షణతో కదం త్రొక్కుతూ
కలిసికట్టుగా పని చేదామని
తెలుగుల దీక్షని చూపిద్దామని....రారండోయ్

కట్టిన కోటలు బలపరచాలని
పెట్టిన పేటలు మరి పెంచాలని
యువకుల్లారా రారండి
భావుకులారా రారండి.... రారండోయ్

ఆడా మగా పిన్నా పెద్దా
అందరు కలిసి పని చెయ్యాలని
నిష్కల్మషముగ నిస్వార్థంగా
నిర్మల హృదితో నిశ్చల మతితో ....రారండోయ్

తిక్కన్నా తిమ్మరుసుల యుక్తీ,
అక్కన్నా మాదన్నల శక్తీ,
చావలేదు మాలో ఉన్నదనీ
చాటించాలి చూపించాలి ....రారండోయ్

రాజనరేంద్రుడు, బ్రహ్మనాయడు,
కృష్ణరాయలు, రంగరాయడు,
ప్రత్యాంధ్రునిలో ప్రత్యక్షంగా
ప్రతిబింబిస్తారని చాటండీ ....రారండోయ్

గౌతమి బాలా, కాకతి రుద్రమ,
బోధి సిరీ, మంచాలా, మల్లమ
తెలుగు నారులను తీర్చిదిద్దిరని
చాటించాలి చూపించాలి ....రారండోయ్

తెలుగుల మాటల తీయదనాలు
తెలుగుల పోటుల కరకుదనాలు
తెలుగుల భక్తీ తెలుగుల శక్తీ
వెలుగుల బాటకు దారితీయగా
రారండోయ్ రారండి

ప్రొఫెసర్ ఎస్. గంగప్ప

ఎర్రన - శ్రీకృష్ణ బాల్యక్రీడలు

"మించిన వేడ్కఁ వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మరా
యంచలు గూయఁ గ్రౌంచము నావలఁ గూయ గడంగుభంగిఁ బ్రౌ
ఢాంచిత శబ్దసారులు మహాకవులాద్యులు కావ్యశయ్యఁ గీ
లించిన కీర్తిసంగ సఖలీలకు నేనుసఁ గాంక్షఁ జేసితిన్"

అది ఎర్రన ఆకాంక్ష. "ప్రౌఢాంచిత శబ్దసారులు, మహాకవులు, ఆద్యులు" అయిన నన్నయ తిక్కనలు 'కావ్యశయ్యఁ గీలించిన కీర్తి' సముపార్జనా సౌభ్యరీతికి తానూ ఆకాంక్షినట్లు స్పష్టం. ఆ ఆద్యులు ఇద్దరిని స్మరించి కవిత్రయంలో మూడోవాడైన తాను సైతం వారితో సమాన కావ్యశయ్యా సౌభాగ్య సంపన్నుడనని నిరూపించుకొనే యత్నమిది. కేవలం భారతారణ్య శేషోన్నయం వల్లనే తాను కవిత్రయంలో ఒకిడని కాదనీ, భారతానికి ఖిలపురాణమైన 'హరివంశము'ను ఆంధ్రీకరించడం వల్లనే అనే విషయం విజ్ఞాలోకానికి విదితమే.

ఈ హరివంశానువాదంలో ఎర్రన ఉభయభాషా పాండిత్య ప్రకర్ష, పల్లీ జనజీవన విధానవర్ణనాచణత్వం, నన్నయ తిక్కనల శైలీ విన్యాసరీతులను కలిపే శయ్యా సౌభాగ్యం, ఆర్షకవికి అత్యంతావశ్యకమైన సంయమనం ఎర్రన కవిత్వ పటుత్వ చణత్వానికి చక్కటి నిదర్శనాలు. ఈ లక్షణాలన్నీ హరివంశంలో మనం చూడగలం. అందులోను హరివంశ పూర్వభాగంలోని శ్రీకృష్ణ బాల్యక్రీడల వర్ణనా నిర్వహణాచణత్వంతో ఈ పై లక్షణాలు మరింతగా స్పష్టమై ఎర్రన వ్యక్తిత్వ నిరూపణకు నిదర్శనాలుగా నిలుస్తాయి. శ్రీకృష్ణ బాల్యక్రీడల్ని సంయమనంతో సముచితరీతిని తగినంతగా వర్ణించి తరించాడు ఎర్రన. తదనంతరం వెలసిన సహజకవి పోతనకు సైతం ఎర్రన మార్గదర్శకుడయాడంటే ఈ అంశం స్పష్టమవుతుంది. అతివేలమైన భక్తితత్పరుడైన పోతన రచన అడ్డమాకులేకుండా కొనసాగింది. అది పోతన భక్తితత్వ నిరూపణకే. అందుకతని కవితా స్వరూపమే సాక్ష్యం. ఎర్రన క్లుప్తంగా వర్ణించిన సన్నివేశాల్ని, ఘట్టాల్ని, అంశాల్ని విపులీకరించి తన సహజసుందరమూ, మధుర మనోజ్ఞమూ అయిన శైలీ విన్యాసంతో రసజ్ఞ మనోజ్ఞం చేసిన ఘనత పోతనది. ఎర్రన ఎక్కడా, ఏదీ, అవసరానికి మించి చేయడానికి ప్రయత్నించలేదు. ఏదీ, ఎక్కడ, ఎంతగా అవసరమో అంత చేసి కవికుండవలసిన ఆవేశానికి తగిన సంయమనం పాటించి తనదైన రచనా, తనదైన శైలీ విన్యాసంతో విశిష్టకవిగా నిరూపించుకొన్నాడు. అది ఎర్రన ప్రత్యేకత.

దేవకీదేవికి అష్టమగర్భంలో మగశిశువు జన్మించాడని భావించి, చెల్లెలి మాటల్ని సైతం లెక్కచేయక యోగమాయను వధించబోయి విఫలుడైన కంసుడు తదనంతరం వ్రేపల్లెలో తన హంతకుడు యశోదా నందగోపుల పుత్రుడై కృష్ణుడుగా పెరుగుతున్నాడన్న విషయం తెలుసుకొంటాడు. తత్సంహారార్థమై ఎన్నో మాయోపాయాలు పన్ని విఫలయత్నుడవుతాడు. చివరికి బలరామకృష్ణులను మధురకు తీసుకొని రమ్మని అక్రూరుని నియమించేముందు కృష్ణుని బాల్యక్రీడల్ని, కంసుడే ఇలా పేర్కొంటాడు;

"తనరి మువ్వంటుల దినముల యంద పూ
తన చన్నుఁబాలతోఁ ద్రాగె నుసురు,
నెఱి బోరగిల యాడ నేరనినాడ పా
దమునఁ దుత్తుమురు గాఁ దాఁచె బండి,
ధరణిఁ దప్పడుగిడుతఱి యంద జమిలి మ
ద్దులు వెల్లగిల రోలితోన యీడ్చె,
ంచు కించుక యెడ యెరిగెడు కొలదిన
కాళియ నాగంబు గండడంచెఁ

బ్రకటఁ బలుల బ్రబలంచ ధేనుకుల నుగ్ర
రేఖఁ జంపించె, నధికునరిష్టుఁ దునిమె
బాల్యమున, నేల ఇట్టిట్టి పనులు ప్రౌఢు
లెవ్వరీ లోకమునఁ జేసి రితఁడుదక్క"

"ఏడుదివ సముల వృష్టిం
గీడొందెడు పసులఁ గావ గిరి గొడుగుగ సం
క్రీడా గతిఁ బట్టుట గాని
యాడదగదె చెప్పనేల యన్యము లొకఁడున్?

"ఇంకఁ గలవాఁడు కేశియ యితఁడుఁ బోలు
వానిచేఁ దూలుఁ దరువాతి వాఁడ నేను
జంప మరగిన వాఁడేల సైఁచు నిన్ను
నుఱక నెటులైన వచ్చి పైనుఱుకుఁగాక!"

(పూ.హ. 8-58, 59, 60)

కృష్ణునిపై ద్వేషం, తన్మూలాన రోషం పెరిగి బాల్యక్రీడల్ని ఏకరువు పెట్టి "కొనియాడ దగదె చెప్పనేల యన్యము లొకడున్?" అని ప్రశంసించాడు. మిగిలినవారు కేశి. ఆ తరువాత తానేనన్న చింత, భయం కలిగి "చంపమరగిన వాడేల సైఁచు నన్ను, నుఱక నెటులైన వచ్చి పైనుఱుకుఁగాక!" అని కావ్యార్థాన్ని వివరించాడు. ఇలా శత్రువైన కృష్ణుని బాల్యక్రీడల్ని కంసునిచేత ప్రశంసింపజేసి అతని భయాతురతని, భావ్యర్థాన్ని ఎంతో సముచితరీతిని చిత్రించాడు ఎఱ్ఱన. ఈ పై కంసుని మాటల పరిపూర్ణ వివరణమే ఎఱ్ఱన చిత్రించిన శ్రీకృష్ణ బాల్యక్రీడలు.

దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థమై భువిపై అవతరించిన ఆ మహా విష్ణువే ఈ కృష్ణుడు. ఈ విషయాన్నే నారద మహర్షి నమస్క్రియా పూర్వక స్తుతితో స్పష్టం చేశాడు.

ఆద్యుఁడ వాదిదేవుఁడ వనంతుఁడ వుత్తమరూప బోధతా
హృద్యుఁడ వుద్యతాఖిల సహేతుక సృష్టి విధాయి వుద్భవ
చ్ఛేద్యనవద్య వీర్యుడవు సిద్ధుఁడవీవు, భవన్న మస్క్రియా
స్వాద్య సుధారసం బెపుడుఁ జాలఁగఁ గ్రోలెదు మాకు నచ్యుతా!"

(హ. పూ. 8, 123)

ఇట్లాంటి లీలామానుష విగ్రహుండైన శ్రీకృష్ణుని బాల్యక్రీడలను ఎఱ్ఱన వర్ణించిన తీరు సమాలోచించడమే ప్రస్తుతాంశం. ఇక్కడ శ్రీకృష్ణ బాల్యక్రీడలు జనన మొదిగా కంసవధ వరకు గల కథనంతటినీ తీసుకోవడం సముచితం. మిత్రులు డా॥ ధారా రామనాథ శాస్త్రిగారు "ఈ యనుశీలనము నందు సౌకర్యార్థమై కంసవధ పర్యంతము నున్న ప్రధాన కథావిశేషములు చేర్చఁబడినవి. కొన్ని ఘట్టముల యందితరాంశములున్నను ఇవే ప్రధానములు కాగా భిన్న భిన్న కృత్యము లొనర్చినపుడు స్వామి వయస్సు భిన్న గ్రంథములందు భిన్నరీతుల నున్నది. ఉదాహరణమునకు - హరివంశమున స్వామి కంసవధా త్పూర్వమే నీలను వివాహమాడెను. అనగా ప్రాయము బాల్యమగుటకు వీలులేదు. ఇట్టి యంశముల చారిత్రక దృష్టితో పరిశీలించినచో అదియొక మహాసముద్రము. ప్రస్తుతానుశీలనమునకు కార్యకారియు కాదు. కావున వ్యవస్థయందలి భిన్న దృక్పథములతో నిమిత్తము లేక కంసవధ పర్యంతమున్న ఘట్టముల నీ శీర్షిక క్రిందకు చేర్చి పరిశీలించుట జరిగినది." అని పేర్కొన్నట్లు నా మార్గం సైతం సుగమమైంది. (ఆంధ్ర వాఙ్మయము-కృష్ణ కథ- సం.1 పు.51, 52) నీలా వివాహానంతరం

"బాలచరితంబు పరిణతిం బొందిన యనంతరంబ
"కాదమితనమున నాప్పొర్టి పిదపగండు
మెఱసి పౌదవెడు మృగనాధు తెఱఁగుదోఁప
నభి నవస్ఫురద దుద్దామ యౌవనంబు
నొందె గోపికా దృక్చ కోరేందుఁడగుచు"

(హ. పూ. 6-177, 178)

అనీ, శ్రీకృష్ణుడు గోపకాంతలను తత్క్రీడలందత్యంతాను రాగవతులను చేసేముందు-

"ఒడలఁ బ్రాయంబు లావును నొప్పిదంబు,
నుక్కివంబున విక్రమ మొకటి కొకటి
కనుగుణంబులై యేరికి ననుగమింప
రాక మెఱయఁగఁ బటు విహారముల నలరె"

(హ. పూ. 8. 4)

అనీ శ్రీకృష్ణ యౌవన ప్రాదుర్భావాన్ని ఎఱ్ఱన చిత్రించాడు. శ్రీకృష్ణ జననం ఎఱ్ఱన వర్ణించిన తీరు మనోజ్ఞం.

"మహిత శ్రావణ బహుళాష్టమి నిశామధ్యంబునం బ్రస్ఫుర
ద్గ్రహముల్ స్వోచ్చ గృహంబులందయిదు విభ్రాజిల్లఁ బుత్రున్ యదూ
ద్వహుఁ బుణ్యాంగన గాంచె విశ్వజగదాధారోదయున్ ధర్మని
ర్వహణా రంభ ధురీణు నిత్య నిభృతావర్ధిష్ణునిం గృష్ణునిన్"

(హ. పూ. 5, 116)

"విశ్వజగదాధా రోదయున్, ధర్మనిర్వహణా రంభ ధురీణు, నిత్య నిభృతా వర్ధిష్ణునిన్" అని విశేషణాలు ప్రయోగించి భవిష్యత్తులో శ్రీకృష్ణుడు నిర్వహించబోయే అత్యంత బాధ్యతాయుతమైన అంశాల్ని వివరించాడు ఎఱ్ఱన. వసుదేవుడు శ్రీకృష్ణ జనన మెరిగి అంతర్గృహంలో ప్రవేశించి "నడురేయీవనజా పుత్రుఁడు వొడిచినట్లై యుండ" దర్శించిన స్వామి వర్ణన.

"నెఱులై మొప్పు చినీల కేశముల నున్నిద్రానవాబ్జంబునే
డైఱ నూత్నాంబుద తుల్యకాంతియునునై ద్వివ్యప్రభావంబునం
గఱయున్ మాగుమ లేక పుట్టిన శుభాంగం బద్భుతాపాదియై
నెఱయంగన్నులు విచ్చి చూచుతనయున్ వీక్షించి మోదంబునన్"

(హ. పూ. 5. 120)

ఇలాంటి మహాత్మునికి కంసుడు కీడు చేస్తాడేమోనని వసుదేవుడు భయపడి దేవకికి ఆ విషయం తెలిపి యశోదాదేవికడకు కొంపోతాడు.

వసుదేవునాజ్ఞతో నందుడు బాలకృష్ణుని వ్రేపల్లెకు కొని పోతాడు. అక్కడ గోపగోపీ జనసంతోషానికి అంతులేదు. కంసుని పనుపున వచ్చిన పూతన బాలునిగాంచి అత్యంత క్రోధమై, పండ్లు కొరుకుతూ విషస్తన్యమీయడానికి ఎత్తుకోగా ఆర్తుడైనట్లు శోభగా-

"ఎత్తిలి కావుకావురనసేద్యు తదీయ పయోధరాగ్రముల్
కుత్తుక దాకఁ బెట్టుకొని క్రోతఁ గ్రముంబునఁ జన్నుఁబాలతో
నెత్తురు మున్నుగాఁగ గణనీయముతై చనుస త్త ధాతువుల్
పొత్తుగఁ బ్రాణము ల్వెనఁటి బొందియ త్రిక్కఁగ నొక్క-
వ్రేల్మిడిన్" (15-151)

పూతన ఓ పెద్ద రాక్షసి: ఆ రాక్షసిని కన్ని మసిలించిన మేటి బాలకృష్ణుడు. పూతన మరణిస్తూ డిక్కులు పిక్కటిల్లగా అరచింది. ఆ భయంకర శబ్దానికి యశోదా నందనులతో వ్రేపల్లె మేల్కొంది. కృష్ణునికై తల్లి వెదకింది. ఎదుట భయంకర రాక్షసరూపం, పక్కనే బాలకృష్ణుడు కనిపించారు. ఒకవైపు భయమూ, మరోవైపు ఆశ్చర్యమూ, ఇంకోవైపు బాలుని గాంచిన ఆనందమూ ముప్పిరిగొన్నాయి. యశోద బాలుని అక్కున జేర్చుకొంది. భగవదవతారమని అందరూ భావించారు.

బాలుని నిద్రపుచ్చి యశోద స్నానార్థమై వెళ్ళింది. ఆ సందర్భంలో మేల్కొన్న బాలకృష్ణుని ఎఱ్ఱన వర్ణించిన తీరు పల్లచిత్రమే. ఆ సుందర సుకుమారాకారం అనంతానందదాయకం-

"శౌరం జేతులు రెండు గ్రుక్కికొనుచు న్మోమెల్ల బాష్పాంజన
స్మేరంబై తిలకింప నేడ్చుచుఁ బొరిన్ జేతులం గన్నులిం
పారం ద్రోయుచు లేవఁ జూచి పిలుఁదొయ్యిన్మిది కల్లాడ్చుచున్
శ్రీరంజ్యాంఘ్రి యుగంబు గింజుకొనుచుం జెల్వంబు రెట్టింపగాన్"
(5-171)

తన మాయచేత సర్వలోకాల్ని ముగ్ధులను చేసే స్వామి తానే ముగ్ధుడై అందర్నీ ఆనందింపజేశాడు. ఆదే సమయంలో శకటాసురుడు అదనెరిగి బాలుని సంహరించబోయి తానే బాలుని కాలి తాపుతో సంహరించబడ్డాడు.

"ఒకదట్టు దోర దల్లొఱగి పైఁబడుదునో,
తొల్లఁగి కమ్ములు మ్రోయ నిల్లదలింపఁ
దొడరి వేపఱతెంచి త్రొక్కుదునో, పలు
గాడి లోనైన యంగముల నొకట
నెడలించి మీఁదట నెసఁగెడు పరపెల్లఁ
బడఁద్రోచి యడఁతునో పడుచునేమి
వెరవున వధియింపఁ దొరకొన్న నాకిది
యవసరంబని తన యాత్మఁ దలఁచు
శకటు తల్లఁ పెట్టింగి చయ్యన నాలోనఁ
జరణ మొక్కటి లీలఁ జాఁచి తాఁచెఁ
దత్క్షణంబ బండిత్తల్ల తలవయ్యి పాసి
యవుల స్సంధు వెడలి యవనిఁ జెదర" (5-174)

శకటాసురు దసువులు గోల్పోతాడు. ఆ వెంటనే వచ్చి ఈ విచిత్రం చూచిన యశోద భయకంపిత అవుతుంది. నందుడు వచ్చి ఈ విపరీతమేమని అడుగుతాడు. కొందరు బాలురు చూచిన సంగతి వివరిస్తారు. అందరూ ఆశ్చర్యాంబుధి మునిగి ఆనందిస్తారు.

ఎఱ్ఱన శ్రీకృష్ణ బాల్యక్రీడా విశేషాల్ని ముగ్ధమనోహరంగా వర్ణించి సహృదయ హృదయరంజకం చేశాడు. ముద్దు, మురిపాల కాలవాలం ముద్దుల బాలకృష్ణమ్మ లీలలు:

"సొలు పారఁగ బోరగిల పొన్పు నాల్గు మూ
లలకును వచ్చును మెలఁగి మెలఁగి,
లలిఁగ పోలంబులు గిలిగింతలు పుచ్చి
నవ్వింపఁ గలకల నవ్వి నవ్వి,
ముద్దులు దొలుకాడ మ్రొక్కాలఁగేలను
దేవపుచు నెంధును ధాత్రి వ్రాసి,
నిలుచుండఁబెట్టి యుంగుళు లూఁత స్రూపఁగాఁ
బ్రీతిఁ దప్పడుగులు పెట్టి పెట్టి,

యన్నఁ దంటిఁ దండ్రిఁ గంటి నయ్యఁగంటి
విందు రావయ్య విందుల వింద వనుచు,
నర్థిఁ దమఁ బిల్చువర నదయ్యాడి యాడి,
యుల్ల సిల్లెఁ గృష్ణుఁడు శైశవోత్సవముల" (5-193)

"ఎవ్వరుగన్న నెత్తికొని యెంతయు నేడుక ముద్దులాడఁగా
నెవ్వలఁబాటి పాటితర శేషణ దీధితులొప్ప నొప్పుమై
మువ్వలు గంటలు న్మొరయ ముందటి కూఁకటి రావిరేకతో
నవ్వనజాక్షుఁడాడఁజెలు పర్మిలిఁ బెంచు జనంబు చూడ్కికిన్"
(5-194)

ఇది కృష్ణుని శైశవక్రీడ. దీన్ని ఎంతో కన్నుల పండువుగా చిత్రించి, సముచిత శబ్దప్రయోగంతో, తెలుగుదనం ఉట్టిపడేట్టు చేయడంలో ఎఱ్ఱన సూక్తి వైచిత్రి స్పష్టమవుతుంది.

మట్టిలో ఆడుకొంటున్న బాలుడు 'శైలకుంజకలభంబు' లాగా ఒప్పుతున్నాడట. పలసినంత పాలు వెన్నలు బెట్టి యశోద గృహకృత్యాలలో ఉండగా మెల్లగా కనుమొరగి ఇతర గోపీజనం వద్దకు వెళ్ళి వాలు, వెన్నలు అడిగి పుచ్చుకోవడం, అందుకై చెరగుపట్టి లాగడం, వారి కోరికపై చెప్పినట్లు 'మువ్వలు, మొలగంటలు'

ప్రమోయ ఆడడం, గోపికలు పనులను మరచి మురిసిపోవడం, 'పాపని పట్టరమ్మ' అని బాధల కోర్వక యశోదకు అప్పగించగా మళ్ళీ 'గోకుల మిల్లిల్లు దప్పకుండ లక్ష్మీపతి గ్రుమ్మరు'తూ ఉండడం ఎంతో చిక్కగా వర్ణించాడు ఎఱ్ఱన. కృష్ణుడు బలరాముడాదిగా గోపబాలురతో వ్రేపల్లెలో చేసినవి — చిన్నవే అయినా — ఆగడాలకు కొదువలేదు. ఉట్లలోని పాలు, పెరుగు, వెన్నలు తినడం, కడవల లోని పాలు సగం తాగి నీటితో నింపడం, కట్టివేసిన దూడల్ని తల్లుల పాలకై వదలివేయడం, పిల్లలలో వారిలో వారికి తగవులు పెట్టి ఆనందించడం మొదలైన బాలక్రీడలెన్నో చేశాడు. గోపికలు విసిగి పోయి కూడబలుకుకొని యశోదకు కృష్ణ దుష్టచేష్టల్ని ఏకరువు పెట్టు కొంటారు. తాముబడ్డ పాట్లన్నీ చెప్పుకొని చివరికి—

"ఏ పొలములఁ బాడయ్యెనె,
ఈ పల్లెకుఁ జిచ్చుపెట్టి యేగెద మేమున్
మా పనులును గలిగిన నట
నే పగిదిని బ్రదుకరాదె యిటు చెడుకంటెన్" (5-220)

"ఎక్కడకేనియుఁ బోయెద
మిక్కష్టపు, బాటు పడఁగనే మోర్వమునీ
చొక్కపుఁ గొడుకును నీవును
నొక్కతలై గ్రుక్కుమాని యుండుడు నెమ్మిన్ (5-232)

అని గట్టిగా, నిక్కచ్చిగా చెప్పారు. యశోద వారినందరినీ సమ్మతింప జేసి పంపించివేసి, బాలకృష్ణుని చేరదీసి ఎందుకలా పాలకోసం పోతావు 'నీకే బ్రాఁతియే వెన్నలుం పాలును' అని అక్కున జేర్చు కొని పాలిచ్చింది. కృష్ణుడు కడుపార పాలు తాగిన పిదప పనుల మూలాన వదలిపెట్టితే మళ్ళీ మామూలుగా ఆగడాలు చేస్తాడని 'కాచుట మాకుం గడు వ్రేగు' అని మెల్లగా కృష్ణుని ఉలూఖలా బద్ధుని చేస్తుంది. 'నున్నని సెలగోల చేతంగొని, కదలిన మొత్తుదు నెక్కడ గదలెద పటుగఁదులాఁడ కదలుమయే, జూచెద" అని హెచ్చరించి (5-244, 245) పనిలో మునిగిపోయింది. కృష్ణుడు రోలు నీడ్చు కొని పోయి దగ్గరలోని యమళార్జున భంజనం చేస్తాడు. తెలిసిన గోపికలు ఈ చోద్యం యశోదతో చెప్పి నీ కొడుకును రక్షించు కొమ్మంటారు. ఆ సందర్భంలో ఎఱ్ఱన యశోదా మనోభావాన్ని వర్ణించిన తీరు అద్భుతం.

"అనినం దల్లడమంది మేను విరియన్ హాయంచు గోపాల భా
మిని విస్రస్తములై పటాంచలము ధమ్మిల్లంబుఁ దూలంగలో
చన పద్మంబుల బాష్పధార లెసగన్ సంభ్రాంతిఁ బాదద్వయం
బును దొట్రిలఁగఁ బాఱె గోపికలు నద్భూతార్తయై తోఁజనన్"
(5-249)

అక్కడ బాలకృష్ణుడు 'మేఘ ద్వయ మధ్యనిద్యోతి యగు శీతాంశుడు నుంబోలె' 'మందస్మిత సుందర వదన మండలంబున నగ్రిమ చూడా మండనంబు వోలెయం బొలు పారుతూండగ' చూచి వెంటనే యశోద కొడుకు నెత్తుకొని ఆశ్చర్యానందంలో మునిగిపోయింది. ఆ వెనుక బలరామునితోపాటు ఏడు వత్సరాల వయసున్నవాడై కృష్ణుడు గోపాల బాలురతో కూడి ఆడి గోవులు గాయడం, ఛల్లులు కుడుపడం మొద లైన బాల్యక్రీడలు ఆచరించి ఆనందంలో తేలియాడుతూ, వ్రేపల్లె నంతటినీ సంతోషింపజేశాడు.

నారదోపదేశంలో నందుడు సమస్త బాంధవులతో బృందా వనానికి పయనమైన తీరులో ఎఱ్ఱన పల్లీజన జీవన విధాన మెరిగిన విషయం కన్నులకు గట్టినట్లు "బండ్లమెట్టింపు" (6-22) పద్యంలో స్పష్టమవుతుంది. కొంతకాలానికి గోప గోపీ జనం రోగగ్రస్తమవు తుంది. అందుకు కారణం విషపూరిత కపిత్థ వృక్షమని తెలిసి బలరామునితోపాటు శ్రీకృష్ణుడు తత్ఖండనం (6-85-91) చేస్తాడు. తత్పీడ విరుగడవుతుంది. ఆ వెనుక మిథిలాపురంలోని కుంభకునింట రాక్షసాంశ సంభూత సప్త వృషభాల్ని (6-165-169) వధించి నీళను చేపట్టుతాడు.

శ్రీకృష్ణ బాల్యక్రీడలలో ప్రముఖ ఘట్టం కాళీయమర్దనం భయ విస్మయానందకరం. కాళీయునిచేత చుట్టబడిన కృష్ణునిగూర్చి ఎంతో భయాతుర అవుతుంది యశోద. కాళీయుని ఐదు పడగలపై కురికి దాని తోకను చేతబట్టుకొని నాట్యంచేస్తూ కాళీయుని మర్దించడం ఎఱ్ఱన అత్యంతాకర్షణీయంగా వర్ణించడం గమనించదగ్గ అంశం.

"యమునా వీచి మృదంగ వాద్యములు ప్రమోయందీర గోపౌ ఘహ
ర్ష మనోజ్ఞ ధ్వనితంబు గేయముగఁ జంచత్కాళియ వ్యాళభో
గ మహారంగ తలంబునం బటుగతిం గంజాక్షు నిర్మర్దినా
ట్యము హృద్యాద్భుత భీమమై పరఁగ దివ్యశ్రేణి చూచెన్ దివిన్"

"వెసదామోదరు పాదఘాతనగతుల్ వేవేల చందంబులం
బ్రసభాటోపముఁ బాపఁ బాపఫణ భృత్పాలచ్ఛటా మండలం
బసహంబై నాగిలెన్ మణుల్ సెదరఁగా నాస్యంబులన్ శోణితం
బెసగన్ దంష్ట్రిలు నున్నగా గరళపహ్నా జ్వాలికల్ వెల్వడన్"
(7-49-50)

శక్తిహీనుని చేయగా 'కాళియ మౌళిరంగనటునకు' సర్వలోకవాసులు జయ జయ ధ్వనులు చేశారట ఆనందంతో. కాళియుడు శరణు వేడగ యమున వదలి వెళ్ళిపొమ్మని కృష్ణు డాదేశించగా సముద్రానికి వెళ్ళి పోతాడు. నది వెలువడి క్షేమంగా వచ్చిన కుమారుని గాంచిన

తల్లియుఁ దండ్రియుఁ బ్రమదము
వెల్లిగొనఁగఁ గౌఁగిలించి వేదీపసలీ
నుల్ల మలర నతడును బ్రణ
మిల్లి సమాశ్వాస వాక్యమితి పచరించెన్" (7–63)

ఇంతటితో శ్రీకృష్ణ బలరాములు, సాహసబల మహిమాది గుణాలు గోకులంలో విదితమై భక్తిప్రపత్తిని ప్రకటించడం జరిగింది.

అనూచానంగా నందాదులు చేస్తూవచ్చిన ఇంద్రోత్సవాన్ని కాదని పర్వతోత్సవం చేయగా కోపించిన ఇంద్రుడు రాళ్లవర్షం భయంకరంగా కురిపించగా కృష్ణుడు గోవర్ధనోద్ధరణం చేసి గోగోప గోపీజనాన్ని రక్షించాడు. "గోవర్ధనుండు గోవర్ధనోద్ధరణం బొనర్చి సకల గోపాల భయంబు నాలోకించి"

"ఈవానం బరిపీడ నొందు పసుల న్వీక్షించి రక్షార్థమై
వే వేయద్ధగణీధ్రము బెకికితిన్ విస్తీర్ణ మీక్రింద మీ
రేవా రెచ్చటనుండఁ గోరితిరి వారెల్లఁ బసుశ్రేణితో
భావముల్ భయమజ్జగించి చోరుఁడీ భవ్యాద్రి చాటందఱున్ ల"

"బహు సహస్ర సంఖ్యలుగల పసులకెల్ల
నిడుపు దగిన యిమ్మెయ్యది యిచట ననకుఁ
డెనసి త్రైలోక్యమును వచ్చెనేని నిమ్ము
గలదు వెండియు వెలితియ కాఁగనుండు"

(7-180, 181, 182)

తనవారు సంతసించారు. వర్షమాగిపోయింది. ఇంద్రుడు వచ్చి శ్రీకృష్ణుని మహిమను స్తుతిస్తాడు. ఇక్కడ ఎర్రన చాల సముచిత రీతిని చక్కని శైలీ విన్యాసంతో రచన సాగించి మనోజ్ఞం చేశాడు.

శ్రీకృష్ణ బాల్యక్రీడలలో రమ్యమైంది గోపకాంతలతో క్రీడించడం. ఎర్రన మధుర మంజుల మనోజ్ఞంగా వర్ణించడం గమనించగలం. అందుకు ప్రాతిపదికగా శ్రీకృష్ణ సౌందర్యంతోపాటు భువన మోహనమైన వేణునాద వర్ణన గావించాడు; అందుకు తగిన కృష్ణ యౌవన ప్రాదుర్భావాన్ని చిత్రించాడు.

"అభినవ బర్హి బర్హాపీడ లక్ష్మిను
ల్లాసించు కేశకలాప మమరఁ,
గమనీయ కేయూర కంకణోర్మి కలకుఁ
దొడవైన నిడుగేలు దోయి మెఱయ,
అమ్లాన కుసుమ సమంచిత మాలిక
గ్రైసేయు విపుల వక్షంబు దనర,
హారిద్ర కౌశేయ హారిజంధముఁ గృతా
ర్థముఁ జేయు పృథుకటీతటి యెలర్ప"

జిఱుత నవ్వున నిండారు జిగియుదార
లలిత నేత్రాంచలంబుల నలుపువెడల,
వెన్నుఁడఖిలైక మూర్తి దా వేణునాద
ఘన సుధాంభోధి మొండొంద గడలు కొలిపె" (8.7)

ఆ "వేణునాద ఘన సుధాంభోధి"లో మునిగిపోయింది సమస్త ప్రాణకోటి. గోగోప గోపీజనం ఆనందాబ్ధిలో మునిగిపోయింది. చేష్టలు దక్కి. అప్పుడు సుందర బృందావన లతానికుంజాలలోనికి గోపీ జన సందోహాన్ని ఆకర్షించాడు.

"తల్లిదండ్రులు మాన్ప భర్తలు మగడ్పఁ
జెలులు వలదనఁ జుట్టలు నిగ్గుపఱుప
వ్రేత లొకటియు నెఱుఁగక వెన్ను వెనుకఁ
దగిలి పోయిరి తమకంబు తవులు కొనఁగ" (8-14)

ఇలా ఆకృష్టలై శ్రీకృష్ణుని అత్యంతాసక్తితో భజించి-

"లలితా లోకములన్ మనోజ్ఞ మధురాలాపంబులన్ విస్ఫుర
త్కలహాసంబుల బంధుర స్తన భరోత్తానాంగ సంగంబులన్
విలసద్వక్త్ర సరోరుహార్పణములన్ స్నిగ్ధోరు సంవేష్టనం
బులఁ బూజించిరి గోప భామలు జగత్పూజార్హు దాశార్హునిన్"

(8-19)

ఇలాగా "కృష్ణాఖ్య దక్క నయ్యంగనలకు రాదు వేరొక వాక్యంబు రసన తుదకు (8-20) ఇది ఆత్మ పరమాత్మల సంయోగం: మధుర భక్తికి మనోజ్ఞ నిదర్శనం.

అరిష్టుడనే రాక్షసుడు వృషభ రూపధరుడై వ్రేపల్లె నెల్ల అల్లకల్లోలం జేసి రంకెలువైచి గోగోపకులను పీడిస్తూ అలవిగాక పరిస్తుండగా కృష్ణుడవలీలగా వధిస్తాడు.

"తానును దైత్యులావునకుఁ దర్పము మెచ్చుచుఁ జేర్చి దేవకీ
సూనుఁడు కొమ్ములూఁది మెడ స్రుక్కగ నెత్తి నులించి త్రిప్పి వే
వేనెటి దప్పఁ ద్రోచుటయు విహ్వలుఁడై రుధిరంబు కన్నా
సానయ నంబులందొరుఁగ స్వర్గ విరోధి యపాస్త జీవుడై"

(8.50)

ఇలాగే అశ్వరూప ధరుడై వచ్చిన కేశి యనే రాక్షసుని సంహరించి అందరి కృతజ్ఞతలకు, మన్ననలకు అర్హుడవుతాడు కృష్ణుడు.

ఆ వెనుక కంసుని ఆజ్ఞతో అక్రూరుడు వ్రేపల్లెకు వెళ్ళి కృష్ణుని దర్శించి సంతుష్టాంతరంగుడై, దేవకీ వసుదేవుల పరితాపం స్పష్టం చేస్తాడు. శ్రీకృష్ణుని మహిమను గుర్తిస్తాడు దారిలో

యమునా నదీజలాల్లో స్నానార్థమై వెళ్ళినప్పుడు. మధురాపుర ప్రవేశ సమయంలో, కోరిన ధౌత వస్త్రాలివ్వనందుకు మడవాలుని వధించి, గ్రహించి, అనుగ్రహించడం, సుధామనామునివల్ల ప్రసూన దామంటులు స్వీకరించడం, కంసునికొరకై సుగంధాను లేపనాల్ని కొనిపోతున్న కుబ్జనుంచి గ్రహించి సురూపను చేయడం, బలరామ సమేతంగా ఆయుధాగారం ప్రవేశించి కంసుని ఆయుధాల్ని నాశనం చేసి కృష్ణుడు తన పరాక్రమాన్ని ప్రకటించడం చక్కగా వర్ణితం. ఇది కృష్ణ బలపరాక్రమ మహిమలకు నిదర్శనం.

కంస సంహారాత్పూర్వం కంసు పంపున వచ్చిన కువలయా పీడితంబనే ఏనుగును సంహరించడం, ఆ వెనుక చాణూర ముష్టికులనేమల్లులలోని చాణూరుని వధించడంతో శ్రీకృష్ణ బలపరాక్రమ సంపన్నతలు స్పష్టమవుతాయి. ఆ వెమక కంస సంహారం. అద్భుతానందాలకు తావలమై సహృదయ రంజకమవుతుంది.

"మణులు రాలగఁ జారుమకుటంబు వడదన్ని
వడి వెంద్రుకలు వట్టి వ్రాలఁ దిగిచి,
నడుతల యందంద పిడికిట మెదడును
గలగఁగ బొడిచి మ్రోకాలనురము
దాఁ కింప, నొక్కచేతయుఁ జేయలేక, ని
శ్చేష్టుఁడై రోఁజు నిర్జీవు, బెలుచ
హారములే ద్రెవ్వఁ గర్ణాపతంసము లూడ.
న త్తరి ను త్తరీయంబు వీడ,
నోర ముక్కునఁ జెవులన ఘోర రుధిర
మొలుక గ్రుడ్లులు వెలుపలి కుతి కమేడ
డిగ్గఁద్రోచి తోడన డిగ్గి స్రగ్గఁగేల
గ్రమ్మెనుసుఱు పోవంగ సక్రోధలీల" (9-145)

కంస వధానంతరం ఆతని సోదరుడు సునాముడు ఎదుర్కొనగా బలరాముడు సంహరించాడు. దేవతలు బలరామ కృష్ణులపై ఆనందాతిరేకంతో పుష్పవృష్టి గురిపించారు. కృష్ణుడు తల్లిదండ్రులు దేవకీ వసుదేవులకు నమస్కరించి ప్రేమాశీస్సులను పొంది వారి వానందంలో ముంచి తాను సంతసించాడు. ఆ వెంటనే ఉగ్రసేనునికి, వృద్ధులకు నమస్కరించి వారి ఆశీస్సు లందుకొన్నాడు. కంస మరణంతో అంతఃపుర స్త్రీలు మిక్కిలి రోదించారు. తదనంతరం కృష్ణ ననుజ్ఞతో ఉగ్రసేనుడు కంసునికి దహన సంస్కారం చేస్తాడు. తన పరాక్రమ సంపన్నతతో సంపాదించిన రాజ్యానికి తానే అర్హుడు. 'రాజ్యం వీరభోజ్యం'' తండ్రి ఉగ్రసేనుని కాదని దుష్టుడై సింహాసన మాక్రమించిన కుమారుడు కంసుడు. అతనిని సంహరించిన కృష్ణునిదే రాజ్యం. కానీ ఉగ్రసేనుని రాజ్యాభిషిక్తుని చేస్తాడు కృష్ణుడు.

"నీ సొమ్మె పెనుపొంది రాజ్యము దగన్నికీక నీచాత్ముడై
నీ సూనుండేడ నాక్రమించికొని యెన్ని ర్వ్యాజభంగిందుదిన్
దోసంబేమియు లేక యంతమును నిన్నుంజేరెఁ గై కొమ్మనా
యాస ప్రక్రియ నిప్డు పొందు మభిషేకానంద కళ్యాణమున్"

"ఏను గెలిచిన సిరి నీకునిచ్చుచున్న
వాఁడ నామీఁదఁ బ్రియమును వత్సలతయుఁ
గలిగెనేనిఁ ద్రోవక చేయవలయు నాదు
ప్రార్థనంబు సర్వాన్వయ ప్రభుడ వీవు" (9-185-186)

అని ఉగ్రసేనుని రాజును గావించి ఔచిత్యాన్ని, ఔదార్యాన్ని పాటించాడు. తరువాత సందీపని యొద్ద బలరామ కృష్ణులు విద్యనభ్యసించారు.

ఇలా ఎర్రన సముచితరీతిని బాలకృష్ణుని క్రీడా విశేషాలను జన్మం మొదలు కంసవధ, ఉగ్రసేన రాజ్యాభిషేకం వరకు అత్యంత మనోహరరీతిని వర్ణించి తరించారు.

శ్రీకృష్ణ బాల్యక్రీడల్నే భాగవతంలో సహజకవి, మహాభక్తుడు అయిన పోతన భక్తి నిండార సూక్ష్మాతి సూక్ష్మంగా వర్ణించడం చూడగలం, ఎర్రన సంయమనంతో సముచిత రచన చేయగా మహాభక్తునికుండే ఉద్రేకంతో ఆయా పాత్రలుగా తానే అయి పోతన చిత్రించి తన భక్తితత్పరతను స్పష్టం చేశాడు.

ఎర్రన నన్నయ తిక్కనలవంటి ఆర్షకవి గనుక కవిత్రయంతో ఒకడయ్యాడు. హరిహర నాథతత్వాన్ని తిక్కననుంచి గ్రహించినా నాచన సోమనాథుడు ఈ హరివంశ పూర్వభాగాన్ని రచించలేదు. అతడు ఉద్రేకం, ఆవేశం, అత్యంతాధిక్యంగా కల కవి. ఎర్రన ఆ సంయమనశక్తి మూలంగానే అరణ్యపర్వ శేషాన్ని నన్నయ శైలితో ఆరంభించి, తిక్కన శైలితో కలిపి వారధిగా నిలచాడు. ఇది ఎర్రన విశిష్టత.

మధు గీతికలు!

ప్రభువు కన్నులు
తామరపువ్వులు
కోమలమునకు తావలములు
సాధారణములు!
సఖియ కన్నులు
ఇప్పపువ్వులు
కైపునకు పట్టులు
ఆకర్షకములు!

*　　*　　*

రాయివంటి
నా హృదయము
సాక్షి!
నీ నరకములోని సారాయి వాసన
సోకగానే తెలివొంది,
పులకించి
వేదాల సారమును గ్రహించె!
భద్రాభిరామమూర్తియై ప్రకాశించె!

*　　*　　*

(1)"అక్కడ పదములు" వ్యత్యయమైతే
"వృత్రాసురుని వ్యవహారం"!
(2)"ఇక్కడ" పదములు వ్యత్యయమైతే
"హరిశ్చంద్రుని అవతారం"
అది కఠినమైన సజా!
ఇది మధురమైన మజా!

*　　*　　*

బాధలతో కాలే
ఈ కట్టెను
కాల్చి
శాంతి నందిస్తుంటుంది
మృత్యువు:
చల్లార్చి
శాంతినందిస్తుంటుంది
మధువు!

*　　*　　*

చదువుల సంసారం రుచి చూచినవాడే కాదు
మధువుల సారం
రుచి చూచినవాడు కూడా
ప్రహ్లాదుడే!

(1) అక్కడ అనగా విద్యాగోష్ఠులలో అని భావము. (2) ఇక్కడ అనగా పానశాలలో అని భావము.

కనికరించు కల్యాణమూర్తీ!

ప్రభూ!
నువ్వు వ్రాసిందే గదా!
"నా జీవిత తాళపత్ర గ్రంథం"
అందలి చివరి కమ్మ దొరకటంలేదా?
ఏ మచ్చుపైన పారవేశావో!
తట్టెడు దుమ్ము పట్టి ఏ మూలనున్నదో!
వెదకి, దులిపి చూడటానికి
తీరుబడీ లేదా స్వామీ!
ఏ తీరుగానైె సొసరే దాన్ని
చిక్కించుకొని
వేగిరమే దానిపై
'సమాప్తమని' వ్రాసెయ్!
నాకు విముక్తి చిక్కుతుంది!
అబ్బబ్బ!
ఈ బాధలూ, ఈ వ్యథలూ
నన్ను ఊపిరి సల్పనీయటం లేదు!
ఓపిక ఉడిగిపోతున్నది!
ఆయాస మెక్కువవుతున్నది!
కనికరించు కళ్యాణమూర్తీ!

శ్రీ కె. కిశోరుబాబు;　　శ్రీ కె. అశోకుబాబు

శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి

పెదకొండూరు శిలాశాసనములు

గడచిన జూన్ నెల భారతి సంచికలో (జూన్ 1988) డాక్టరు ఇంగువ కార్తికేయ శర్మగారు 'ఆనందేశ్వరాలయము-పెదకొండూరు' అను శీర్షికతో పెదకొండూరు గ్రామముయొక్క ప్రాచీనతను, అచటి ఆనందేశ్వర నామమున పూజింపబడుచున్న విశిష్టమగు శివలింగము యొక్క ప్రాశస్త్యమును గూర్చియు ఒక వ్యాసమును వ్రాసిరి. ఆ శివలింగమునకు శిరసున జటామకుటమును పోలియుండు శిఖ యుండుటయు (దీనిని జటామకుట మనుటకంటె లింగముపైన పడగ విప్పిన సర్పముగా చెప్పుట మంచిది.) లింగముయొక్క క్రింది సగ భాగముపై అర్ధనారీశ్వర రూపము తక్కువ ఎత్తు (లోరిలీఫ్)లో మలచబడి యుండుటయు దాని విశిష్టత. క్రీ.శ. 4వ శతాబ్దం మొదటి భాగములో ఇప్పటివరకు తెనాలి, నర్సరావుపేట, గుంటూరు తాలూకాలలో చేరియున్న ప్రాంతమును పాలించిన ఆనంద గోత్రజు లయిన కందరవర్మ, దామోదరవర్మ, అత్తివర్మ అను రాజుల కాలములో ఇచటి ఆనందేశ్వర లింగము ప్రతిష్ఠించబడి యుండునని డా॥ శర్మగారు చెప్పినది విశ్వసించదగియున్నది. శివలింగము పల్నాటి పాలరాతిదై యుండుటయు, గ్రామములోని ఇళ్లు కట్టిన దిబ్బలకంటె పల్లములో ఈ గుడి యుండుటయు అనగా ఆ దిబ్బలు అంత యెత్తుగా పెరగకముందు కాలమునాటికి యీ శివలింగము చెందినదై యుండునని ఊహించవచ్చును. డా॥ శర్మగారు వివరించిన విషయములు కూడ గ్రామముయొక్క ప్రాచీనతను తెలుపుచున్నవి. ఆనందేశ్వరస్వామి గుడిగాక ఈ గ్రామమునకు ఉత్తరముగా కృష్ణా నదీయొడ్డున రాజరాజేశ్వర శివాలయము, గ్రామమధ్యమున ఎత్తైన దిబ్బమీద జనార్ధన స్వామి గుడియు, ఆనందేశ్వరస్వామి గుడికి ముందు గ్రామదేవతయగు పుట్టలమ్మ గుడియు మొత్తము నాలుగు గుళ్లు ఇచట కలవు. రాజరాజేశ్వరస్వామి గుడిలో రెండు శాసనములు, ఆనందేశ్వరస్వామి గుడియొద్ద ఒక శాసనమును గలవు. ఈ శాసనములను మూడిటిని దక్షిణ భారత శాసనసంపుటి పదవదానిలో భారత ప్రభుత్వ శాసన పరిశోధన శాఖవారు ప్రచురించియున్నారు.

మొదటి రెండు శాసనాలు రాజరాజేశ్వరాలయములో గలవు.[1] అందొకటి శకవర్షము 1092 (క్రీ.శ. 1170-71) లోను, రెండవది శకము 1095 (క్రీ.శ. 1173-4)లోను గుడి ముఖమండపు గోడలోని స్తంభముపై తొలిపించబడెను. ఈ రెండును ఒకే కుటుంబమునకు చెందిన వ్యక్తులు ఇరువురు ఆ దేవుని కొసగిన దానములను తెలుపుచున్నవి. మొదటిదానిలో శ్రీమద్విక్రమచోడ నృపతియొక్క సామ్రాజ్య లక్ష్మీకరుడైన కన్దనృపుడుండెడివాడనియు, అతడు పరాక్రమవంతుడనియు, నాలుగు గృహముల యజమాని అనియు కొండ్రూరి గ్రామాధిపతియనియు, ప్రశంసించబడెను. ఆ కన్దనృపునకు కామభూపతి, ద్రోణరాజు, భీమభూపుడు, రామనృపుడు అను నలువురు పుత్రులుండిరి. వారిలో ద్రోణాధిపుని పుత్రుడు మల్లదేవుడను శివబ్రాహ్మణుడు శ్రీ రాజరాజేశ్వర దేవునకు ఇరువది నాలుగు గోవులను కొంత భూమిని రెండు అఖండ దీపముల కొరకై దానమొసగెనని చెప్పబడెను. వారిది శైవ బ్రాహ్మణ కుటుంబము. వారి మూలపురుషుడగు కందనృపుడు చతుర్గృహపతి యని చెప్పబడెను. అనగా నాలిగిండ్ల యజమాని. పూర్వము ఒకయూరిలో నుండెడి జ్ఞాతులందరికి ఒక్కొక్క పెద్ద వ్యవహర్త యుండువాడు. ఆ యిండ్ల వారందరి మంచిచెడ్డలు ఆయన పర్యవేక్షించువాడు. ఆయనను గృహపతి, గహపతి, లేక, కుటుంబి అందురు. ఆనాటి సమాజములో ఒక యింటివారు, లేక, ఒక కుదురుకు చెందిన జ్ఞాతులు వారిలో నొకరిని పెద్దగా అంగీకరించేవారు. ఇట్టి గృహపతులు కొందరు అమరావతిలోను ఇతరత్ర గల ప్రాకృత శాసనములలో పేర్కొన బడిరి. ఈ గృహపతులు గ్రామ సభయందు సభ్యులుగా నుండువారు. గ్రామంలో దానములు చేయునపుడు రాజులు కుటుంబినులని పేర్కొనుచు వారితో చెప్పి చేయువారు. ప్రస్తుతము శాసనమందు పేర్కొన బడిన కందనృపుడు నాలుగు శైవ బ్రాహ్మణ కుటుంబాలకు పెద్దగా నుండెడివాడు.

ఆ కందుడను గృహపతి ఒకప్పుడు తన పరాక్రమ విశేషముతో విక్రమచోడ చక్రవర్తికి యుదములో సహాయ మొనర్చి ప్రతిఫలముగా కొండ్రూరి గ్రామాధిపత్యము సంపాదించుకొనెను. అప్పటి నుండి అతను గ్రామములో ఒక గృహపతియేగాక గ్రామాధికారి కూడ నయ్యెను. అందువలన అతను నృపుడని, ప్రభువని, నాథుడని ప్రత్యేక బిరుదులు పొందెను. అతని సంతతివారు గూడ ఆ

గ్రామాధికారము నిర్వహించుచు ఆ బిరుదులను వాడుకొనిరి. ఆ కాలమున గ్రామప్రభువు గ్రామమునందు పన్నులు వసూలుచేసి రాజోద్యోగులకు చెల్లించుట, గ్రామస్థుల బాగోగులు విచారించుట, అవసరమగునప్పుడు న్యాయస్థానము నేర్పాటుచేసి తగవులు తీర్చుట, గ్రామములో రాజునకు చెందిన భూములు గ్రామస్థులద్వారా వ్యవసాయము చేయించి అందలి ఫలసాయమును రాజోద్యోగులకు ముట్టచెప్పుట మొదలగు విధులను నిర్వర్తించువాడు. అందువలన ఆయన గ్రామానికి చిన్న ప్రభువుగా పేర్కొనబడువాడు. దానికి ప్రతిఫలముగా ప్రభుమాన్యమనెడి ప్రత్యేకభూమిని కొంత అనుభవించుటయే గాక రాజుకు చెందవలసిన కొన్ని ప్రత్యేక మర్యాదలను అనగా పండుగలు, పబ్బములు వచ్చినపుడు గ్రామస్థులు చెల్లించే స్వల్ప కానుకలు తను పొందువాడు. ఈ యధికారములు, మర్యాదలు క్రమక్రమముగా తగ్గిపోయి నప్పటికి గ్రామాధికారి పదవి యిటీవలి వరకు నిలిచియుండెను. మూడు—నాలుగేండ్ల క్రిందట గ్రామాధికారుల పదవి పూర్తిగా రద్దుచేయబడుట అందరకు తెలిసినదే. పైనచెప్పిన కన్దనృపతి ఆతని పుత్రులు అట్టిపదవిని కలిగియున్నట్లు వారి పేర్లలోనున్న అధిప, భూప, నాథ, నృప ఇత్యాది విశేషణములు తెలుపుచున్నవి, కొండ్రూరు గ్రామము ఆనాడు 18 గ్రామములకు ముఖ్యస్థానముగా నుండెడిదని ఇచటి మూడవశాసనము తెలుపుచున్నది. కనుక కందన్నృపుని కుటుంబము వారికి అందరికి ఆ గ్రామాలపై ఆధిపత్యముండెడిదని తోచుచున్నది.

కందనృపుడు విక్రమచోడ నృపతికి సామ్రాజ్యలక్ష్మిని చేకూర్చినట్లు చెప్పబడెను. ఈ శాసనకాలము శతాబ్దము 1092కు సరియగు క్రీ.శ. 1170. ఇందలి దాతయగు మల్లదేవుడు అతని మనుమడు కనుక కన్దనృపుని కాలము సుమారు నలుబది-యేబదేండ్లు ముందై యుండును. విక్రమచోడ చక్రవర్తి చాళుక్య చోళవంశానికి చెందిన మొదటి కులోత్తుంగచోడ చక్రవర్తి కొడుకు. క్రీ.శ. 1118 నుండి 1133 వరకు చోళ, వేంగి దేశముల నతడు పాలించెను. అతని కాలములో పశ్చిమ చాళుక్య చక్రవర్తియైన ఆరవ విక్రమాదిత్యుడు తన సేనాపతియగు అనంతపాలయ్యను పంపి కోస్తా ఆంధ్రదేశము నాక్రమించుకొనెను. క్రీ.శ. 1127 మొదట ఆ విక్రమాదిత్యుడు చనిపోయెను. అది చూచి విక్రమచోడుడు తను పోగొట్టుకొన్న కోస్తా ఆంధ్ర ప్రాంతమును తిరిగి సంపాదించుకొనెను. ఈ యుద్ధములలో కావచ్చును. కొండ్రూరి కందనృపుడు విక్రమచోడునికి సహాయమొనర్చి ప్రతిఫలముగా ఆ గ్రామానికి ఆధిపత్యము పొందిన సందర్భముననే ఆతడు దేవునికి దానములు చేసియుండును. అప్పుడు చందవోలు రాజధానిగా వెలనాటి చోడులనబడు దుర్జయ వంశమువారు ఈ ప్రాంతమును సామంతరాజులుగా పాలించుచుండిరి. వారిలో రాజేంద్రుడనువాని పేరనే యీ రాజరాజేశ్వరాలయ నిర్మించబడి యుండును. లేక అంతకుముందే క్రీ.శ. 1020 నుండి 1060 వరకు రాజ్యమేలిన రాజరాజనరేంద్రుని కాలములో ఇచటి స్థానిక సామంతుడు తన చక్రవర్తి పేర ఈ రాజరాజేశ్వర శివలింగమును ప్రతిష్ఠించి ఆలయము నిర్మించియుండును.

ఈ ఆలయమందున్న రెండవ శాసనము. పై శాసనమందు చెప్పబడిన కన్దనృపుని నాల్గవ కొడుకు రామనృపుడు రాజరాజేశ్వర దేవునికి రెండు అఖండదీపములు, నైవేద్యము నిర్వహించుటకై మూడు క్షేత్రములను దానమొసగెను. క్షేత్రమనగా ఒక భూభాగము. అట్టివి మూడు భాగముల నిచ్చెను. గుడిలో పరిచారికులుగా నిరువురు స్త్రీలను కూడ నియమించినట్లు చెప్పబడెను. ఈ శాసనకాలము శకము 1095కు సరియదు క్రీ.శ. 1173-4.

మూడవ శాసనము అనంతేశ్వరస్వామి గుడి ప్రాంగణమున నొక మెట్టు జాతి స్తంభముపైన మలచబడెను. ప్రస్తుతమీ శాసన స్తంభము రెండు ముక్కలుగా విరిగియున్నది. ఈ శాసన కాలము శకము 1239, పింగళనామ సంవత్సర జ్యేష్ఠశుద్ధ అష్టమి గురువారము. క్రీ.శ. 1317. అప్పుడు కాకతి ప్రతాపరుద్రదేవ మహారాజు ఆంధ్ర దేశమును పాలించుచుండెను. ఆ రాజుకి సామంతుడు, సేనానాయకుడు అగు మాయి దేవలెంకంగారు ఇచటి ప్రాంతీయాధికారిగా నియమితులైన సందర్భమున ఈ శాసనము వేయించియుండును, కొండూరి స్థలములో జేరిన 18 ఊళ్లలోను గల దేవమాన్యాలనుండి కొన్ని పన్నులు, సుంకాలు, కొన్ని ప్రత్యేక పన్నులు వసూలు చేయుట మానినట్లు ప్రకటించుటకై యీ శాసనము వేయించబడెను. మినహాయించబడిన పన్నులలో గడ్డుగ, కానిక, అమ్మకడ సుంకాలు, బంచెల ఆయము, తలారి పన్ను పేర్కొనబడెను. గడ్డుగ అనేది పల్లపు భూములపై విధించే ప్రత్యేకపు పన్ను అని తోచుచున్నది. దీనికి సరియైన అర్థము తెలియదు. కానుక అనేది భూస్వాములు రాజునుగాని రాజప్రతినిధినిగాని పండుగ పబ్బములలో చూడబోయినపుడు చెల్లించెడి ప్రత్యేకమైన కట్నముగా మొదట ఆచారముగా నుండెను. కాని కాలక్రమంలో దానికొక నిర్బంధముగా భూస్వాములు, మఱికొందరు ప్రతి సంవత్సరము చెల్లించే పన్నులలో చేర్చిరి. అంటే వారు రాజునుగాని రాజప్రతినిధినిగాని సందర్శించుటకు వెళ్ళినా, వెళ్ళకపోయినా రాజభవనములో ఉత్సవాలు, వేడుకలు జరిగినా, జరుగకపోయినా వారి వారి తాహతునుబట్టి రాజు నిర్ణయించిన మేరకు తప్పనిసరిగా చెల్లించవలసిన పన్నుగా రూపొందెను. అది దేవుడి మాన్యాలపై రద్దు చేయబడెను. అమ్మకడ సుంకమనగా రైతులు తమ ధాన్యాలు వ్యాపారులకు సంతలలోగాని ఇళ్లవద్ద గాని అమ్మునపుడు (సేల్సుటాక్సు) చెల్లించే పన్ను. ఈ పన్నును దేవ

మాన్యాలలో పండే ధాన్యం అమ్ముకొనేప్పుడు మినహాయించబడెను. అంటే దేవస్థానంవారే రైతునుండి ధాన్యం తెచ్చుకొని స్వయంగా అమ్ముకొనే సందర్భములలో ఈ మినహాయింపు వర్తించును. దీనివలన దేవస్థానము మాత్రమే లాభము పొందును.

బంచెల ఆయము అనునది సైన్యములో చేరిన బంటులను పోషించుటకై రైతులు తాము దున్నెడి భూపరిమితినిబట్టి చెల్లించవలసిన పన్ను, ఈ పన్ను దేవుడి మాన్యాలపై రద్దు చేయబడెను. ఈ సందర్భమున చెప్పవలసిన విశేషమొకటి గలదు. కాకతీయ రాజులు తమ సైన్య నిర్వహణ విధానములో ఒక క్రొత్త పద్ధతి నవలంబించిరి. తమకు కావలసిన సైన్యమునంతను రాజధానియైన ఓరుగల్లులోనే పోషించువారు కాదు. అచట పరిమితమైన కొద్ది సైన్యమును మాత్రము పోషించి దుర్గరక్షణము చూచుకొనువారు, యుద్ధ సమయములలో పోరాడుటకు ఆ సైన్యము చాలదు కనుక రాజ్యమునందు ఇతర నగరములలో కూడ సైన్యములో బంట్లుగా నవేకులను చేర్చుకొని వారికి సైనికులుగా కావలసిన శిక్షణనిచ్చు స్థావరము లేర్పాటు చేసిరి. అట్టి సైనిక శిబిరాలకు సమర్థులగు సేనాపతులను అధిపతులుగా నియమించువారు. ఈ శాసనములో పేర్కొనబడిన పన్నుల మినహాయింపులు చేయుచున్న మాయిదేవలెంక అట్టి సైనిక శిబిరానికి అధిపతి. ఇట్టి శిబిరాలను ఏర్పాటు చేసిన నగరాలను తత్పరిసర ప్రాంతాలను నాయంకరములనువారు. (బ్రిటిషు రాజ్యములో అట్టి సైనిక శిబిరాలను కంటోన్మెంటు లనువారు). యుద్ధ సమయములలో నాయంకరాధిపతులు తమ క్రిందనుండు సైన్యముతో యుద్ధమున పోరాడవలసియుండును. కాకతి ప్రతాపరుద్రదేవుడు (క్రీ.శ. 1290-1323) తొమ్మిది లక్షల సైన్యము కలిగియున్నట్లు వర్ణించబడెను. రాజ్యములోనుండు నాయంకర స్థానములన్నిటిలోను మొత్తము అంత మంది భటులు సేనానాయకుల క్రింద శిక్షణ పొందుచుండిరి. వారి పోషణ కొరకై ఆ నాయకులు ఆ ప్రాంతమందుండు గ్రామములలో 'బంటులపన్ను' అనబడు ప్రత్యేకమైన పన్నును వసూలు చేయువారు. కొండూరు గ్రామమనాడొక నాయంకర స్థలము దానిలో 18 గ్రామాలు చేరియుండెను. కొండూరు గ్రామము కాకతీయుల కాలంలో 13, 14 శతాబ్దములలో నాయంకర స్థానముగా నున్నదనుటకు శాసన సాక్ష్యమేగాక మఱికొన్ని నిదర్శనములు గలవు. కొండూడు శివారు గ్రామంగా ఇప్పటికి వీరులపాలెము ఆనాడు బంటులుగానున్న రెడ్డి వంశపు సైనికుల స్థావరమే. రామచంద్రపురం కూడ దానిలో భాగమే కావచ్చును. కొండూరు పొలిమేరలలోను, ఊళ్లోను కొన్ని వీర శిలాప్రతిమలు అప్పుడు యుద్ధములో చనిపోయిన వీరుల స్మారకముగా స్థాపించబడినవి కనబడును. వీటినిబట్టి కొండూరు ఆనాడు నాయంకర స్థానముగ ఒక సేనానాయకుని క్రింద నుండెడిదనియు, సైనిక బంటుల పోషణార్థము బంచెల ఆయమనబడు ప్రత్యేకమైన పన్నును దానికి చెందిన 18 గ్రామాలలోను వసూలు చేసెడివారనియు తెలియుచున్నది. ఆ పన్నును మాయిదేవలెంక దేవ మాన్యాలపై రద్దు చేసెనని శాసనములో గలదు. రద్దుచేసిన పన్నులలో తలారి పన్ను కూడ పేర్కొనబడెను. పూర్వము గ్రామాలలో కావలివాండ్రను నియమించువారు. తలవరి, తలైయార్ అని కూడ వీరిని పేర్కొనువారు. ఊళ్ళో యే విధమైన దొంగతనం జరిగినప్పటికి అతడు బాధ్యత వహించి దొంగను పట్టి తెచ్చువాడు. దొంగను తెచ్చి గ్రామాధికారి యెదుట చూపజాలని పక్షములో తానే నష్ట పరిహారము నీయవలసి యుండెడిది. వీరిని మొదట రాజులే నియమించి వారికి జీతముగా గ్రామస్థులనుండి ధాన్యరూపములోను, ధన రూపములోను ప్రత్యేక పన్నును వసూలుచేసి అతనికి చెల్లించువారు. అతడు గ్రామాధికారికి లోబడి తన విధులను నిర్వర్తించువాడు. ప్రస్తుత కొండూరు శాసనములో మాయి దేవలెంక దేవమాన్యాలపై ఆ తలారి పన్నును రద్దు చేసినట్లు చెప్పబడెను. ఈ పన్నుల మినహాయింపులు గాక మాయిదేవలెంక తన యేలుబడిలో చేరియున్న తంగెడుమూడి గ్రామంలోనున్న చెన్నమల్లికార్జున లింగదేవునికి ఒక పుట్టి (ఖండిక) భూమిని దాన మొసగినట్లు ఇచట చెప్పబడెను. ఆ భూమి ఆ యూరి పొలములో నిచ్చియున్నచో యీ శాసనములో చెప్పబడదు. బహుశ ఆ పుట్టిభూమి కొండూరు పొలములోనిదై యుండును. ఆ వివరములు చెప్పబడలేదు.

కొండూరు గ్రామమును గూర్చిన మఱియొక చారిత్రక విశేషము గలదు. మొదటి శాసనాల్లో దీని పేరు కొండ్రూరు అని పేర్కొనబడెను. కొండ్రు అను పదానికి పూర్వరూపము 'కొన్డు' అనగా తీసికొను అని అర్థము. పూర్వము రాజులు భూమి పన్నులను ధనరూపములోను, ధాన్యరూపములోను వసూలు చేయువారు. అట్టి పన్నులను కొన్ని గ్రామాలనుండి ఒక కేంద్రగ్రామంలో రాజోద్యోగులు తీసికొనువారు. కొండూరు 18 గ్రామాలకు ముఖ్యస్థానముగా నుండెడిది. ఆ 18 గ్రామాలనుండి రైతులు తాము చెల్లించవలసిన ధాన్యమును తమస్వంత బండ్లమీద తెచ్చి యిచటి ఉద్యోగులకు చెల్లించువారు. ఆధాన్యమును కృష్ణానది వెంబడి పడవలలో మఱియొకచోటుకు కొని పోబడెడిది. లేక ప్రభుత్వము వారు అచటనే అమ్మగా వర్తకులు కొనిపోవువారు. అట్లే వర్తకాలు ఇతరమైన సరకులను ధాన్యములను ఇచ్చట కొనుక్కొని తమ స్వంత వ్యాపారమునకై కొనిపోవువారు అట్టి స్థానమగుటవలన ఈ గ్రామానికి కొన్డూరు, కొండూరు అని పేరు వచ్చెను.

శాసనములు

1. మొదటిది – రాజరాజేశ్వర గుడిలో
(ద.బా.శా. 10. 174)

1. శ్రీమద్విక్రమ చోడదేవ నృపతే 2. స్సాంబ్రాజ్య లక్ష్మీకరో వీరః క 3. స్ధనృప శ్చతుర్గ్రహవరః కొంబ్రడూ– 4. రి నాథ శ్చయః పుత్రాస్తస్య 5. చ కామభూపతి రథ ద్రోణాధి– 6. పో భీమభూపాలో రామనృపశ్చ 7. తేషు గుణవాన్ద్రోణాధిపస్యాత్మజః 8. శాకాబ్దే కరనన్ద ఖేన్దు గణితే 9. శ్రీ రాజరాజేశ్వర శ్రీకంఠా– 10. య గవాంచ తత్వగణనాం క్షే– 11. త్రం చ దండాయుతం ఆచన్ద్రా– 12. ర్క మఖండవర్తి విలద్దీప 13. ద్వయార్థం దదౌ శ్రీ కొంబ్రడూరి 14. పుర శివ ద్విజకుల శ్రీమల్లదేవస్సుధీః॥

2. రెండవ శాసనము – రాజరాజేశ్వర గుడిలో
(ద.బా.శా. 10. 189)

1. శకాబ్దే శరనన్ద ఖేన్దు గణితే 2. శ్రీ రాజరాజేశ్వరా యాచంద్రా– 3. ర్క మఖండవర్తి మహితే దీపే 4. నివేద్యేపి చ స్వంక్షేత్రత్రితయం 5. ద దౌ గుణ నిధి శ్రీకంద భూ— 6. పాత్మజో రామః శైవ సుధర్మ 7. నిష్ఠితమతిః కొంబ్రడూరి నా– 8. థో నఘః॥ 9. శ్రీ రాజరాజేశ్వర దే– 10. వర గుడి సాని మే– 11. లనాయిని కొమరమ॥ 12. శ్రీ రాజరాజేశ్వరదేవర గు– 13. డి సాని డాకరేమి మా(హి)మ 14. కూంతుఋ కేతమ॥

3. మూడవ శాసనము – అనందేశ్వరస్వామి గుడివద్ద
(ద.బా.శా. 10. 521)

1. శకవర్షంబులు 2. 1239 గు నేంటి 3. పింగళ సం 4. వత్సర శ్రేష్టశు8 5. గు స్వస్తిశ్రీమన్మ 6. హా మండలేశ్వర 7. కాకతియ్య ప్రతాప 8. రుద్ర దేవమహారా 9. జులకు పుణ్యము 10. గాను స్వస్తి 11. శ్రీమతు మయి 12. దేవ తెంకం గారు 13. కొండూరి స్తల 14. మూర్థు 18కి 15. కల దేవ వృత్తు 16. లకు గడ్డుగ 17. కానిక అమ్ముకడ 18. సుంకాలుంను 19. బంటెల ఆయ 20. ముంను తలారి 21. పంనూను యింత వట్టు 22. ఆ చంద్రార్క–ముగాను 23. మాన్యము యి– 24. స్తిమి తంగడు– 25. మూండి చెంన 26. మల్లికార్జున 27. లింగానకు ఇంక్షే 28. త్రము ఆచంద్రా 29. ర్క–ముగా 30. నిస్తిమి 31. యి ధర్మవుయాల 32. వారు చెల్లించి 33. పుణ్యాన పొందిది. 34. యిప్రిత్తి–సాని 35. కొడుకులు అను 36. భవించ్చువారు 37. యి ధర్మవు లెవ 38. రు విచ్ఛిన్నముసేసి 39. నాను పెద గంగ 40. కఋత పదివేలు 41. గోవుల చంపిన 42. దోషాన పోవువారు.

రానే లేదు కదా?

శ్రీ చాగాపురం నాగేశ్వరరావు

నా
మనస్సు
ముంగిట
చిత్రమైన
రంగవల్లి కలు
వేసి – సుప్రభాతం
పాడి–
పర్యాప్తం
కాని – అనంతంలోకి
(పారి)పోయిన—
తృప్తి – లక్ష్మి
రానేలేదు కదా?
ఎన్నాళ్ళ
నిరీక్షణ?

ఏకాకి

పాంచభౌతిక దేహానికి
పూర్తయినాయి అంత్యక్రియలు
ఏళ్ళ తరబడి వేళ్ళూని విస్తరించిన అనురాగతరువు
ఎడతెరపిలేక విడుస్తున్నది కన్నీటి పత్రాలను
వికారంగా రూపొందిన మనోవృక్షానికి
ఇక పూయవు అనురాగ కుసుమాలు
గతస్మృతుల భావనాబలంతో
ప్రతి కొమ్మ తొడుగుతుంది రెండాకులు
అంతే! అంతే!
అంతకు మించిన శోభ ఆ తరువుకు ఇకరాదు
ముసలితనం వచ్చినా
మిసిమిని కోల్పోయినా
నిండుదనం వీడలేదు నిన్నటిదాకా
నేడేమో సగమూపిరి నిలబెట్టే ప్రాణంతో
ఎలా తెలా పోతోంది
వెన్ను లేని సస్యంలా
ఎగిరివచ్చే పక్షులైనా
ఎంతోసేపు ఉండటంలేదు
మునుపటిలా గూళ్ళుకట్టి
ముచ్చటు లాడడంలేదు
"కనుల పండువయ్యేలా నందనాన్ని నిర్మించాం
కదలిరా! మాతోటే కాలక్షేపం చేతువు"
అని పిలిచే తన సంతతి
కామోద ప్రసవాన్విత
కటూ ఇటూ చెప్పలేక
పుట్టి పెరిగినట్టి నేల
పట్టు విడిచి పెట్టలేక
అర్ధాంగం కోల్పోయిన ఆ ముదుసలి వృక్షం
ఏ కాకీ తోడులేక ఏకాకిగ నిలిచిఉంది.

శ్రీ సూర్యదేవర రవికుమార్

గొంతులేని కేక

అలా అలా రోడ్లమీద నడుస్తున్న 'పరధ్యానం'
హారన్ల ఎదురుగొప్పుల్నీ
ట్రాసింగుల ముళ్ళడొంకల్నీ 'లౌక్యం'గా తప్పించుకొని
ఏకాంతపు హరితారణ్యంలోకి వెళ్లిపోతుంది.
అక్కడ తన నీడ
కొండకొమ్మున కట్టుకొన్న ఒంటిస్తంభపు మేడ!
గత వైభవాలు పెచ్చులు పెచ్చులుగా రాలిపోయి.....
ఒక సుదీర్ఘ మంద్రస్వరం
దానిని కొండచిలువలా అల్లుకొని....
అదొక రక్తం విరిగిన దిగులు నీలిమ!
దుఃఖపు మార్ఫియాకు అలవాటు పడిన
పరాజిత మధురిమ!
పచ్చిపుండులా సలుపుతున్న ప్రాణంమీద
చీకటిగదిలో
తలక్రిందులుగా వ్రేలాడే సూదిపళ్ల గబ్బిలం
పట్టుతప్పి పడిపోతుంది—
అప్పుడొక కేక నిశ్శబ్దంగా
ఎముకల గూటిలోని సున్నాన్ని రాల్చేస్తుంది!
ఎక్కడో ఒకమూల మెదడు—
తీగలు తీగలుగా కరిగిపోయి
జ్ఞాపకాల పగుళ్లులా కనిపించే సాలెగూడు!
దిక్కుల చివళ్ళలో రహస్యంగా
ఆలోచనల రాళ్లబళ్లను గుమ్మరించి
అదిగదిగో తిరిగివస్తోంది పరధ్యానం—
చిటికెడు చిరునవ్వును
తప్పనిసరిగా మోసుకుంటూ
పిడికెడు మెతుకుల కోసం
దినసరి వేతనాన్ని
జీవితాన్నిచ్చి కొనుక్కుంటూ....!

శ్రీ కొంపెల్ల రామకృష్ణమూర్తి

గణపతి

మరాఠీ మూలం :
శ్రీ జయంత్ నార్లీకర్

తెలుగుసేత :
కె. సుజనాదేవి

21 డిసెంబర్ రెండువేల నాలుగు.

దాదాపు పదిహేనేళ్ళ తరువాత ఆ రోజు నేను క్రికెట్ టెస్ట్ మ్యాచ్ చూడ్డానికెళ్ళాను. నిజానికి క్రికెటంటే నాకెంతో ఇష్టం. సెలవుల్లో మా హౌసింగ్ కాలనీ క్రికెట్ క్లబ్ మ్యాచ్‌లో నేనెంతో ఉత్సాహంగా పాల్గొనేవాణ్ణి. కాని ఇప్పుడు టైం దొరికితే టి.వి. ముందు కూర్చుని ముఖ్యమైన టెస్ట్‌మ్యాచ్‌లు చూసే ప్రయత్నం చేయడం మరీ కుదరకపోతే కనీసం వీడియో రికార్డర్‌లో ముఖ్యమైన సన్నివేశాలు చూడ్డం వరకు పరిమితమైంది. మరీ పొద్దుణ్నించీ సాయంత్రందాకా మైదానంలో ఆట చూడ్డానికి టైం దొరికేది కాదు. మ్యూజియమ్ క్యురేటర్ పనే అలాంటిది మరి!

కాని ఇవ్వాల్టి సంగతి వేరు. నా బాల్యమిత్రుడు ప్రమోద్ రాంగణేకర్ ఆఖరి టెస్టుమ్యాచ్ ఇది. సీజన్ టికెట్ పంపిస్తూ 'ఒక్కరోజన్నా ఆట చూసేందుకురా' అని బలవంతపెట్టడంతో ఈ రోజు రావాల్సొచ్చింది. అతడు బౌలరు కాబట్టి ఇండియా ఫీల్డింగు చేస్తున్న రోజు చూసుకుని మరీ వచ్చాను.

ఇవాళ మ్యాచ్ రెండవరోజు. మొదటిరోజు ఇండియా 308 పరుగులు చేసి అంతా ఔటయ్యారు. ఆ సిరీస్‌లో ఇది గెలుపు ఓటమిలను నిర్ణయించే ఆట ఎన్నో ఏళ్ళ తర్వాత ఎమ్. సి. సి. ని ఓడించే ఛాన్స్ దొరకబోతుందని ఎందరో క్రికెట్ ప్రేమికుల ఆశ. టాస్ గెలిచి ఇండియా అయిదారొందల పరుగులు చేయాలని అందరూ అనుకుంటున్నారు. అందుక్కారణం భారతీయ బౌలర్స్ బౌలింగ్‌కు ఎమ్.సి.సి బ్యాట్స్‌మెన్ బాగా అలవాటుపడ్డారు. రాంగణేకర్‌నీ, ఇంకా ఒకరిద్దరు బౌలర్స్‌ని 'డ్రాప్' చేయాలని ఎంతో మంది క్రిటిక్స్ సూచించారు. అయితే నిర్ణాయకమైన మ్యాచ్ కాబట్టి కొత్త బౌలర్స్‌ను తీసుకునేందుకు ధైర్యం చాలక సెలక్షన్ బోర్డ్ వాళ్ళనలాగే ఉంచేసింది. ఆ విమర్శకులే ఈనాడు ఎమ్.సి.సి టీమ్ మూడొందల ఎనిమిది పరుగుల్నిజీగా దాటగలదని జోస్యం చెపుతున్నారు.

అనుకున్నట్టుగానే ఎమ్. సి. సి. బ్యాటింగ్ మొదలైంది. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ చక్కగా ఆడుతూ వికెట్ నష్టపోకుండా గంటలో నలభై పరుగులు తీశారు. డ్రింక్స్ తరువాత కెప్టెన్ భండారీ రాంగణేకర్ని బౌలింగ్ కోసం పిలిచాడు. అది అతని ఆఖరి టెస్ట్ మ్యాచవడాన ప్రేక్షకులంతా చప్పట్లతో అతనికి స్వాగతం చెప్పారు. కాని ముందేం తమాషా జరుగుతుందో వారికేం తెలుసు?

రాంగణేకర్ వచ్చీ రావడంతోనే అంపైర్ కాలియాకు షాక్ ఇచ్చినంత పని చేశాడు. పాత అనుభవంతో రాంగణేకర్ 'రైట్ ఆర్మ్ ఓవర్ ది వికెట్' బౌలింగ్ చేస్తాడని దానికి తగినట్టు బ్యాట్స్‌మన్‌కి సూచనలిస్తున్న కాలియాతో "నేను లెఫ్ట్ ఆర్మ్ ఓవర్ ది వికెట్ బౌలింగ్ చేస్తా"నని రాంగణేకర్ అనడంతో బుర్ర తిరిగినంత పనైంది. మళ్ళీ ఫీల్డింగ్ మార్చుకోవాల్సొచ్చింది.

కెప్టెన్ భండారీక్కూడా ప్రమోద్ ఎడంచేత్తో బౌలింగ్ చేస్తాడన్న సంగతి మొదట్లో తెలీదు. ఇదివరకెప్పుడూ తనలా చేయలేదు. ఇవ్వాల్టి అతి ముఖ్యమైన మ్యాచ్‌లో అతనిలా చేస్తాననడం భండారీకేమాత్రం నచ్చలేదు. అయితే ఒకరిని బౌలింగ్ చేయమని పిలిచాక మళ్ళీ వెనక్కి పిలవడం కూడా వీలుకాదు. అందునా ఇది ప్రమోద్ ఆఖరి టెస్ట్‌మ్యాచ్ కాబట్టి 'పోనీ ఇప్పటికి ఓవర్ వేయనీ' అనుకుని మొదలెట్టమన్నట్టు సూచించాడు. దాంతో ఆ అపూర్వమైన సంఘటనలు మొదలయ్యాయి.

కుడిచేతి అలవాటున్న ఆటగాడు ఎడంచేత్తో ఆడగలడా? ఆడితే ఎంతవరకు సక్సెసవగలడు అంటూ ఆలోచిస్తున్నారందరూ. ఈ ఓవర్ మూలంగా ఈ ఆట ఇండియా గెలవదనీ, ఫలితంగా సిరీస్ మొత్తం ఓడిపోతుందనీ ఇలా రిస్క్ తీసుకోవాల్సింది కాదనీ, రేడియో టి.వి. కామెంట్రీటర్స్ చెప్తూండగానే ప్రమోద్ మొదటి బాల్ వేయడమేమిటి, వికెట్ పడిపోవడమేమిటి అంతా కలలోలా గడిచిపోయింది. పవేలియన్‌కు తిరిగి వెళ్తూ వస్తున్న ఆటగాడితో "జాగ్రత్త. బాల్‌ని ఎదుర్కోవడం కష్టంగా ఉంది" అంటూ హెచ్చరించాడు ఔటయిన బ్యాట్స్‌మన్. కొత్త ఆటగాడు తలూపుతూ వచ్చి ఎలాగోలా రెండు బాల్స్ తిప్పికొట్టి ఔటై కూర్చున్నాడు. ప్రమోద్‌ను పంపి రిస్క్ తీసుకుంటున్నామాని భయపడ్డవాళ్ళందరికీ ప్రమోద్ ఆ ఓవర్ అయిపోయేలోగా అతి ముఖ్యమైన మూడవ వికెట్ ఎమ్.సి.సి. కెప్టెన్

పెడిలేను పవేలియన్‌కు పంపించడంతో ఆశ్చర్యంతో నోట మాట రానంత పనైంది. అయితేనేం? అది కేవలం మొదలు మాత్రమే.

ప్రమోద్ కుడిచేతి బౌలింగ్‌కు అలవాటుపడ్డ ఎమ్.సి.సి. బ్యాట్స్‌మెన్ అతని ఎడంచెయ్యి తడాఖాతో అక్షరాలా భయపడిపోయారు. మొదటి ఇన్నింగ్స్ 78 పరుగులతోనూ రెండో ఇన్నింగ్స్ 45 పరుగుల్తోనూ ముగిశాయి. వాళ్ళ టీమ్‌లోని ఒకే ఒక్క ఎడంచేత్తో ఆడే బాట్స్‌మన్ జోన్స్ కాస్తో కూస్తో ఆడగలిగాడు కనుక ఆ మాత్రం పరుగులన్నా చేయగలిగారు. రాంగణేకర్ బౌలింగ్ అనాలిసిస్ అపూర్వం. ఫస్ట్ ఇన్నింగ్ 15 ఓవర్లు, 5 మెడన్స్, 20 రన్స్, 10 వికెట్స్. సెకండ్ ఇన్నింగ్ 10 ఓవర్స్, 8 మెడన్స్, 15 రన్స్. 10 వికెట్స్.

మ్యాచ్ టీ బ్రైంకి ముందే అయిపోయింది. అభినందనలు చెప్పడానికొస్తున్న ప్రేక్షకుల గుంపునుంచి ప్రమోద్‌ను తప్పించడానికి "పోలీస్ ఎస్కార్ట్" ఇవ్వాల్సొచ్చింది. ఇంటర్వ్యూ కోసం రిపోర్టర్లు ఎగబడుతుంటే "నేను చాలా అలసిపోయాను, రేపు కలుసుకుందాం" అంటూ గ్రౌండ్‌నుంచి బయడపడి అక్కడున్న ఓ అంబులెన్స్‌లో వెళ్ళిపోయాడు. కదుల్తున్న అంబులెన్స్‌లో తెల్లని యూనిఫాం వేసుకున్న ఓ వ్యక్తి అస్పష్టంగా కనిపించాడు. డాక్టరేమో ననుకున్నారంతా.

ఆ తరువాత వారం రోజులు ప్రమోద్ అజ్ఞాతవాసం చేశాడు. ఇండియా టీమ్కుగానీ, కంట్రోల్ బోర్డుగానీ, పోలీసులుగానీ ఎవరికీ అతడెక్కడున్నాడో తెలీదు. అతన్ని తీసికెళ్ళిన అంబులెన్స్ సిటీలోని ఏ హాస్పిటల్‌గానీ, నర్సింగ్ హోమ్కుగానీ చెందింది కాదు. కాబట్టి అదెక్కణ్ణించి వచ్చిందాన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. కాని తను క్షేమంగా ఉన్నట్టూ 28వ తేదీన వస్తున్నట్టూ, అంతవరకూ తనను ఎవరూ వెదికే ప్రయత్నం చేయొద్దంటూ ఓ సందేశం ప్రమోద్ తరపున ఓ అజ్ఞాతవ్యక్తి పోలీసులకి కొన్ని పెద్ద న్యూస్ పేపర్లకి అందించాడు.

ఈలోగా క్రికెట్ ప్రేమికులూ, క్రిటిక్స్ అంతా ఆ అపూర్వమైన ఆట గురించి విమర్శించడంలో మునిగిపోయారు. "ఇండియన్ రోప్‌ట్రిక్, జిమ్‌లేకర్‌ని మించిన రాంగణేకర్, క్రికెటా? మెస్మరిజమా?" ఇలా రకరకాల హెడ్డింగుల్తో అతని బౌలింగ్ మీద చర్చలు రాసాగాయి పేపర్లలో. అతని బౌలింగ్ ఫిల్మ్ స్లోమోషన్‌లో అన్ని కోణాల్నించీ చాలాసార్లు పరీక్షించి చూశారు. త్రోయింగ్‌లోగానీ ఇంకా ఏ విధంగానూ అతని బౌలింగ్‌లో లోపాల్లేవు. కుడిచేతి బౌలరు అంత అలవాటుగా ఎడంచేత్తో ఎలా బౌలింగ్ చేయగలిగాడో ఎవరికీ అంతుపట్టలేదు.

28 డిసెంబర్‌న రాంగణేకర్ ఓ పోలీస్ స్టేషన్ ముందు ప్రత్యక్షమయ్యాడు. ఈ వారం రోజులూ తనెక్కడున్నాడో తనకు గుర్తులేదు! అంతెందుకు? తను చేసిన పరాక్రమం కూడా తనగ్గుర్తు లేదు. శారీరకంగా అతనిలో ఏ మార్పూ లేదు. అయితే 21 డిసెంబర్ నుండీ 28 డిసెంబర్ వరకూ జరిగిన సంఘటనలేవీ అతనికి జ్ఞాపకం లేవు. అంతేకాదు; తను ఎడంచేత్తో బౌలింగ్ చేశాడన్నమాటే అతడికి హాస్యాస్పదంగా తోచింది. దాంతో పజిల్ పజిల్‌గానే ఉండిపోయింది. అంతా ఏవేవో ఊహించుకోసాగారు.

21 నుంచి 28 వరకు వారం రోజులు రాంగణేకర్ జీవితంలో జరిగిన ఓ అతి ముఖ్యమైన సంఘటన గురించిన నిజం తెలుసుకున్నాక నాకు మానవ కల్పనలకన్నా నిజం ఎంత బలవత్తరమైందో అర్థమైంది.

5 ఫిబ్రవరి 2005తేదీ నాకెప్పుడూ గుర్తుంటుంది. ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు సంజూ ఫోన్ చేశాడు. దాదాపు అయిదేళ్ళకు అతని కంఠస్వరం వింటున్నాను నేను.

"ప్రతాప్, నీతో కాస్త ముఖ్యమైన పనుంది. రానా? రాత్రి తొమ్మిదింటికి వస్తాను."

"ఓ తప్పకుండా. భోజనానికే రారాదూ! అదిసరే కాని ఇన్నాళ్ళకి నేనెలా గుర్తొచ్చానో చెప్పు ముందు" అన్నాన్నేను ఆనందంగా.

"ప్రమోద్ గురించి నీతో మాట్లాడాలి. ఇంకా చాలా విషయాలున్నాయిలే. కాని నేనొస్తున్నట్టు ఎవరికీ చెప్పకు. భోజనానికింకెవర్నీ పిలవకు."

"సరి సరి. ఇంతేనా? ఇంకేమన్నా ఉన్నాయా ఇన్‌స్ట్రక్షన్స్?" అన్నాను పరిహాసంగా.

"ఇంకొకటుంది. నేను ఫోర్క్‌తోనూ స్పూన్‌తోనూ తింటానని భాభీతో చెప్పు" అంటూ ఫోన్ పెట్టేశాడు అట్టే వివరించకుండా.

సంజూ, ప్రమోద్, నేను ఒకే స్కూల్లో చదువుకున్నాం; ఒకే చోట ఆడుకున్నాం. త్రిమూర్తులంటూ మాకు స్కూల్లో పేరు. ప్రాణమిత్రులమైనా మా స్వభావాల్లో చాలా తేడా ఉంది. నేను మొదట్నించీ కాస్త సున్నితమైన మనస్తత్వం కలవాణ్ణి. కళాత్మకమైన విషయాల్లో ఇంట్రెస్ట్ కలవాణ్ణి. సంజూ మితభాషి. సైన్సూ, మేథమేటిక్స్ అతని ఇంట్రస్టింగ్ సబ్జక్ట్స్. ప్రమోద్ మొదట్నించీ స్పోర్ట్స్‌మాన్. కాలేజీదాకా మేం కలిసే చదువుకున్నాం. తర్వాత ప్రమోద్ బ్యాంకుద్యోగం సంపాదించుకుని క్రికెట్‌లో పేరుపొందాడు. నేనో పెద్ద మ్యూజియంకు క్యూరేటర్‌గా పనిచేయసాగాను. నా మనస్తత్వానికి తగినట్టు. సంజూ మాత్రం సైన్స్‌లో పెద్ద డిగ్రీ పుచ్చుకుని డిఫెన్స్ లేబరేటరీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఆ తర్వాత

అక్కడే ఏదో స్కీక్రెట్ రిసెర్చ్ ప్రాజెక్ట్‌లో మునిగిపోయాడు. దాంతో ఒకే సిటీలో ఉంటూ కూడా ఇన్నేళ్ళూ మేం ఒకర్నొకరం కల్సుకో లేకపోయాం.

ఇన్నాళ్ళకి ఇవ్వాళ వాడొస్తాననగానే అన్నీ వాడిష్ట ప్రకారమే చేయాలనుకున్నాను. ఎవర్నీ భోజనానికి పిలవలేదు. ఎప్పుడూ తన కొచ్చిన పాశ్చాత్య పాక కళాకౌశల్యానికి ఎక్కువ స్కోప్ లేదంటూ గునిసే నా భార్య ఆనందంగా సంజూ కోసం ప్రాన్‌కాక్‌టెల్, కాకొవా క్రేప్, సుజెట్ అన్నీ సిద్ధం చేసింది,

ప్రమోద్ గురించి సంజూ ఏం చెపుతాడు చెప్మా! అంటూ ఆలోచిస్తూనే ఆ రోజంతా గడిపాను. ప్రమోద్ గురించి ఎంతోమంది ఎన్నో రకాలుగా ఊహాపోహలు చేశారు. వీడూ అంతే చేస్తాడు కాబోలనుకున్నాను. కాని క్రికెట్ ఆటతో ఏమంత సంబంధం లేని ఓ సైంటిస్ట్, అందునా మితభాషి సంజూ తనంత తానే ఈ విషయం గురించి చెప్తానంటే ఏదో విశేషమే అయ్యుంటుంది. అదేమిటాన్న ఉత్కంఠ నాలో క్షణక్షణానికి పెరుగుతుంది.

సరిగ్గా వస్తానన్న టైంకి సంజూ కాలింగ్‌బెల్ నొక్కాడు. మామూలుగా మనకు తెలిసిన వ్యక్తిని చాలా రోజుల తరువాత మళ్ళీ చూస్తే అతనిలో ఏదో మార్పు కనపడ్డట్టు తోస్తుంది. సంజూలో కూడా అలాంటిదే ఏదో మార్పు తోస్తుంది. మునుపటికన్నా గంభీరంగా తయారయ్యాడు. కాని - ఇంకేదో మార్పు కూడా అతన్లో కనపడుతూంది. అదేమిటో ఇదమిత్థంగా చెప్పలేకపోయినా అదేదో ఉందని మాత్రం అనిపిస్తుంది. వాడి మాటలూ, ప్రవర్తనా మాత్రం మునుపటిలాగానే ఉన్నాయి. పాత స్మృతుల్ని తలచుకుంటూ కబుర్లలో మునిగిపోవడంలో ఇందాక వాడిలో కన్పించిన మార్పేమిటాన్న ఆలోచన మరుగున పడిపోయింది.

భోజనం వడ్డించింది మా ఆవిడ. గత అయిదేళ్ళుగా ఎక్కడున్నావ్? ఏం చేస్తున్నావన్న నా ప్రశ్నలకు ఏవేవో జవాబుల్తో దాటేస్తూ మా ఇద్దర్నీ ఎక్కువ మాట్లాడిస్తున్నాడు సంజూ. మావిడ పాకకౌశల్యాన్ని మెచ్చుకోవడం, దానికి నేను లావెక్కడానికి ముడి పెట్టడం, మా పిల్లల గురించి ఆరాలూ, ఆవిడ సోషల్ సర్వీస్ అనుభవాలూ ఆవిణ్ణి వాగించేందుకు చాలు. కాని నాకు మాత్రం ఈ వృథా మాటల్లో తృప్తి లేదు. వాడు తన గురించి చెప్పకుండా కావాలనే దాటేస్తున్నట్టు పసిగట్టాను నేను. పైగా ఎప్పుడూ గబగబా భోంచేసే సంజూ ఇవాళ నెమ్మదిగా తింటున్నాడు. సూటిగా ఉండే అతని చూపులు ఏవో స్వప్నలోకాల్లో విహరిస్తున్నట్టెందు కగుపిస్తున్నాయి? ఇలాంటి చిన్నా పెద్దా అనేక ప్రశ్నల్తో సతమతమౌతున్నాన్నేను.

భోజన మయిపోవస్తుండగా నా అనుమానాలకి తోడు ఇంకో గమ్మత్తు జరిగింది. మా పన్నెండేళ్ళ అబ్బాయి అరుణ్ ఓ కథల పుస్తకం పట్టుకొచ్చి "అంకుల్, ఈ పుస్తకాన్ని మీరు నాకు అయిదేళ్ళ క్రితం ప్రెజెంట్ చేశారు. కాని మీరు ప్రెజెంటెడ్‌బై అంటూ మీ పేరు వ్రాయనేలేదు. ఇప్పుడు వ్రాసి సంతకం పెట్టండి" అన్నాడు. అప్పట్లో సంజూకి ఉద్యోగం దొరక్కముందు, వాడు మా ఇంటికి తరుచు వచ్చేరోజుల్లో వాడికి, అరుణ్‌కి మంచి దోస్తీ ఉండేది.

సంజూ అరుణ్ చేతిలోని పుస్తకం తీసుకుని ఇటూ అటూ తిప్పేసి తిరిగిచ్చేస్తూ "అరుణ్‌బేటా, నేనివాళ సైన్ చేయను. నా కళ్ళు నొప్పులుగా ఉన్నాయి. మళ్ళీ వచ్చినప్పుడు చేస్తానేం?" అన్నాడు అనునయంగా.

"అరె, సంతకం పెట్టడానికన్ని కారణాలట్రా? కళ్ళు మూసుకుని కూడా సంతకం పెట్టొచ్చు" అన్నాన్నేను.

"అదికాదురా, డాక్టరు ఏమాత్రం రాయొద్దంటూ తాకీదిచ్చారు నాకు. చూడు అరుణ్, నేను మళ్ళీ వచ్చినప్పుడు సంతకం పెట్టడమే కాదు నీకింకో పుస్తకం కూడా తెచ్చిస్తాను సరేనా" అంటూ బుజ్జగించాడు.

అరుణ్ గునుస్తూనే వెళ్ళిపోయాడు.

భోజనమయ్యాక మేమిద్దరం నా రీడింగ్ రూంలో కెళ్ళాం. తలుపులు బిగించి సంజూతో "ప్రమోద్ గురించి నువ్వేం చెపుతావ్?" అన్నాను.

"కాస్త ఓపిక పట్టవోయ్, మరీ అంత తొందరా? నేను చాలా విషయాలు చర్చించాలని వచ్చాను. ప్రమోద్ సంగతెలాగూ వాటిల్లో వస్తుంది కాని ముందిది చూడు." అంటూ తన జేబులోంచి ఓ పేకెట్ తీసి జాగ్రత్తగా విప్పసాగాడు.

నాట్యం చేస్తున్న చిన్న గణపతి విగ్రహమది! దాని పోత, కళాకౌశల్యం నాకు పరిచితమే. అలాంటి విగ్రహమే మా మ్యూజియంలో కూడా ఉంది. అది పేష్వాల కాలంనాటిది. ఓ రోజుల్లో పూనాలోని శనివార్ వాడాలో పేష్వాల పూజాగృహంలో పూజలందుకునేదని పురావస్తు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అది మా మ్యూజియంకి రావడమే ఓ పెద్ద కథ! కాని అలాంటి విగ్రహమే ఇప్పుడు సంజూ కెక్కడ దొరికింది అనుకుంటూ నిరీక్షించసాగాను. కాని ఈ విగ్రహంలో ఓ చిన్న తేడా ఉంది. పూర్తిగా అలాంటిదే అనలేము. ఈ గణపతి తొండం కుడివేపుకు తిరిగిఉంది. ఇలాంటి విగ్రహాలు చాలా అరుదు. దుర్లభం కూడాను. పేష్వాల కాలంనాటి అత్యంత దుర్లభమైన విగ్రహం సంజూ ఎక్కడ సంపాదించాడు? అది నకిలీది కాదని చూడగానే గుర్తించాను. ఏళ్ళ తరబడి క్యురేటర్‌గా పనిచేస్తున్న

నాకు అదేమంత గొప్ప విషయం కాదు. అయినా నా దగ్గరి సాధనాల నుపయోగించి పరీక్షించి నకిలీది కాదని కన్‌ఫర్మ్ చేసుకున్నాను.

"ఏం క్యురేటర్ సాబ్? దుర్లభమైందే కదూ!" కొంటెగా నవ్వుతూ అడిగాడు సంజూ.

"అవును. అదంత దుర్లభం కాబట్టే నకిలీదేమోనన్న అనుమానం నాక్కలిగింది. కాని నకిలీది కాదని కచ్చితంగా చెప్పొచ్చు. అసలిలాంటిదే ఎడంవేపు తొండంతో ఉన్న ఓ గణపతి విగ్రహం మా మ్యూజియంలో ఉంది" అన్నాన్నేను.

"నిజం?" ఆశ్చర్యంకన్నా కొంటెతనం తొంగిచూసింది వాడి కంఠంలో. "సరే, నీ వీలుకొద్దీ ఆ విగ్రహం నాకు చూపించు. అలాంటి విగ్రహం మీ మ్యూజియంలో ఉందని నాకనిపించదు. కాని ఈ విగ్రహాన్ని నా తరపున మీ మ్యూజియంకి ప్రెజెంట్ చేస్తున్నాను. నీ దగ్గరుంచు" అన్నాడు.

"మ్యూజియం ట్రస్టీ తరపున నీకు థాంక్స్, అలాంటి లెటర్ వారినుండి నీకు త్వరలోనే వస్తుందిలే. నువ్వెంత విలువైన వస్తువు మ్యూజియంకు ప్రెజెంట్ చేశావో నీకు తెలీదు" కృతజ్ఞతతో నా కంఠం బరువెక్కింది. "కాని ఈ విగ్రహం నీకెలా దొరికింది?" అడిగాన్నేను. మ్యూజియంలో ఉండే దుర్లభమైన వస్తువులపట్ల ఈ క్యూరియాసిటీ అందరికీ ఉంటుంది.

"ఆ కథంతా చెపుతాను. కాని నీవు దాన్ని చాలా రహస్యంగా ఉంచాలి. అంతేకాదు, దానికీ ప్రమోద్ ఆటకీ సంబంధం ఉంది"

గణపతి బొమ్మ గొడవలో నేను అసలు విషయమైన ప్రమోద్ సంగతి దాదాపు మర్చిపోయాను. సంజూ మాటల్తో నా కుతూహలం పెరిగింది.

"గణపతి కథ చెప్పబోయేముందు నేన్నిన్నింకో ప్రశ్నడుగుతాను. నువ్వు నా బాల్యమిత్రుడివి కదా! నిన్నెవరన్నా అడిగారనుకో సంజూను గుర్తించేందుకు అతడి శరీరం మీదేమన్నా గుర్తులున్నాయాని. అప్పుడు నువ్వేం చెపుతావు?" అడిగాడు.

ఈ ప్రశ్నతో నా కుతూహలం మరింత పెరిగింది. ప్రమోద్ బౌలింగుకూ, గణపతి తొండానికీ, ఈ ప్రశ్నకీ గల బాదరాయణ సంబంధమేమిటాని ఆలోచించసాగాను. అయితే సంజూ ప్రశ్నకు జవాబు మాత్రం చాలా ఈజీ.

"నీ ఎడమ భుజంమీద సీతాకోకచిలుకలాంటి పుట్టుమచ్చ ఉంది. చిన్నప్పుడు నేనూ, ప్రమోద్ నిన్నీ విషయంలో ఆట పట్టించేవాళ్ళం" అన్నాన్నేను.

సంజూ మవునంగా తన షర్టు ఎడమచేయి పైకెత్తాడు. అక్కడా పుట్టుమచ్చ లేదు. నా బుర్ర తిరిగిపోసాగింది. వాడు శాంతంగా కుడిచేయి పైకెత్తి చూపాడు. అక్కడా పుట్టుమచ్చ ఉంది.

"ఒరే ప్రతాప్, పతీ, లేరా ఎంత పిరికివాడివిరా నువ్వు?" అంటూ నన్ను స్పృహలోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాడు సంజూ. నేను నిద్రలో ఉన్నట్టూ, నాకేదో చిత్రమైన కల వచ్చినట్టూ అనిపించింది కాసేపు. కాని నిజానికి సంజూతో మాట్లాడుతూనే నేను స్పృహ తప్పాను.

"సారీ నా మాటలవల్ల నీకిదిలాంటి పరిణామం కలుగుతుందనుకోలేదు. నేను నిజంగా రక్తమాంసాలు గల సంజూనే. దయ్యాన్నీ, భూతాన్నీ కాదు." అన్నాడు సంజూ మెల్లగా.

"మరి నీ పుట్టుమచ్చెలా మారింది?" భయం భయంగానే అడిగాను. జవాబుగా సంజూ నా చేయి పట్టుకుని తన గుండెపై మెల్లిగా తిప్పాడు. వాడి గుండె కుడివేపున కొట్టుకుంటూంది.

ప్రమోద్ ఎడంచేతి బౌలింగు, కుడివేపు తొండంగల గణపతి, కుడివేపు గుండెగల సంజూ వీటన్నిటి మూల సూత్రమేదో ఒకటే అయ్యుంటుందని నాకనిపించసాగింది. ఇవన్నీ అద్దంలో ప్రతిబింబాలేమోని తోచింది. అంతలో నా ఊహ నాకే పిచ్చిగానూ తోచింది. ప్రతిబింబాన్నెలా తడమగలం? గణపతినీ, సంజూనీ నేను తడిమి చూశానే! నేనే కాదు. బౌలింగు చేస్తున్నప్పుడు ప్రమోద్‌ను వేలాది మంది చూచారు అంతేకాదు నిర్జీవమైన టి.వి. కూడా చూసింది. అవి ప్రతిబింబాలు కావే! నిజంగా వాడాడిన రికార్డది! పోనీ రక్తమాంసాలు గల ప్రతిబింబాలేమో! కాని అదెలా సాధ్యం?

ఉండబట్టలేక అద్దం ముందుకు తీసుకెళ్ళి నుంచోబెట్టాను సంజూని. వాణ్ణి మొదట్లో చూడగానే వాడిలో నేను గుర్తించలేని మార్పేమిటో నాకర్థమయింది. నా పక్కనున్న సంజూకన్నా అద్దంలో సంజూ నాకు సన్నిహితుడుగా తోచాడు. మామూలుగా అద్దంలో చూసుకుంటే మనమెలా ఉన్నామో అర్థమవుతుంది. కాని అసలు వ్యక్తికీ, అద్దంలోని ప్రతిబింబానికీ ఎంతో కొంత తేడా ఉండనే ఉంటుంది. ఇందాక సంజూలో నాక్కనిపించిన తేడా నిజం సంజూకి అతడి ప్రతిబింబానికీ గల తేడా అన్నమాట! అంటే — ఈ సంజూ నిజం సంజూ కాదు వాడి రక్తమాంసాలతో కూడిన ప్రతిబింబం అన్నమాట! మరి నిజం సంజూ ఏడీ? ఇదంతా ఎలా సాధ్యం?

"నేనెవరో వేరే 'ప్రాణి'నని సంజూ ప్రతిబింబంగా నీ ముందు నుంచున్నాననిపిస్తూంది కదూ!" సంజూలాంటి ఆ 'ప్రాణి' మాటల్తో నా ఆలోచనలకడ్డుకట్ట పడింది. "నేను నిజంగా సంజూనే. కాకపోతే ప్రతిబింబంగా రూపాంతరం పొందానంతే" అంటున్నాడు.

"అదెలా సాధ్యం?" అయోమయంగా అన్నాన్నేను.

"అదే చెప్పడానికి నీ దగ్గరికొచ్చాను. నేను చెప్పే విషయం నీవు నమ్మగలిగినా, నమ్మలేకపోయినా పచ్చినిజం. అయితే ఈ సంగతి నీవు చాలా రహస్యంగా ఉంచాలి సుమా! ఎవరికీ చెప్పొద్దు" సంజూ చెప్పసాగాడు.


"ఇండియన్ ఫండమెంటల్ ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో నేను డిగ్రీ పొందినవాణ్ణి కాబట్టి నాకు శాస్త్రజ్ఞుడిగానూ, తంత్రజ్ఞుడిగానూ డిఫెన్స్ లేబరేటరీలో ఈ ఉద్యోగం ఈజీగా దొరికింది. నా తత్వానికి సరిపడే ఈ ఉద్యోగంలో నేనెంతో ఆనందంగా అడుగు పెట్టాను. కాని త్వరలోనే నా ఆనందమంతా చప్పగా చల్లారింది. నా పనిలో నాకు టేబుల్ వర్కెక్కువా, లాబ్‌వర్క్ తక్కువాను. అంతే కాదు, రెడ్‌టేప్, గవర్నమెంట్ జాబ్ కాబట్టి పై అధికార్లకి కాకాలు పట్టడం, కొలీగ్స్ కుతంత్రాలూ, క్రొత్త ఐడియాలు అమల్లో పెట్టనివ్వకుండా నిరుత్సాహపరచడం వీటన్నింటితో విసిగిపోయాను. మెల్లిమెల్లిగా ఇతరులతో సంపర్కం తగ్గించాను. కేవలం పనిమటుకే ఇతరులతో మాట్లాడ్డం లేకపోతే నా లాబ్ దూరడం నా పని చూసుకోవడం, ఆఫీసులో నా డ్యూటీ నేను సరిగా నిర్వర్తించేవాణ్ణి కాబట్టి నన్నెవరూ ఏమీ అనలేకపోయేవారు. నా కొలీగ్సంతా కబుర్లలోనూ, పార్టీల్లోనూ టైం వేస్ట్ చేస్తుంటే నేను స్టడీలోనూ ప్రయోగాల్లోనూ వీలైనంత టైం వెచ్చించసాగాను.

గురుత్వాకర్షణ శక్తి, మూలకణాల గురించి నేను నా పరిశోధనలను మొదలుపెట్టాను. ఎన్నాళ్ళనుంచో నా మనసులో ఉన్న ఊహలకో ఆకారం ఇవ్వాలని నా పట్టుదల. అందుక్కావల్సిన ఇన్‌స్ట్రుమెంట్స్ మా లాబ్‌లో ఉన్నాయి. నా ప్రయోగం గురించి చెప్పేముందు నా ఐడియాస్ చెప్తాను విను.

ఐన్‌స్టీన్ ఆకర్షణశక్తి నియమం ప్రకారం స్పేస్ మరియు టైం వీటి గుణధర్మములు వాటిలో ఉండే వస్తువులమీద అవలంబించి ఉంటాయి.ఓ స్థలంలో ఏ వస్తువూ లేకుండా ఉంటే అక్కడి స్పేస్ మరియు టైం వీటి జామెట్రీ యూక్లిడ్ అంటారు. ఇది మనం చిన్నప్పుడు స్కూల్లో చదువుకున్నదే. అయితే ఆ స్పేస్‌లో ఏదైనా పెద్ద పరిమాణం గల చాలా శక్తివంతమైన వస్తువు ఉంచితే అక్కడి జామెట్రీ ఛేంజవుతుంది. దానిలోని సరళరేఖల దిశ మారుతుంది. వెలుతురు సరళరేఖగా పయనిస్తుందని మనం అనుకుంటాం కాని ఏదైనా పెద్ద వస్తువు పక్కనుండి పయనించేప్పుడు వెలుతురు తన డైరెక్షన్‌ను మార్చుకుంటుంది. ఖగోళ శాస్త్రజ్ఞులు కొందరిలాంటి ప్రయోగాలు చేసి చూశారు. అవన్నీ వస్తువుయొక్క ఆకర్షణశక్తి వల్ల స్పేస్ మరియు టైం వక్రీభవిస్తాయనే ఐన్‌స్టీన్ సిద్ధాంతంమీద ఆధారపడినవే. అయితే నీకీ జామెట్రీ అంతా చెప్పి నిన్ను బోర్ చేయదల్చుకోలేదు. కాని నాకు తోచిన ఐడియా గురించి చెప్పడానికి ప్రస్తావన అవసరం. పై సిద్ధాంతానికో మెట్టు ముందుకెళ్ళి ఈ స్పేస్, టైంలను స్పిన్ చేయాలని నా ఉద్దేశం.

నీవు మోబియస్ బెల్ట్ గురించి వినే ఉంటావు. ప్యాంట్ బెల్ట్ ఓ టేబుల్‌మీద పరిస్తే దానికి రెండు సర్‌ఫేసెస్ ఉంటాయి. పైనొకటి, క్రిందొకటి. ఆ రెండూ సమతలంగా ఉంటాయి. వాటిని యూక్లిడ్ జామెట్రీ అనొచ్చు. అదే బెల్ట్ నడుముక్కట్టుకుంటే అది వక్రీభవించి నాన్‌యూక్లిడ్ అవుతుంది. అలా అయినా మునుపట్లాగే దానికి రెండు సర్‌ఫేసెస్ ఉంటాయి. దీని పై స్టెప్ అంటే ఆ బెల్ట్‌ను ఓసారి స్పిన్‌చేసి కట్టుకోడమన్నమాట. అప్పుడు ఆ బెల్ట్‌కు ఒకే పృష్ఠభాగం ఉంటుంది. అదే మోబియస్ బెల్ట్.

ఈ బెల్ట్‌మీద కదిలే సమతలంగా ఉన్న చిన్న ప్రాణులున్నాయనుకుందాం. వాటి పొడవూ, వెడల్పూ మనకు తెలుసు కాని ఎత్తు సంగతి తెలీదు. అలాంటి ఎడమచేయి మాత్రమేగల ఓ మనుష్యాకృతి ఈ బెల్ట్‌మీద ఉందనుకుందాం. అది ఒకేచోట ఉండి గుండ్రంగా తనచుట్టూ తాను ఎన్ని రౌండ్లు కొట్టినా దాని ఎడంచెయ్యి అలాగే ఉంటుంది. కాని అదా బెల్ట్‌మీద ఓ పూర్తి రౌండ్ కొట్టగలిగితే దాని ఎడం చెయ్యి, కుడిచేయిగా మారుతుంది. నీకు నమ్మకం కలక్కపోతే ఓ కాగితం మోబియస్ బెల్ట్‌లా తయారుచేసి ఇలాంటి ఓ బొమ్మను తిప్పి చూడు. నా ఐడియా కరెక్టేనో కాదో తెలుసుకోవచ్చు. ఇదిగో ఈ బొమ్మ చూడు" అంటూ క్రింది బొమ్మ చూపించాడు.



సంజూ చూపిన చిత్రం

నేను వాడిచ్చిన ఆ కాగితంమీది బొమ్మను చూస్తుంటే వాడు మళ్ళీ చెప్పసాగాడు. "ఆ తిరిగే ప్రాణి తమాషా మనకు తమాషాగా తోచదు. అందుక్కారణం మనం దాన్ని త్రీ డైమెన్షన్‌లో చూస్తాం కనుక. ఆ బెల్ట్‌గల స్పిన్‌వల్ల ఆ బెల్ట్‌గుండా ఆ ప్రాణి తన ఆపాద మస్తక రేఖ చుట్టూ సగం తిరుగుతాడు. దాంతో వాడి ఎడమచేయి కుడిచేయౌతుంది.

ఒకవేళ ఇలాంటి స్పిన్ మన త్రీ డైమెన్షన్ స్పేస్‌కి చేస్తే? మనలాంటి పొడవూ, వెడల్పూ ఎత్తూ గల మానవులక్కూడా ఆ తమాషా కనబడుతుంది. సరైన స్పిన్‌గల స్పేస్‌లో ఓ రౌండుకొట్టి వచ్చాక ప్రతి వస్తువూ తన ప్రతిబింబంగా మారుతుంది. కాని ఇది మన కళ్ళకి కనబడదు కాబట్టి మనం అర్థం చేసుకోలేం. దానికి నాలుగో డైమెన్షన్ కావాలి. కాని మేథమేటిషియన్స్ మేథమేటిక్స్ ద్వారా ఇలా చిత్రీకరించగలరు. మన ఇంద్రియాలతో మనం అనుభవించలేనిదేదో ఈ లెక్కల్లో ఈజీగా సాధ్యమవుతుంది.

అయితే ఇదంతా కేవలం ఐడియా స్పేస్‌ని నిజంగా స్పిన్ చేయొచ్చా? ఎంతోమంది సైంటిస్టులీ విషయంలో ప్రయోగాలు చేశారు. కాని ఇంతవరకూ అన్నీ అపరిపక్వంగానే ఉండడంవల్ల మాన్యత నొందలేదు. అయితే వీటన్నిటి మూలకల్పన మాత్రం ఒక్కటే. మూలకణాల్ని ప్రయోగించి స్పిన్ నిర్మించవచ్చు. మూల కణాల్లో ఇలా స్పిన్ అయ్యే గుణం ఉంది: మనం రోజూ చూసే ఓ ఆసు చుట్టూతా తిరిగే స్పిన్ కాదిది. ఆకారం లేని రకరకాల స్పిన్నింగ్స్ మూలకణాల లెక్కల్లో ఉంటాయి. ఓ విశిష్టమైన పద్ధతిలో స్పిన్ ఉన్న మూలకణాల సమూహాన్ని స్పేస్‌లో విడిస్తే మనక్కావల్సిన స్పిన్ నిర్మాణమవుతుందన్నది శాస్త్రజ్ఞుల అంచనా. అయితే ఈ మూలకణాలు సమైక్యంగా స్పిన్నయ్యేలా ఉండాలి. వేర్వేరు డైరెక్షన్స్‌లో ఉంటే అనుకున్న ఫలితాలు రావు" సంజూ ఆపకుండా చెప్పసాగాడు.

"మా లాబ్‌లో మూలకణాల ప్రవాహం తయారుచేసే పెద్ద మెషినుంది. దానిమీదిలాంటి ప్రవాహం తయారు చేయాలని నేను నిర్ణయించుకున్నాను. కొత్త ప్రయోగమంటే మళ్ళీ రెడ్‌టేప్ నెదుర్కోవాలి. ఆ ధైర్యం, ఓపికా నాలో లేవు. నా ప్రపోజల్ ఎన్నెన్నో ఫైళ్ళగుండా, టేబుళ్ళచుట్టూ తిరిగి నెగెటివ్ ఝెండా ఊపుతూ వచ్చేప్పటికి నేను రిటైరయిపోతాను. కాబట్టి నేను చేస్తున్న ప్రయోగం ప్రభుత్వం పనిలోని ఓ భాగమని అబద్ధం చెప్పి ఆఫీసులో వాళ్ళందర్నీ నమ్మించి ఆ మెషిన్ పక్కనున్న ఓ కేబిన్ నేను నా కోసం అట్టిపెట్టుకోగలిగాను. కేబిన్‌ముందు 'టాప్ సీక్రెట్, డోంట్ ఎంటర్, డేంజరస్' లాంటివన్నీ వ్రాసిపెట్టి నన్నెవరూ 'డిస్టర్బ్' చేయకుండా జాగ్రత్తపడ్డాను

ఒంటరిగాణ్ణే కాబట్టి ప్రయోగాల కోసం నాక్కావల్సినంత టైం దొరికేది. కాని నేను చేయబోయే పని అత్యంత కష్టతరమైనది. ఆ మెషిన్లోంచి మనక్కావల్సిన పద్ధతిలో సమైక్యంగా అన్ని మూల కణాల్నీ బయటకు తీయడానికి రాత్రింబవళ్ళు పనిచేసినా నాకు రెండేళ్ళు పట్టింది. చివరికి దాదాపో ఆర్నెల్లక్రితం ఈ విషయంలో నేను సక్సెసయ్యాను.

నా ప్రయోగం కోసం నేను మొదట నా రిస్ట్‌వాచ్‌ను వాడాను. దాన్ని ప్రతిబింబంగా మారుస్తున్నప్పుడు దాని టైంను చూపించే పద్ధతి మారుతుందా అన్న విషయాన్ని కనుక్కోవాల్సింది. ఆ గడియారాన్ని సరైనచోట ఉంచి దానిమీదుగా మూలకణాల ఫోకస్ చేశాను. ఆ ప్రవాహంలో గడియారం ఓ రౌండ్ కొట్టిరాగానే దాని ప్రతిబింబంగా మారింది. కాని టైం సరిగానే చూపిస్తూంది. ప్రయోగం ఫలించిందన్న ఆనందంతో నేను ఆ ప్రయోగాన్ని ఆపగానే గడియారం మళ్ళీ మామూలుగా తయారైంది. ఆ ప్రతిబింబాన్ని అలాగే స్థిరంగా ఉంచలేకపోయానన్నమాట!

నేనదే ప్రయోగాన్ని రకరకాలుగా చేసి చివరికి విజయం సాధించాను. గడియారం ప్రతిబింబంగా మారాక దాన్ని ఫోకస్ అలా ఉండగానే బయటకు తీస్తే అలాగే స్థిరంగా ఉంటుందని అర్థమైంది. చాలా వస్తువులమీద అలా చేసి చూశాను. కన్‌ఫర్మయ్యాను. అయితే నాకా రహస్యం ఇంకా అంతు పట్టలేదు.

డిసెంబర్ నాలుగవ తేదీన నేనీ ప్రయోగాన్ని నామీదే జరిపి చూడాలన్న నిర్ణయానికొచ్చాను. అఫ్‌కోర్స్! అంతకుముందు చిన్న చిన్న పురుగులూ, సీతాకోకచిలుకలూ, గినీపిగ్స్ అన్నింటిమీదా జరిపి ప్రాణానికేం అపాయం లేదని కన్‌ఫర్మయ్యాను. అయినా ఏ కారణం చేతైనా నాకేమన్నా అయితే నా పరిశోధనల లాభం ఇతర సైంటిస్టుల్కి లభ్యమవాలని ఆ వివరాలన్నీ వ్రాసి ఓ 'సురక్షిత' స్థలంలో దాచాను. అంతేకాక నేను ప్రతిబింబంగా మారాక నా ప్రవర్తనను టేప్ చేయడానికి వీడియో, టేప్‌రికార్డర్ ఏర్పాటు చేసి ఉంచాను. ఇంకా రకరకాల మెషిన్స్ నా శరీరంలోని సూక్ష్మాతి సూక్ష్మమైన మార్పుల్ని పరీక్షించేందుకు, రికార్డు చేసేందుకు రెడీగా ఉంచి, అంతా సిద్ధమైందని మరోసారి చూసుకుని అప్పుడు మూల కణాల ప్రవాహంలోనికి ప్రవేశించాను.

ఆ ప్రవాహంలో యోగ్యమార్గం గుండా ఓ రౌండు పూర్తి చేశాక నేను నా ప్రతిబింబంగా మారాను. నేనలా మారుతున్నప్పుడు నాకేమీ అనిపించలేదు. ఏ రకమైన వేదనా, కళ్ళు తిరగడం ఇలాంటి వేవీ లేకుండా ఈజీగా నేను ప్రతిబింబంగా తయారయ్యాను. నాతో బాటు నా గడియారం, ఒంటిమీది బట్టలూ, బూట్లూ అన్నీ మారాయి. ఆ ప్రవాహంనుంచి బయటకొచ్చాక నన్ను నేను పరీక్షించుకున్నాను.

నాకు అక్షరాలు చదువరాలేదు. నా తల్లో అక్షరాలు తిరగేసుకు చది వేట్టు మాత్రమే అరేంజయి ఉన్నట్టుంది. స్క్రూలు బిగించడంగానీ, తీయడంగానీ కష్టమయ్యేది. కుడిచేతివాటం పోయి ఎడంచేయి వాటం వచ్చింది.

నా అనుభవాలన్నీ నేను చక్కగా వ్రాసిపెట్టాను. పైగా వీడియో నన్ను నిరీక్షిస్తూనే ఉంది. ఆఖర్న నేను మళ్ళీ ఆ ప్రవాహం నుంచి బయటపడి మామూలుగా తయారయ్యాను. కాని నాకు జరిగిన సంఘటనలేవీ గుర్తులేవు. నేను ప్రయోగం మొదలుపెట్టేదాకా అంతా గుర్తుంది. అంటే నేను ప్రతిబింబావస్థలో ఏం చేశానో గుర్తు లేదన్న మాట. వీడియో టేపుమీద అంతా చూశాను. నేను వ్రాసిపెట్టిన మేటరంతా చదివాను. ఆఫ్‌కోర్స్ నాకా అక్షరాలు చదవడానికి అద్దంలో చూడాల్సొచ్చింది. అక్షరాలు తిరగేసి వ్రాశానన్నమాట!"

సంజూ చెప్పున్నదంతా అరేబియన్ నైట్స్ కథలా అద్భుతంగా ఉంది. 'నేను నమ్మను ఫో' అంటూ వాడి మాటలు కొట్టి పడేసేలా లేదు. వాడి ప్రతిబింబమే నాతో మాట్లాడుతుంది. వాడితో మాట్లాడుతూ నేను పక్కకి చూస్తే ఇందాకటి గణపతి బొమ్మ కని పించింది. దాంతో నాకో ఆలోచన తట్టింది.

"సంజూ, ఈ గణపతి కూడా ప్రతిబింబమేనా?" అడిగ్గాన్నేను.

"అవును ప్రతాప్, నీకు నమ్మకం లేకపోతే మ్యూజియంకెళ్ళి ఓసారి కన్‌ఫర్మ్ చేసుకో" కొంటెగా నవ్వుతూ అన్నాడు సంజూ.

వాణ్ణి వెంటబెట్టుకుని పక్కనే ఉన్న మ్యూజియం బిల్డింగు కెళ్ళాను. పేష్వాల కాలంనాటి సామాన్లున్న సెక్షన్లోని ఓ క్యాబినేట్ దగ్గరికి దాదాపుగా పరుగెత్తాను. అక్కడ గణపతి బొమ్మ ఉండాల్సిన జాగా ఖాళీగా ఉంది. నేను సంజూ ఇచ్చిన విగ్రహం అక్కడ ఉంచి మౌనంగా వాణ్ణి తీసుకుని మళ్ళీ నా స్టడీరూం కొచ్చాను.

"సారీ ప్రతాప్, నేన్నిన్ను మోసపుచ్చాను. నీక్కావాలంటే మళ్ళీ ఆ బొమ్మ పూర్వంలా చేసిస్తాను. నిన్ను కలుసుకునేముందు ఏదన్నా తమాషా చేయాలని లాస్టువీక్‌లో నీ మ్యూజియంకొచ్చి ఈ గణపతిని కొట్టేశాను. అదే నీకిప్పుడు మళ్ళీ ఇచ్చాను" వివరించాడు సంజూ.

నా బుర్ర పని చేయసాగింది. ప్రమోద్ రాంగణేకర్ చేసిన ఇంద్రజాలం వాడి సొంతం కాదు. వాడి ప్రతిబింబమే అంత పనీ చేసుంటుంది. అందుకే వాడు ఎడంచేత్తో అంత బాగా బౌలింగు చేయగలిగాడు. అతడు చేస్తున్న ఆ అనపేక్షితమైన బౌలింగు ఎమ్.సి.సి ఆటగాళ్ళు ఎదుర్కోలేకపోయారు. సంజూకి నా ఆలోచన చెప్పాను.

"కరెక్ట్. ఇరవయ్యో తేదీన సాయంత్రం ప్రమోద్ నా దగ్గరి కొచ్చాడు. చాలా ఉదాసీనంగా కనిపించాడు. అది తన ఆఖరి టెస్టు మ్యాచనీ కలకాలం గుర్తుండేలా ఉండాలనుందనీ కాని అది అసాధ్యం కాబట్టి భయంగా ఉందనీ అన్నాడు. ఎం.సి.సి ఆటగాళ్ళకి తన బౌలింగు పూర్తిగా పరిచితమవడంవల్ల మునుపట్లా తన బౌలింగు సమర్థవంతంగా ఉండటం లేదని వాపోయాడు. మర్నాడు తను బౌలింగు చేయాలనీ, సరిగా చేయలేకపోతే విమర్శకులు చంపుకు తిన్నంత పని చేస్తారని భయపడ్డాడు. అదంతా వింటూంటే నాకో ఐడియా తట్టింది. ప్రమోద్‌కు బదులు వాడి ప్రతిబింబం ఆడితే; కాని వాడికి విషయం చెప్పొద్దు.

నేను వాడిక్కాఫీలో మత్తుమందిచ్చాను. వాడు నిద్రపోయాక కార్లో ప్రయోగశాలకు తీసుకొచ్చి ప్రతిబింబంగా మార్చి వాడింటి దగ్గర దిగబెట్టాను.

మర్నాడుదయం వాడు నాకు ఫోన్ చేశాడు. చాలా హిస్టెరికల్‌గా తయారయ్యాడు. తన కుడిచేయి పని చేయలేకపోతూందనీ చదువుతుంటే అక్షరాలు తిరగేసినట్టు కనబడుతున్నాయనీ కంప్లైంట్ చేస్తూ 'నిన్న రాత్రి నాకు "భయంకరమైన మందు" ఏదైనా ఇచ్చావా?' అంటూ అడిగాడు. నేను వాడి ఫ్లాట్ కెళ్ళి వాడికి ధైర్యం చెప్పాను. కుడిచేయి పని చేయకపోతే ఎడంచేత్తో ఆడమని సలహా ఇచ్చాను. ఆ మాట విని నేను తనను గేలి చేస్తున్నాననుకున్నాడు ముందు. కాని కొద్దిపాటి నెట్ ప్రాక్టీస్ చేశాక నా సలహా ఆచరణీయమేనని అర్థమైంది వాడికి. ఆ సలహా ఎంత బాగా పనిచేసిందో నీకూ తెలుసు.

మ్యాచ్ తర్వాత వాణ్ణి నేనే తీసికెళ్ళాను. సిటీబయట ఓ చిన్న పల్లెటూర్లో ఆర్రోజులు వాణ్ణుంచాను. వాడికి శారీరకంగానూ, మానసికంగానూ టెన్షన్ బాగా పెరిగిపోవడంతో ఆ విశ్రాంతి చాలా అవసరం. పోలీసులకి, న్యూస్‌పేపర్లకీ ఫోన్‌చేసి చెప్పింది నేనే. ఏడో రోజు వాడు కాస్త నార్మల్‌కొచ్చాక వాణ్ణి మళ్ళీ సరిగా రూపొందేలా చేసి తెచ్చి సిటీలో వదిలాను. అందుకే గత వారం రోజుల్లో ఏం జరిగిందో వాడికి జ్ఞాపకం లేదు.

ప్రమోద్ సంగతి విన్నాక ఇక చిన్నా పెద్దా అన్ని సంగతులూ అర్థమైపోయాయి. తన ఎడంచేయి వాటం మేం గుర్తించకుండా ఉండాలని చేత్తో భోంచేయకుండా స్పూన్లూ, ఫోర్క్స్ వాడాడు సంజూ. అయినా ఎప్పుడూ గబగబా భోంచేసేవాడు ఇవాళలా చేయలేకపోయాడు. అందుకే ఆరుణ్ పుస్తకంమీద సంతకం పెట్టనన్నాడు. అద్దంలో కనపడ్డట్టు సంతకం చేయడం ఎంత కష్టమో ఆలోచిస్తే అర్థమౌతుంది.

"సంజూ, నీవు వీలైనంత తొందరగా నీ పరిశోధనలన్నీ ప్రెస్‌కివ్వు. నీకు తప్పకుండా నోబెల్ ప్రైజ్ దొరుకుతుంది." అన్నాను.

"లేదు ప్రతాప్. నా పరిశోధనలింకా పూర్తవలేదు. ప్రతిబింబంగా ఉన్నప్పుడు చేసిన వ్యవహారాలూ, మాట్లాడిన మాటలూ పూర్తిగా ఎందుకు మర్చిపోతామో, అలా మర్చిపోకుండా ఉండేందుకేం చేయొచ్చో ఆలోచించి కనిపెట్టందే నా ప్రయోగం పూర్తవదు. నేనివాళ నీ దగ్గరికొచ్చాను. నీతో ఇంతసేపు మాట్లాడాను. నీకన్ని వివరాలు చెప్పాను. కాని నేను మళ్లీ నా అసలు రూపం పొందితే ఇదంతా మర్చిపోతాను. నా పరిశోధనలోని ఈ అతి ముఖ్యమైన లోటుని నేను భర్తీ చేయాలి. ఆ ప్రయోగం కోసం నాకు మా లేబరేటరీలోని ఓ అతి దుర్లభమైన వస్తువు కావాలి అది సంపాదించే ప్రయత్నం చేస్తున్నాను" మంచి పర్‌ఫెక్షనిస్టు సంజూ.

"సరే. నాదో చిన్న సలహా వింటావూ!" నేనేంతో కలవరంగా అన్నాను. "నీవేదో అజ్ఞాత శక్తితో పోరాడుతున్నావు. ఈ పోరాటంలో ఏదన్నా జరక్కూడనిది జరిగే సంభవం ఉంది కనీసం ఇంతవరకూ నీవు చేసిన ప్రయోగాల వివరాలు వ్రాసి జాగ్రత్తగా ఉంచు. నీ పరిశోధనలవల్ల ప్రపంచంనుంచి నీకు దొరుకబోయే సన్మానానికి నీవు దూరం కావద్దు."

"నాకీ ప్రపంచం ఇచ్చే సన్మానాలూ చట్టుబండలూ అక్కర్లేదు. నా ఉద్దేశం, ఆశయం వేరే. దానికై నాకు నీ సహాయం కావాలి. అయితే నీవన్నట్టు నా ప్రయోగాలన్నీ వివరంగా వ్రాసి ఓ 'రహస్యమైన చోట్లో' దాచిఉంచాను. ఆ చోటు కేవలం నాకు మాత్రమే తెలుసు. అది చదివితే ఏ సైంటిస్టుకైనా ఈజీగా ప్రతిబింబంగా మారొచ్చు. ఇన్నేళ్ళ నా కృషి ఫలమది. 'పుష్పక విమానం' ఎఫెక్ట్ కాదు" అంటూ నవ్వాడు సంజూ.

"పుష్పక విమానం ఎఫెక్ట్" అన్న శబ్దం మా ముగ్గురి భాషలోది. మన పూర్వీకులు వైజ్ఞానికంగా ఎంత అభివృద్ధి చెందారో మన పౌరాణికులు చెప్తుంటారు. పుష్పకవిమానం అంటే హెలికాప్టరనీ, ఘటోత్కచుణ్ని చంపేందుకు వాడిన ఇంద్రశక్తి అంటే గైడెడ్ మిసాయిల్ అనీ చెప్తే శాస్త్రజ్ఞులకు నచ్చదు. అవి తయారుచేసే పద్ధతి వాడే పద్ధతీ ఇలాంటి శాస్త్రీయాధారాలు దొరికేంతవరకూ వాటిని కవి కల్పనలకిందే జమ కడతారు శాస్త్రజ్ఞులు. అదే విషయాన్నుద్దేశించి అన్నాడామాట సంజూ.

"నీకు నేనేం సహాయం చేయాలి?" అడిగాను; నా జ్ఞానం, అనుభవం వాడికెలా పనికొస్తుందాని ఆలోచిస్తూ.

"నువ్వో పెద్ద మ్యూజియం క్యురేటర్‌వి. అయినా నేను తయారుచేసిన గణపతి విగ్రహాన్ని చూసి మోసపోయావు. అదెంతో దుర్లభమైన వస్తువనుకున్నావు. ఇలాంటి ఎన్నో 'దుర్లభ'మైన, 'అమూల్య'మైన వస్తువులు తయారుచేసి డబ్బు సంపాదించాలని నా ఊహ. ఏదైనా ఓ స్టాంపు తిరగేస్తే దుర్లభమవుతుంది. దానికి చాలా డిమాండుంటుంది. నీ దగ్గరికొచ్చే కలెక్టర్స్ ఇలాంటి వస్తువు అడుగుతూనే ఉంటారు. నేను తయారు చేసిన ఇలాంటి వస్తువుల్ని నీ అథారిటీతో అమ్మి. వచ్చే డబ్బు ఇద్దరం పంచుకుందాం ఏం?" అన్నాడు సంజూ.

వాడిచ్చిన ఆఫర్ నాకు నచ్చలేదు. వాడన్నట్టు పాత వస్తువులు, దుర్లభమైన వస్తువులూ అమ్మడం నాకు చాలా తేలిక. డబ్బు కూడా చాలా సంపాదించొచ్చు. కాని ఈ ప్రాసెసంతా ఎందుకో నాకు అవినీతిగా తోచింది. నా అనుభవాన్నీ, హోదానీ ఇలా దుర్వినియోగం చేయడం నాకు నచ్చలేదు.

నేను సంజూతో చాలాసేపు వాదించాను. వాణ్ణి సన్మార్గంలో పెట్టాలని ఎంతో ప్రయత్నించాను. వాడి మార్గం కంటకమయమైందని చెప్పి మనసు మార్చుకోమని అడిగాను. కాని ఓసారి చేద్దామనుకున్న పని అరు నూరైనా విడిచే తత్వం కాదు వాడిది.

"అల్‌రైట్ ప్రతాప్. నీవు నీ నీతిమార్గంలోనే పయనించదల్చుకుంటే అలాగే పయనించు. నాకు నీ ఉపదేశాల తోసివ్వకు. అయితే ఒక్కమాట! నేను చెప్పిన 'రహస్యం' రహస్యంగానే ఉంచుతావు కదూ!" ఆఖరుగా అర్థించాడు.

నీవు చెప్పిన సంగతులన్నీ ఈ క్షణాన్నే మర్చిపోయేందుకు నేను సిద్ధం. నాకు తప్ప మరెవరికీ తెలీనివ్వను. నిశ్చింతగా ఉండు" అన్నాను.

సంజూ నా దగ్గర సెలవు పుచ్చుకుని వెళ్ళిపోయాడు.

కొన్నాళ్ళ తరువాత డిఫెన్స్ లేబరేటరీలో ఓ పెద్ద దొంగతనం జరిగింది. అత్యంత దుర్లభమైన ఓ మెటల్ ఓ సేఫ్‌లోంచి దొంగిలించారెవరో. సేఫ్ కాంబినేషన్ చాలా కొద్దిమందికే తెలుసు. గమ్మత్తేమిటంటే దొంగ తన వేలిముద్ర అలాగే వదిలేశాడు.

ఆ మెటల్ సామాన్యుల కుపయోగపడేది కాదు. పైగా కాంబినేషన్ చాలా గుప్తంగా ఉంచుతారు కాబట్టి ఈ దొంగతనం ఎవరో సైంటిస్టు పనే అయ్యుంటుందని పోలీసుల అంచనా. లాబ్‌లోని అందరి వేలిముద్రలు పరిశీలించారు కాని సేఫ్‌మీది ముద్రలతో కలిసేలా లేవు. పైగా సేఫ్ ఎవరికి పడితే వారికి తెరవవచ్చేలాగా లేదని దాన్ని తయారుచేసినవారు నొక్కి చెబుతున్నారు.

నాకు మాత్రం ఇంకో అనుమానం వచ్చింది ఈ పని సంజూదే అయ్యుంటుందని. వాడేదో అత్యంత దుర్లభమైన 'వస్తువు' కావాలన్నాడా రోజు. అదే ఇదై వుంటుంది. వేలిముద్రలలాగే వదిలేయడంలో వాడి వికృతమైన వినోదబుద్ధి కనిపిస్తుంది. వేలిముద్రల్ని అద్దంలో చూసి పరీక్షించాలని ఎవరికి తోస్తుంది కనుక?

మరికొన్నాళ్ళకి 'డిఫెన్స్ లాబ్‌లో ఆక్సిడెంట్, సైంటిస్టు స్థితి చింతాజనకంగా ఉం'దన్న వార్త పేపర్లో చూడగానే మనసు దడదడ లాడింది. కొన్ని కారణాలవల్ల ఆ సైంటిస్టు పేరు గుప్తంగా ఉంచారు. కాని వాడు సంజూయేనేమోనని నాకు ఉండుండి అని పిస్తుంది.

ఉండబట్టలేక నేనెలాగో తంటాలుపడి ఏదో పెద్ద రెకమండేషన్‌తో అతని పేరేమిటో కనుక్కోగలిగాను. నా అంచనా ప్రకారం వాడు సంజూయే.

వాడు ప్రయోగం చేస్తున్నప్పుడేదో పెద్ద పేలుడు సంభవించి అక్కడి సామాన్లన్నీ చిన్న చిన్న ముక్కలుగా చెల్లాచెదరై పోయాయి. సంజూ అదృష్టవంతుడు గనుక ఎలాగో గాయాలవకుండా తప్పించుకోగలిగాడు. అయినా నెలరోజులదాకా స్పృహలో లేడు.

సంజూ నా బాల్యమిత్రుడనీ ఆక్సిడెంటుకు కొన్ని రోజుల ముందు మా ఇంటికి భోజనానికొచ్చాడనీ చెప్పడంతో డాక్టరు నన్ను కావాలని పిలిపించారు. ఆ ఆక్సిడెంటుకు ముందు చాలా రోజుల్నుంచీ సంజూతో మాట్లాడిన వారెవ్వరూ లేరు. వాడు పూర్తిగా ఒంటరి జీవితం గడిపేవాడనీ లాబ్‌లోని కొలీగ్సుతో కూడా మాట్లాడేవాడు కాదనీ తెలిసింది. ఇప్పుడు వాడు స్పృహలోకొచ్చే ఆస్కారం ఉంది గనుక ఆ సమయంలో నేనక్కడుండడం అవసరమనిపించింది డాక్టరుకి!

కాని స్పృహలోకొచ్చాక సంజూ నన్ను గుర్తించలేదు. దానిక్కారణం వాడి జ్ఞాపకశక్తి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది.

తన ప్రయోగం పూర్తిగా ఏ లోటూ లేకుండా సక్సెసవాలని అతడేదో దుస్సాహసం చేసుంటాడు. ప్రతిబింబస్థితినుంచి పూర్వస్థితికొచ్చాక ప్రతిబింబస్థితిలోని జ్ఞాపకాలు మరచిపోకూడదనే ప్రయత్నంలో వాడు తన అసలు జ్ఞాపకశక్తినే కోల్పోయాడు. అక్కడికి వాడదృష్టవంతుడు కాబట్టి ఇతర విషయాల్లో వాడి మెదడు నార్మల్‌గానే ఉంది. అయితే తనెంత గొప్ప పరిశోధన చేశాడో తనకే తెలీదు. తాను వ్రాసిపెట్టిన ఆ వివరాలు ఏ 'సురక్షిత'మైన చోట దాచాడో! అది దొరికేవరకూ వాడు చెప్పిన సంగతి ప్రపంచానికి చెప్తే నమ్మదు!

ప్రపంచానికేం ఖర్మ! నాక్కూడా అప్పుడప్పుడిదంతా కలేమోననిపిస్తుంది. ప్రమోద్ బోలింగు వెనుక ఇంత గొప్ప రహస్యం దాగుందా? నేను నిజంగానే సంజూని ప్రతిబింబావస్థలో చూచానా?

ఇలాంటి ప్రశ్నలు రేకెత్తినప్పుడల్లా నేను మ్యూజియంలోకెళ్ళి తృప్తిపడుతూంటాను. అందుక్కారణం అక్కడ షెల్ఫ్‌లో ఈ సంఘటనలన్నింటికీ సాక్షంగా నిలబడున్నాడు కుడివేపు తొండం గల గణపతి.

ఆదిమవాంఛ

శ్రీ నిఖిలేశ్వర్

ఏ గహనాంతర సీమల్ని
మానవరేతస్సు దూసుకోనున్నదో,
సాంద్ర తమోనిల నిగూఢ లోయల్లోకి
ఈ ఆదిమవాంఛ
అంతుపట్టని వేగంతో కూలనున్నదో!

పెనవేసుకున్న ప్రకృతి లోతుల్లోకి
కూరుకపోడమే అంతిమయాత్ర,
నలువైపులా నిలదీసే దృశ్యాల
నిగ్గు తేల్చుకోడంలోనే—
అనంత జీవనరాగం........

డా॥ కె. లక్ష్మీ నారాయణ

సర్వ సంపత్ప్రదాయిని - తులసి

తులసి హిందువులకు పవిత్రమైన మొక్క. ఆసేతు హిమాచల పర్యంతం ఎంతో భక్తిభావంతో తులసిమొక్కని ఆరాధిస్తారు.

1) వృందాం వృందావనీం విశ్వపూజితాం విశ్వపావనీం।
పుష్పసారం నందినీం చ తులసీం కృష్ణజీవనీం।

2) తులసీ శ్రీ మహాలక్ష్మీర్విద్యా విద్యా యశస్వినీ
ధర్మాధర్మ సనాదేవీ దేవ దేవ సమః ప్రియా
లక్ష్మీప్రియ సఖీదేవీ ద్యౌర్భూమి ర చలా చలా!

(పుండరీక కృత తులసీ స్తోత్రం)

సర్వసాధారణంగా అందరి ఇళ్ళల్లోను పెరిగే తులసిమొక్కకి పూజాది పుణ్యకార్యాలలోనే కాక, పెక్కు ఔషధ గుణాలుండుట చేత వైద్యశాస్త్రపరంగాను, వాస్తుశాస్త్రరీత్యా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నది. తులసి మొక్కలు మార్చి నెలనుండి, జూన్ వరకు పెరిగి, సెప్టెంబరు అక్టోబరు నెలలో పూలు పూచి, డిసెంబరు నాటికి విత్తనాలు లభిస్తాయి. సంవత్సరం పొడుగునా కనిపించే తులసిలో రెండు రకాలున్నాయి.

(1) శ్రీతులసి (1)కృష్ణ తులసి

శ్రీతులసిని, లక్ష్మి, సులభ, సురస, బృంద, వైష్ణవి, అమృత, శ్యామ, రామ, గౌరి, బహుమండలి అని కూడా పిలుస్తారు.

పౌరాణిక ప్రాముఖ్యం

తులసి జన్మ వృత్తాంతం

దేవా సురులు సముద్ర మథనం చేసే సమయంలో కల్ప తరువు, కామధేనువు మొదలైనవాటితోపాటు తులసి మొక్క కూడా ఆవిర్భవించిందని, బ్రహ్మవైవర్త పురాణంలో పేర్కొన్నారు.

పాల సముద్రాన్ని మథించినప్పుడు ఉద్భవించిన అమృత కలశమును ఒకచోట ఉంచు సమయంలో విధివశమున రెండు చుక్కలు భూమిమీద పడినవి. ఆ ప్రదేశంలో రెండు అందమైన మొక్కల బయలుదేరినవని, అందులో ఒకటి పారిజాతము, రెండవది తుల మొక్కగా పెరిగాయని, సత్యజిత్తు డనునాతడు ఆ రెండు మొక్క లకు నీరుపోసి పెంచేవాడని ఒక గాథ. (మాఘ పురాణం - ఏకాద వ్రత మాహాత్మ్యం - క్షీరసాగర మథనం)

జలంధరుని భార్య బృందాదేవి, శ్రీ మహావిష్ణువు మోసమునక గురికావటంచేత, అగ్ని ప్రవేశం చేస్తుంది. ఆమె విరహాన్ని భరిం లేని విష్ణుమూర్తి బాధను చూచి, సకల దేవతలు నివారణోపాయ కొరకు ధాత్రి, లక్ష్మి గౌరి అను త్రిశక్తులను ప్రార్థించగా వార వారి అంశలతో కూడిన మూడు రకముల విత్తనములనిచ్చి, విష్ వున్నచోట జల్లమని ఆదేశిస్తారు. ఆ విధంగా గౌరిచే ఈయబడి గింజల వలన "తులసి", లక్ష్మిదేవి ఇచ్చిన గింజలవలన "మాలతి" భూదేవి యిచ్చిన గింజల వలన "ఉసిరిక" చెట్లు మొలిచినవి. ఈ మూడింటిని స్పృశించిన పిదప విష్ణువునకు మనశ్శాంతి లభిస్తుందని పై మూడు చెట్లు శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైనవని స్కాం పురాణం తులసీ ఉపాఖ్యానంలో చెప్పబడినది.

బ్రహ్మవైవర్త పురాణంలో తులసిగాథ

తులసి సాధారణ గోపికా స్త్రీ. కృష్ణుని అనురాగ పాత్ర రాలు. ఒకానొకప్పుడు శ్రీకృష్ణునితో ఆనంద పారవశ్యంలో ఉన్న తులసిని చూచిన రాధ ఓర్వలేక ఆమెని భూమిమీద జన్మించమ శపిస్తుంది. ఆ విధంగా శాపగ్రస్తురాలైన గోపిక ధర్మధ్వజ మహ రాజుకు, మాధవీదేవికి కృష్ణప్రియగా కార్తీక పౌర్ణమినాడు జని స్తుంది. దేనితోను సాటిరాని ఆమె అందచందాలను చూచి ముగ్ధు ఆమెకి తులసి అని నామకరణం చేస్తారు. ఇక్కడ తులసి అ పేరు కింకొంక వివరణ సముచితం.

తులాంశ్యతి, యితి తులసి అంటే తనతో సరిసమానమై దేదీలేదని యర్థం. ఇదే భావం ఈ క్రింది శ్లోకంలో కూడ వ్యక్త మవుతుంది.

నరా నార్యశ్చతాం దృష్ట్వా తులనాం దా తుమక్షమాః।
తేననామ్నాచ తులసీం తాం వదంతి పురావిదః।

స్త్రీ పురుషులు తులసిని చూచిన సందర్భంలో ఆమె సౌంద ర్యాన్ని అంచనా వేయలేకపోయేవారని అందుచేత ఆమెని తులసి అనే నామంతో పిలిచేవారని భావం వ్యక్తమవుతుంది. ఇదే భావన ఈ క్రింది శ్లోకంలో కూడా వ్యక్తం చేయడం జరిగింది.

తకారో మరణం ప్రోక్తం తథోగశ్య దుకారతః
మృతాలస్తి సేత్యేనం తులసీత్యేవ గీయతే।
(బ్రహద్ధర్మ పురాణం)

ఆ తరువాత కొంత కాలానికి ఆమె తపస్సు చేయు నిమిత్తం అడవులకు వెళ్ళిపోవడం జరుగుతుంది.

ఇదిలా ఉండగా రాధవలన శాపగ్రస్తుడైన సుధాముడనేవాడు, శంఖచూడుడుగా జన్మించి బ్రహ్మ అనుగ్రహం వలన అనేక వరాలను పొందుతాడు. ఆ తరువాత తులసిని ప్రేమించగా, ఆమె అతని ప్రేమను నిరాకరించడం, దేవతలను అనేక బాధలు పెట్టడం జరుగుతుంది. చివరకు శంఖచూడుడిని సంహరించే సమయంలో తులసి శరీరం గండకీ నదిగాను, ఆమె శిరోజాలు పవిత్రమైన తులసిమొక్కగాను రూపొందినట్లుగా బ్రహ్మ వైవర్త పురాణగాథ. తులసియొక్క ప్రాముఖ్యాన్ని, పవిత్రతని అనేక పురాణేతిహాసాలలో ప్రస్తావించడం జరిగింది.

కార్తీక మాసంలో తులసి చెట్టును చూచినా, ఆరాధించినా పాప విముక్తి లభిస్తుంది. తులసిచెట్టు నీడలో శ్రద్ధతో ఏ కార్యాన్ని చేసినా పితృదేవతల ఆత్మ శాంతిస్తుంది. అంతేకాక తులసి మొక్క దగ్గర దీపారాధన చేసినవారికి విష్ణులోకప్రాప్తి కలుగుతుంది. నర్మదానది తిలకించడం, గంగలో స్నానమాచరించడం, తులసి చెట్టును స్పృశించడం ఈ మూడు ఒకే ఫలితాన్నిస్తాయని పద్మ పురాణం ఉత్తరకాండలో పేర్కొన్నారు.

ప్రతి నిత్యము తులసిమొక్కని పూజించినవారికి మోక్ష ప్రాప్తి కలుగుతుందని "గౌరీతంత్రం"లోని ఈ క్రింది శ్లోకాన్నిబట్టి వ్యక్తమవుతుంది.

యే తులసి సేవా కుర్వంతి గిరిసంభవే
నానోపహార స్తే యాన్తి తద్విష్ణోః పరం పదం
యేకుర్వంతి మహాభాగే తులసినామ కీర్తనం
తద్వనం చ పశ్యంతి విష్ణునైవ సమాహితే

ఒక సందర్భంలో విష్ణేశ్వరుడు తులసిని ఈ విధంగా స్తుతిస్తాడు.

పుష్పాణాం సారభూతాత్వం భవిష్య శిమనోరమే।
కలాం శేన మహాభాగే స్వయం నారాయణ ప్రియా।
ప్రియా త్వంసర్వ దేవానాం కృష్ణాశ్యచ విశేషతః।
పూజా విముక్తి దానణాం మమత్యాజ్యాచ సర్వదా।
(బ్రహ్మ వైవర్త పురాణం - గణేశకాండ)

సుందరమైన ఓ తులసీ, విష్ణుమూర్తి అంశానివైన నీవు పుష్పరాజానివి. దేవత లందరిచేత ఆరాధింపబడే నిన్ను ఆరాధించిన వారికి మోక్షప్రాప్తి కలుగుతుంది.

యన్మూలే సర్వ తీర్థాని, యన్మధ్యే సర్వదేవతా।
య దగ్రే సర్వవేదాస్యా తులసీంతాం సమామ్యహమ్।
(మాఘ పురాణం)

తులసిమొక్క మొదలులో సమస్త తీర్థములు, మధ్యభాగాన సకల దేవతలు, శాఖలందు వేద వేదాంగాలకు నిలయము అని విశ్వసించుటచేత, కార్తీకపౌర్ణమినాడు, క్షీరాబ్ది ద్వాదశినాడు, కృష్ణాష్టమీ రోజున హైందవ స్త్రీలు ఆరాధించడం చూస్తూ ఉంటాము. పూజకొరకు తులసి ఆకులను కోసేముందు కొన్ని నియమాలు పాటించాలని ఈ శ్లోకాల అర్థము.

పూర్ణిమాయాం అమాయంచ ద్వాదశ్యాం రవి సక్రమే।
తైలాభ్యంగేచ స్నాతేన మధ్యాహ్నే నిశి సంధ్యాయోః॥
అశౌచే శుచి కాలేచ గ్రాత్రి వాసాన్వితే పివా।
తులసీం యేచ ఛిన్నవ్వంతి తేఛిందంతి హరేః శిరః॥

అనగా పౌర్ణమీ, అమావాస్య, సంక్రమాణం రోజులలోను, అభ్యంగన సమయంలో తలకు నూనె రాసుకుని ఉన్నప్పుడు, అపరాహ్నం, రాత్రి, సంధ్య వేళలందు, అపరిశుభ్రంగాను, అశౌచమైన బట్టలు ధరించి తులసిదళాలను కోయుట నిషిద్ధము. అట్లు చేస్తే విష్ణుమూర్తి శిరస్సు త్రుంచినట్లుగా భావన-

అస్నాత్వ తులసి ఛిత్వా।
యా పూజం కురుతే నరః
సోపరాధే భవేత్ సత్యం
తత్సర్వం నిష్ఫలం భవేత్। (వాయు పురాణం)

తులసిదళాలను, స్నానమాచరించి కోయాలి. లేనిచో ఆ పూజ నిష్ఫలము. దళాలను కోసేముందు ఈ క్రింది శ్లోకాలను పఠించాలి.

మాతాస్తులసి గోవింద హృదయానందకారిణి।
నారాయణాశ్య పూజార్య ఛినోమిత్వాం నమోస్తుతే॥
త్వావినా మహా భాగే సమస్తం కర్మ నిష్ఫలమ్।
అత సులసిదేవి త్వాం ఛినోమి వరదా భవ॥

చయనోద్భవ దుఃఖం యద్దేవితే హృదివర్తతే।
తత్క్షమశ్వ జగన్మాతస్తులసి త్వాం నమామ్యహం॥

విడి ఆకులను, కొమ్మలను కోయరాదు. తొందరగా కోయరాదు. దళాలనే కోయవలె. తులసిమాలను ధరించినవారికి అశ్వమేధ యాగ ఫలం లభిస్తుందని చెపుతారు. వాయుపురాణంలో ఈ విధంగా పేర్కొన్నారు.

తులశ్యామిత జన్మాశి సదాత్వం కేశవప్రియా।
కేశవార్థేభినో యిత్వమ్ వరదాభవ శోభనే।
(వాయు పురాణం)

ఈశ్వరునికి ప్రియమైన తులసికి నమస్కారము. శివారాధనకై నీ దళములను కోయుచున్నాను. క్షమించి నాకు వరముల నొసంగుము అని భావము.

వాస్తు శాస్త్ర ప్రకారం వాస్తుశాస్త్రంలో తులసి ఉన్నదని తెలుస్తుంది. సింహద్వారంనుండి చూస్తే పెరడులో ఉన్న తులసి మొక్క కనిపించాలని, అట్టి ఇల్లు సమస్త దేవతలకు నిలయమని చెపుతారు. ఇల్లు కట్టిన తరువాత, ఇంట్లో తులసిమొక్క ఉండవలసిన స్థలం, తులసి ధ్యానం మొదలైన విషయాల వివరణ అనేక వాస్తుశాస్త్ర గ్రంథాలలో (గృహ వాస్తు దర్పణం - పుట నెం. 261) పేర్కొన్నారు. ఈ విధంగా పురాణాలలో ఎంతో పవిత్రంగా వర్ణించబడిన తులసిమొక్క, వైద్యశాస్త్రపరంగా కూడ ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నదనుటకు అనేక ఆయుర్వేద గ్రంథాలలోను, పురాణాలలోను పేర్కొన్న శ్లోకాలే తార్కాణము.

ఘాటైన వాసనతోను, కారంగాను ఉండే తులసిమొక్కకి వాత, పిత్త, కఫాన్ని గుండె రోగాలను, రక్తహీనతను, ఆస్త్మా మొదలైన రోగాలను నయంచేసే శక్తి ఉన్నదని చరక శుశృతలో తులసి ఔషధ గుణాలని వర్ణించారు.

హిక్కా విషాస్వాస పర్శ్వశూల వినాశినే।
పిత్తా క్రిత్ కఫా వాతాగ్ని సురాసాయితి గంధాయుత।
గౌరవే శరీర శూలే పీనాధ విభేదకే।
క్రిమికాద్యా వ్యాస్మారే పాణనాశే ప్రమోహకే।

తులసి మొక్కలున్నచోట పాములు, తేళ్లు మొదలైన విష జంతువులు రావు సరికదా, క్రిమినాశని.

తులసి కాననం చైవగృహే యశ్యావతిష్ఠతి।
తత్గృహం తీర్థాభూతమ్ హినా యాంతి యమకింకరః
తులసి గంధ మాదాయ యాత్రా గాచ్ఛటి మారుతః
దిషో దిషాశ్య పూతాశ్యుః భూతగ్రామాష్ చతుర్విధాన్।
(పద్మ పురాణం)

అధర్వణవేదంలో ఈ క్రింది శ్లోకాన్నిబట్టి చర్మవ్యాధులను నశింపచేసే గుణం శ్యామతులసికి ఉన్నట్లుగా వ్యక్తమవుతుంది.

సరూపాక్రితత్వ యోష ధీశా సరూపామిధం క్రిధి
శ్యామసరూపమ్ కరణే పృథివ్యాత్యాద్భూతా
యిదంశు ప్రసాధ్యాయా పునః రూపాణి కల్పయామ్।

ఈ విధంగా పురాణేతిహాసాలలో తులసిమొక్క ఔషధ గుణాలను వర్ణించారు. ఆధునిక వైద్యశాస్త్ర నిపుణులు కూడ తులసి మొక్కలో ప్రతి భాగం అనేక రోగాలను నయం చేస్తుందని తమ పరిశోధనా ఫలితాలద్వారా వెల్లడి చేస్తున్నారు. ఇందుకు కొన్ని ఉదాహరణలు:

తులసి ఆకులు

తులసి ఆకులనుండి తీసిన రసం, దగ్గు, చర్మవ్యాధులు, ఉదరకోశ వ్యాధులు, పిల్లల్లో కాలేయము, అతిసారమువంటి వాటిని నయం చేస్తుంది.

చెముడు, చెవిపోటు మొదలైన చెవికి సంబంధించిన రోగాలను, కంట్లో దురద, మంట, ఎరుపెక్కుట వంటివి తులసి ఆకుల రసంతో నివారించవచ్చు.

మిరియాలతో తులసి యాకులను నమిలితే పంటినొప్పులు పోతాయని కొందరి పరిశీలకుల భావన.

గింజలు కూడా....

సాధారణంగా తులసిమొక్క (వెన్నులు) గింజలు ఎక్కువగా ఉన్నప్పుడు తుంచి పారవేయడం చేస్తాము. కాని ఆయుర్వేదంలో వాటి గుణగణాలను విశదీకరించారు. తులసి గింజలవలన, మల బద్ధము, మూలశంక, మూత్రకోశ వ్యాధులను పోగొట్టవచ్చు. రక్తంలో క్రొవ్వు శాతాన్ని తగ్గించే లక్షణం ఉన్నది కనుక రక్తపు పోటును కూడ అరికట్టవచ్చు.

తులసి వేళ్లు

తులసి వేళ్ళతో కాచిన కషాయము మలేరియా జ్వరాన్ని పోగొడుతుంది. దోమ, తేనెటీగలు కుట్టినచోట తులసివేళ్ళతో తీసిన గంధాన్ని రాస్తే ఉపశమనం కలుగుతుంది.

మనిషికి ప్రాణవాయువు ఎంత ముఖ్యమో ఓజోన్ వాయువు కూడ అంత అవసరం. ఓజోన్ క్రిమినాశని. అందుచేత నీటిని శుభ్ర పరుచుటకు ఉపయోగిస్తారు. మెరుపులతో కూడిన వర్షం పడినప్పుడు కూడా ఓజోన్ జనిస్తుంది. ఆక్సీకరణం వలన గాలిలో దోషాలను నివారించే శక్తి ఉన్నది. ఇన్ని గుణాలున్న ఈ వాయువు తులసి మొక్కనుండి కూడా లభిస్తుందంటే అతిశయోక్తి గాదేమో! ఇది ఈ మధ్య నిర్వహించిన పరిశోధనా ఫలితాల విషయం—

ఈ విధంగా దైవ సంబంధమైన కార్యాలలోనే కాక, వైద్య శాస్త్రరీత్యా, వాస్తుశాస్త్రపరంగా ఎంతో ప్రాముఖ్యత గల తులసి మొక్క సదా పూజనీయము.

నమస్తులసి కళ్యాణి నమో విష్ణుప్రియే శుభే।
నమో మోక్షప్రదే దేవీ నమః సంపత్ప్రదాయికే।

(పుండరీక కృత తులసీ స్తోత్రం

హేమంతరాజ్ఞి

1. చలికి సుహుహూయని జనము సాగిలపడ,
పూర్వగిరి శృంగమందున పొడిచె నినుడు
తొలి యుషస్సు మంచు తెరలదోల, విచ్చె
మధుర లజ్జా వినీత హేమంత కాంత.

2. పల్లెపట్టుల చలివేళ నెల్ల వారు
నెండుటాకుల మంటలు దండిగాను
రగులుకొల్పుచు నుందురు నెగులులేక
తృప్తి బ్రదుకును పండింప ధీరులగుచు

3. మార్గశిర పుష్యమాసాల మహితమగుచు
బంతి చేమంతులవి యెంతొ, యింతికొప్పు
కెక్కి నిక్కిచూచు విధము, నిక్కముగను
గగనమందలి చుక్కలుగాగ తలతు.

4. పరిమళాభిషేక విశిష్ట పారిజాత
సుమములు. గులాబి సుమములు, విమలమంజు
మల్లికాసుమములు నన్నుఫుల్ల హృదయు
నెన్నొ పూర్వ వాసనల సంపన్ను జేయు.

5. అతివ గుండెలు పొగలేని అగ్నిశిఖలు
గాగ, చలి భయమేల? శృంగారి నాకు
నిండు హేమంతమందున నీరజాక్షి
నన్ను కరుణింప, లేనిది నాకు లేదు.

శ్రీ ముసునూరు రఘువర్మ

పగిలిన విలువలు

నిద్రపట్టని రేయిలా
దీర్ఘమైన నీ ప్రేమ ఆజ్యం – నా
యౌవనాగ్ని యజ్ఞగుండాన్ని చేరినప్పుడు
నిస్పృహతో నిర్వీర్యం చేయబడింది–
మెల్లి మెల్లిగా వెంటాడబడింది–
–లేత సాయంత్రంలా!
సంధ్య గడిచి – కొన వెలుగు చిట్లి
ఎలుగులాంటి అంధకారం పలుగు పగిలి – జారి
నన్ను నిండా ముంచెత్తినప్పుడు – నీ
మమతల సుమప్రవాహాన్ని అలక్ష్యం చేసుకున్న
నన్ను నేను పరికించి చూసుకుంటే – నీ
సానుభూతి ముఖాల బంగారు గనులు
నా ఎదలోనే వుండి–అనుభూతి కందని–అందని ద్రాక్షలై
అద్దం లేకుండా కనిపించని ముఖమై
–మబ్బు విడిచిన తీక్షణ ఎండయై – జాలువారి
నా హృదయ ఉపరితలం బీటలు వారుతోంది–
మండు వేసవి తాకిన నేలలా!
భూకంపం విదిలించిన నగరంలా!!

శ్రీ చెన్నోజు రామమోహన్‌రావు

అవస్థ

కన్నడ మూలం :
డా॥ జి. యస్. శివరుద్రప్ప

తెనిగింపు :
శ్రీ శంకరగంటి రంగాచార్యులు

చలికి గడగడ వడకుతూ
ముడుచుకుని మూలలో కూర్చున్న
చింపిపాతల చిట్టిపిల్లవాడిని కని
వెచ్చని దుస్తులు ధరించిన నాలోనూ
వణకు మొదలవుతోంది.

వాడు అలా ఉండటానికి
నేనూ కారణమనిపిస్తోంది.

గేటు అవతల ముసలి బిచ్చకత్తె
అన్నానికి అరచేవేళ
నేనెలా భోంచేయగలను చెప్పు?
ఆ కేక మనిషిదో,
ప్రాణిదో,
లేదా శతాబ్దాల ఆకలి ధరించిన ఆకారమో,
ఎలా వినగలను నేను?
విని ఎలా ఉరకుండగలను?

ఆ ముసల్ది అలా ఉండటానికి
నేనూ కారణమనిపిస్తోంది.

తల దాచుకోడానికి గూడు లేక
పార్కు, అంగడికట్టు, ఇంటి అరుగు,
లేదా, మురికివాడ పాడుబడిన చావడిలో,
ఎలాగో బదుకీడ్చే అసంఖ్యాకుల్ని చూసి
వెచ్చని ఇంట్లో
నేనెలా నెమ్మదిగా ఉండగలను?

వాళ్ళందరూ అలా ఉండటానికి
నేనూ కారణమనిపిస్తోంది.

రేయింబవళ్ళూ
ఈ దృశ్యాలు,
ఈ కేకలు, బాధలు,
ఈతెల్లా నాటి చొరబడతాయి
ఇంట్లోకి, ఎడదలోకి, నిదురలోకి, కలల్లోకి,
నేనేమీ చేయలేని అసహాయతకు
పొడిచి.
నా సమస్తాన్నీ గాయపరుస్తాయి.
ఈ అన్నిటినీ కానన్నట్లు,
విని, విననట్లు,
నటిస్తూ బదకడం
వీలైతే
అది వేరు మాట.

రేగి పడతాను నామీద
నాలాంటివాళ్ళమీద,
నాలాంటివాళ్ళతో నిండిన
ఈ సమాజంమీద,
దీని ప్రతినిధియైన వ్యవస్థమీద,
అది నిరంతరంగా మిగిలించిన
ఈ అవస్థమీద!

ఈ మాసం - మీ నక్షత్రఫలం

డిసెంబరు - 1988

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా)

అశ్విని వారికి 11 తేదీనుండి కార్యానుకూలత, ఆరోగ్యం, ధన లాభం, సంసార కుటుంబ సౌఖ్యం, సర్వకార్యములందు విజయం, మాట పలుకుబడి మొదలగు మంచి ఫలములు కలుగును. 12-14 తేదీలమధ్య శుభకార్యాలలో, స్థిరాస్తి వ్యవహారాలలో చిక్కులు కలిగి తొలగిపోవును. ఆర్థిక విషయాలు బాగుగా నుండును. కుటుంబంలో అనుకోని మార్పులు, సంఘటనలు వలన మనస్సునకు వ్యథ కలిగించును.

భరణి వారికి 9వ తేదీవరకు శ్రమ. ఖేదము, వ్యయము కలుగును. ఇంతవరకు నెరవేరని పనులు ఒక్కొక్కటే సానుకూల పడును. శుభకార్యాలు అనుకూలించును. మానసికంగా శ్రమ హెచ్చును. సోదర సోదరీ వర్గంవారితో విరోధము, వ్యవహారములలో ఆకస్మిక ప్రతిష్టంభన జరుగును. నీచులతో సంబంధము వలన ధన లాభము, కించిత్ అపవాదులు కలుగును. మొత్తంమీద శుభాశుభ మిశ్రఫలం కలుగును.

కృత్తిక 1పా. వారికి 10 తేదీనుండి శారీరకశ్రమ, అధిక వేడిమి కలుగును. బంధువులవల్లను, భూగృహాది వ్యవహారాదుల వల్లను స్వల్పంగా చిక్కులు, పడుట మొ॥న కించిత్ ప్రమాదములు కలుగును. రాజకీయ నాయకులతో పలుకుబడి కలసివచ్చినా, శని బలం ప్రతికూలంగా ఉండుటవలన తగినంత సంతృప్తి ఉండును. విద్యార్థులకు, వర్తకులకు శ్రమమీద ఫలితం కొనసాగును.

వృషభం (కృత్తిక 2, 3, 4పా. రోహిణి, మృగశిర 1, 2 పా)

కృత్తిక 2, 3, 4పా. వారికి మొదటి పాదంకన్న అధిక శుభ ఫలం కలుగును. వ్యవహారములన్నీ అనుకూలంగా ఉండును. ఉద్యోగులకు, వర్తకులకు బాగా మేలు కలుగును. కుటుంబంలో సుఖ శాంతులేర్పడును. 10 తేదీనుండి అధికశ్రమ, అధిక వేడిమి కలుగును. చివరివారంలో భార్యకు స్వల్పంగా నలతచేసి నిమ్మళించును. ధనవ్యయం అధికంగా జరుగుచుండును.

రోహిణి వారికి శరీరంలో నలత, శ్రమ, ధనవ్యయము జరుగును. సంతానమునకు స్వల్పంగా నలత చేయును. శుభకార్యములన్నీ వాయిదా పడును. పనికిమాలిన ధనవ్యయం జరుగును. ఉద్యోగములో మంచి అభివృద్ధి కలుగును. బంధుమిత్రాదుల రాకపోకలు మొదలగువాని మూలకంగా ధనము ఖర్చగుచుండును. కొన్నాళ్ళవరకు శ్రమ మాత్రం అత్యధికంగా నుండును.

మృగశిర 1, 2పా. వారికి మొదటి 15 రోజులు శుభయోగ ఫలము కలుగును. అధికశ్రమ కలుగును. శుభకార్యములు అనుకొన్నట్లు నిర్విఘ్నంగా నెరవేరును. ధనాదాయం బాగుగా నుండును. ఉద్యోగులకు, వ్యాపారులకు, లాయర్లు, డాక్టర్లు, వివిధ వృత్తుల వారికి కూడ బాగుగా కలసివచ్చును. వ్యవసాయదారులకు సమృద్ధిగా పాడిపంటలు, ధనలాభం, సుఖసంతోషాలు కలిగించును. మిగతా 15 దినములు అధికశ్రమ కలుగును.

మిథునం (మృగశిర 3, 4పా. ఆరుద్ర, పునర్వసు 1,2,3పా)

మృగశిర 3, 4పా. వారికి గ్రహబలం మధ్యమంగా ఉన్నది. 18-25 తేదీలమధ్య భార్యకు లేదా కుటుంబంలో అనారోగ్యం, ధన వ్యయం ఉద్యోగ వ్యవహారాలలో స్వల్పంగా చిక్కులు ఏర్పడుట, ధనాదాయం బాగానే ఉన్నా, పూర్తిగా ఒక్కసారి చేతికి రాకపోవుట, వచ్చినదానిలో హెచ్చుభాగం పనికిమాలిన ఖర్చగుటా, ఆత్మీయులతో వాగ్వాదము, మనస్సులో ఏవేవో పనికిమాలిన ఆలోచనలు చేయుట మొదలగువానితో గడచును. శుభాశుభ మిశ్రఫలం కలుగును.

ఆర్ద్రవారికి శుభాశుభ మిశ్రమఫలమే కలుగును. మనో వైకల్యం హెచ్చుగా నుండును. వ్యవహార ప్రతిష్టంభన జరుగును. శుభకార్య ప్రయత్నములలో చిన్న చిన్న పేచీలు ఏర్పడును. శ్రమ, బడలిక హెచ్చును. వ్యాపారస్థులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు బాగుగా నుండును. రాజకీయవాదులకు శ్రమ హెచ్చుగా నుండును. పుణ్యకార్యములు, దేవతా పూజలు మొదలగువానిమూలకంగా ధన వ్యయము హెచ్చు జరుగును.

పునర్వసు 1, 2, 3పా. వారికి శరీరశ్రమ హెచ్చు. 1-9 తేదీలమధ్య ధనలాభం, బాగుగా నుండును. ఉద్యోగులకు మంచి అభివృద్ధి కలుగును. ఇదివరకు తెగని సమస్యలు ఈ నెలలో పరిష్కారం కాగలవు. అయితే ప్రతి చిన్న విషయములోను అత్యధికంగా శ్రమ పడవలసి వచ్చును. బంధుమిత్రాదుల రాకపోకలు

అధికంగా నుండును. శుభకార్యములలో పాల్గొనుట జరుగును. ఆర్థికంగా అన్ని రంగాల వృత్తి వ్యాపారములలో ఉన్నవారందరికి బాగుగా కలసివచ్చును. ప్రతి విషయంలోను పిరికితనం, శారీరకంగా బలహీనత కల్గును.

కర్కాటకం (పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష)

పునర్వసు 4పా. వారికి నెలంతా శ్రమగా నుండును. మనస్సులో పనికిమాలిన ఆలోచనలు, ఆందోళనము హెచ్చుగా నుండును. ధనాదాయమూ, దానికి మించిన ఖర్చులు ఉండును. పితృవర్గ బంధువులతో మాటపట్టింపులు వచ్చును. శుభకార్య ప్రయత్నములు కొంతవరకు ఫాయిదా పడును. మొగమాటములకు పోయి కొన్ని బాధ్యతలను నెత్తిన వేసికొని వాటిని నెరవేర్చలేక, తమ పనులకు హాజరు కాలేక బాధపడుట జరుగును.

పుష్యమి వారికి 9 తేదీవరకు శరీరశ్రమ, నలత కలుగును. తర్వాత ధనాదాయం, గౌరవము, పరపతి, హోదా పెరుగును. బంధుమిత్రాదుల రాకపోకలు, అధికంగా నుండును. విందులు, వినోదాలు, మొదలగువానితో గడచును. బయటికి గంభీరంగా, ఆడంబరంగా ఉన్నను, లోలోపల ఏదో విషయమైన అసంతృప్తి బాధిస్తూ ఉండును. అయితే పెద్దవారితో పరిచయం, పలుకుబడి మూలకంగా పరిస్థితులన్నింటినీ నెట్టుకొని వస్తారు. నెలాఖరునాటికి అన్నియు అనుకూలం కాగలవు.

ఆశ్లేష వారికి 10 తేదీనుండి శరీరశ్రమా, నలత హెచ్చుగా నుండును. అనేకవిధాల వత్తిడులు, ఒడుదొడుకులు, ఈతిబాధలు మొదలగునవి కలుగును. శరీరశ్రమ అధికంగానే ఉండును. వ్యవహారాలలో ఒక్కసారిగ చిక్కులు చుట్టుముట్టుకొని, కొంచెం పరిస్థితిని ఉక్కిరి, బిక్కిరి చేయుట జరుగును. నమ్మినవారి మోసానికి గురి కావడం జరుగును. ప్రయాణాలు అధికం. తన్మూలకంగా వ్యయప్రయాసలు కూడ హెచ్చుగా జరుగును.

సింహం (మఘ, పుబ్బ, ఉత్తర 1 పా.)

మఘ వారికి నెలంతా అనుకూలంగానే ఉండును. ధనాదాయం బాగుండును. దైవపూజలలో, శుభకార్యాలలో, ఆధ్యాత్మిక ప్రసంగాలలో పాల్గొంటారు. మొదటివారంలో శ్రమ, అతి వేడిమి, బడలిక కలుగును. కావలసినవారు కబుర్లు మంచిగా చెప్పి అవసర సమయాల్లో తప్పుకొందురు. కోర్టు, ఉద్యోగ వ్యవహారాలు కొంచెము తికమక పెడతాయి. మనస్సునకు స్థిమితం తక్కువగా ఉండును.

పుబ్బ వారికి 10 తేదీనుండి శుభయోగం కలసివచ్చును. కుటుంబంలో సుఖ సంతోషాలు, కార్యసిద్ధి, ధనాదాయం, స్థిరాస్తి సంపాదనము మొదలగునవి కలుగును. ముఖ్యంగా రాజకీయవాదులకు సర్వత్రా విజయం కలుగును. సువర్ణాభరణ సంపాదనము కలుగును. సంఘంలో మంచి గౌరవ మర్యాదలు లభించును. కాని మొదటి వారమంతా అధిక శ్రమ, నలత కలుగును.

ఉత్తర 1పా. వారికి 10 తేదీనుండి చిక్కులు, మనఃఖేదము, శరీరశ్రమ, కుటుంబములో చిన్న చిన్న కలతలు మొదలగునవి కలుగును. ఉద్యోగ - వ్యాపార - రాజకీయ వ్యవహారాలలో ఉన్నవారికి కొన్నింటిలో అనుకూలత ఉన్నా, మరికొన్నింటిలో అనుకోని విధంగా చిక్కులు, వృథాగా ఖర్చులు, స్వల్పంగా అనుమానము, మొదలగు వానివలన మనఃఖేదము, వ్యథ కలుగుచుండును. కుజునకు జపం చేయుట మంచిది. శరీరంలో అధిక వేడిమి కలుగుచుండును.

కన్య (ఉత్తర 2, 3. 4 పా. హస్త, చిత్త 1, 2 పా.)

ఉత్తర 2, 3, 4పా. 10 తేదీనుండి శరీరంలో నలత, అధిక వేడిమి, మనఃఖేదము కలుగును. అచ్చటచ్చట కొన్ని చిక్కులు కలిగినను, మొదటి పాదం వారికన్న అధిక యోగము కలుగును. వ్యవహారములలో విజయం కలుగును. బంధు విరోధము కలుగును. శుభకార్య ప్రయత్నములకై ధనవ్యయము చేయుట జరుగును. జ్ఞాతి దాయాదుల మూలకంగా కొన్ని చిక్కుల నెదుర్కోవలసి వచ్చును. నెల చివరివారంలో భార్యకు నలతచేసి నిమ్మళించును.

హస్త వారికి 15-27 తేదీలమధ్య కుటుంబంలో కలత నలతలు, శ్రమ, త్రిప్పట, మనఃఖేదం కలుగును. మాతృవర్గంవారితోను, భార్యా బంధువర్గం వారితోను, మాటపట్టింపులు వచ్చును. ధనవ్యయం అత్యధికంగా జరుగును. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడును. వ్యవసాయరంగంలో పెట్టుబడికి తగినదే తప్ప, అధికంగా ఫలితం రాదు. వ్యాపారులకు స్వల్ప లాభం, ఉద్యోగులకు-అధికార్లతో ఘర్షణలు, స్వల్పంగా చిక్కులు కలుగును. శుభాశుభ మిశ్రఫలం కలుగును.

చిత్త 1, 2పా వారికి శుభయోగముగా నుండును. సంతానమునకు వివాహాది శుభకార్య ప్రయత్నములు ఫలించును. సువర్ణ వస్త్రాభరణ ప్రాప్తి కల్గును. సాంకేతిక వైద్య విద్యార్థులకు, ఉన్నత విద్యావకాశం, పరీక్షలలో విజయం కలుగును. ఉద్యోగులకు, వర్తకులకు, వ్యవసాయదారులకు ధనలాభం కలుగును. ఈ నక్షత్రము 1, 2పా. వారందరికి. ఉత్సాహం, ఉల్లాసం, సుఖభోగాలు మొదలగునవి కలుగును. కాని 18-25 తేదీలమధ్య శ్రమ, మానసికంగా అసంతృప్తి హెచ్చుగా నుండును.

తుల (చిత్త 3, 4 పా. స్వాతి, విశాఖ 1, 2, 3 పా.)

చిత్త 3, 4పా. వారికి అన్ని రంగాలవారికి బాగుగానే ఉండును. ధనాదాయం బాగుగానే ఉండును. బంధుమిత్రుల సహాయ

సహకారములు కలుగును. నూతన వ్యాపారము విస్తరించుట జరుగును. అనేక రంగాలలో పేరు ప్రఖ్యాతులు కలుగును. సంఘంలో మంచి పేరు ప్రతిష్ఠలు, మాట పలుకుబడి, గౌరవము కలుగును. సద్గోష్ఠి, సజ్జన సాంగత్యము, శుభకార్యములలో పాల్గొనుట మొదలగునవి కలుగును. 18-25 తేదీలమధ్య శ్రమ, ధనవ్యయం జరుగును.

స్వాతి వారికి ఆర్థికంగా తొట్రుపాటు కలుగును. శ్రమ హెచ్చుగా నుండును. సోదరవర్గం వారితో మాటపట్టింపులు వచ్చును. వ్యవసాయ, వ్యాపార, ఉద్యోగ రంగాలలో ఉన్నవారికి మంచి అభివృద్ధి కలుగును. వివాహ, నూతన గృహారంభాది ప్రయత్నాలు బాగుగా కలసివచ్చును. అనుకోకుండా పెద్దలతోను, అధికారులతోను మైత్రి ఏర్పడి, పనులు సునాయాసంగా నెరవేరడమే కాకుండ ఆర్థికంగా కూడ బాగుగా లభించును.

విశాఖ 1, 2, 3పా. వారికి సర్వకార్య జయం, అన్ని రంగాలలోను ఎదురులేని అనగా మాటకు మంచి విలువైన ఆదరం, పలుకుబడి కలుగును. కోర్టు ఉద్యోగ వ్యవహారాదులలో విజయం కలుగును. ధనం కూడ అన్నివిధాల కలసివచ్చును. రాజకీయవాదులకు మంచి మేలుకు మున్ముందు లభించే పదవీ గౌరవానికి తగిన పునాది ఏర్పడును. విద్యార్థులకు ఉన్నత విద్యలో తమ ప్రతిభకు తగిన అవకాశాలు ఏర్పడును.

వృశ్చికం (విశాఖ 4 పా. అనూరాధ, జ్యేష్ఠ)

విశాఖ 4పా. వారికి నెలంతా సుఖభోగ కాలము. పుష్కలంగా ధనాదాయం ఉండును. ఇంతవరకు నెరవేరని శుభకార్యాలన్నీ అప్రయత్నంగా నెరవేరును. అన్ని వ్యవహారాలలో విజయం, కార్యసిద్ధి, ఉత్సాహం కల్గును. పెద్దల సాంగత్యం, అన్నింటిలోను విజయం కలిగించును. సంతానమునకు వివాహాది శుభకార్యములు నెరవేరును. ఈ నాల్గవ పాదం వారందరికి ఉత్సాహం, ఉల్లాసం, సుఖభోగాలు మొదలగునవి కలుగును. మొత్తంమీద అన్నివిధాల అభివృద్ధిని కలిగించును.

అనూరాధ వారికి గ్రహబలం బాగా ఉన్నది. నూతన ఉద్యోగం, క్రొత్త వ్యాపారం, అనుకూల గృహం మార్పిడి, కుటుంబంలో సుఖసంతోషాలు అన్నీ అనుకూలంగా ఉండును. విద్యా విజ్ఞానరంగాలలో వ్యాసంగము బాగుండును. అన్ని రంగాలవారికి ప్రజా సహకారం బాగుండి, నూతన ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, శక్తిని కలిగించుచుండును. అయితే 9తేదీవరకు శ్రమ, ఆందోళనము కలిగించును. మిగిలిన కాలమంతా శుభప్రదంగా ఉండును.

జ్యేష్ఠ వారికి ఇతర విషయాలు అన్నీ బాగుగానే ఉన్నా, శరీరంలో నలత, శ్రమ, కుటుంబంలో స్వల్పంగా నలతలు, కలతలు మనస్సునకు ఒకవిధంగా విశ్రాంతి లేకుండా చేస్తాయి. ఆర్థిక వ్యవహారాలు మాత్రం సంతృప్తికరముగానే ఉండును. ఉద్యోగులకు, విద్యార్థులకు, వృత్తిపనులవారికి, రాజకీయవాదులకు అన్నివిధాల ప్రోత్సాహం లభించును. 1989 జనవరినుండి అన్నివిధాల అభివృద్ధి, బహుముఖముగా చేకూరుతుంది.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పా.)

మూలవారికి అధికశ్రమ, స్వల్ప ఫలితంతోనే గడుస్తుంది. ఎప్పటికప్పుడు ప్రతి విషయంలోను ఊహించనివిధంగా చిన్న చిన్న చిక్కులు, ఆటంకాలు ఏర్పడును. శుభకార్య ప్రయత్నాలలో త్రిప్పట, ధనవ్యయము, శ్రమ అధికంగానే ఉండును. ఫలితం అనిశ్చితంగా ప్రశ్నార్థకంగాను ఉండును. అయితే బంధుమిత్రుల అధికారుల చేయూత, సహాయ, సహకారాలు, సానుభూతి కొంత తృప్తిని కలిగించును. భార్యావర్గంవారితో విరోధము కలుగును.

పూర్వాషాఢ వారికి 15-25 తేదీలమధ్య భార్యకు నలత, శ్రమ, ధనవ్యయం మొదలగునవి కలుగును. అనుకొన్న వ్యవహారాలు ఇకపైనుండి క్రమంగా విజయమును కలిగించును. ప్రయాణాల మూలకంగా ధనవ్యయం జరిగినా, తగినంత ఫలితం కూడ ఉండును. 10 తేదీనుండి శరీరంలో వేడిమి తగ్గును. ఉద్యోగులకు, విద్యార్థులకు, వ్యాపారులకు, వ్యవసాయదారులకు మంచి మేలు, అభివృద్ధి కలుగును.

ఉత్తరాషాఢ 1పా. వారికి 10తేదీనుండి శరీరంలో అతివేడిమి, నలత, శ్రమ కలుగుచుండును. ధనము పనికిమాలినవాటికి ఖర్చగును. సంతాన మూలకంగా ధనవ్యయం జరుగును. భూ గృహ వ్యవహారాదులలో చిక్కులు ఏర్పడును. బంధువిరోధము కలుగును. ఆరోగ్యం కూడ అంతంతమాత్రంగానే ఉండును. ఏ వ్యవహారం పరిష్కారం కాకపోయినా ఎప్పటికప్పుడు విజయం అరచేతిలో ఉన్నట్లు ఆశమాత్రం బాధించుచుండును.

మకరం (ఉత్తరాషాఢ 2, 3, 4పా. శ్రవణం, ధనిష్ఠ 1. 2 పా)

ఉత్తరాషాఢ 2, 3, 4పా. వారికి మొదటి పాదంవారికన్న కొంత మేలుగా నుండును 10 తేదీనుండి శ్రమ, అధిక వేడిమి కలుగును. అయితే పెద్దవారితో, స్నేహ సంబంధాలు ఏర్పడి పనులు సాధించుకోడం జరుగుచుండును. సోదరవర్గంవారితో విరోధమేర్పడును. వస్తు, వాహనాలు, స్థిరాస్తి సంపాదనము జరుగును. ఉద్యోగులకు, వర్తకులకు, వ్యవసాయదారులకు, వైద్యులకు మొదలగువారందరికి అన్నివిధాల లాభము కలసివచ్చును.

శ్రవణము వారికి 15-26 తేదీలమధ్య శారీరక మానసిక శ్రమ, ఖర్చు, వెచ్చాలకి కొంచెము కటకట, శుభకార్య ప్రయత్న

ములు వాయిదా పడుట జరుగును. స్థిరవస్తు సంపాదనకై ప్రాకు లాడుట జరుగును. మనస్సులో పనికిమాలిన పరిపరివిధాల ఆలోచనలు హెచ్చుగా నుండును. మాతృవర్గంవారితో విరోధము, మాటపట్టింపులు వచ్చును. శుభాశుభ మిశ్రఫలము కలుగును.

ధనిష్ట 1, 2పా. వారికి 18-25 తేదీలమధ్య శ్రమ, నలత కలుగును. ఉద్యోగులకు, వర్తకులకు, ముఖ్యంగా రాజకీయవాదులకు, అన్నివిధాల లాభము కలుగును. అన్నింటిలోను విజయం, అభివృద్ధి, ప్రజాగౌరవం బాగుగా నుండును. పెద్దలతో, అధికారులతో పరిచయ మేర్పడును. సంసార సౌఖ్యం, కుటుంబంలో సుఖసంతోషాలు, సంతానమునకు అన్నివిధాల అభివృద్ధి కలుగును. ధనవ్యయం అత్యధికంగా జరుగును.

కుంభం (ధనిష్ట 3, 4 పా. శతతార, పూర్వాభాద్ర 1, 2, 3 పా)

ధనిష్ట 3, 4పా. వారికి 18-25 తేదీలమధ్య శరీరశ్రమ, అధికతాపం, కుటుంబంలో కలతలు, మొదలగునవి కలుగును. ధనాదాయం బాగుండును. బంధుమిత్రులతో మంచి అనుకూలత, స్నేహ సంబంధములు ఏర్పడును. పనులన్నీ సకాలంలో క్రమంగా నెరవేరు చుండును. మాటవిలువ పెరుగును. రాజకీయవాదులకు పలుకుబడి, మాట గౌరవము హెచ్చి అన్ని విషయాలలోను విజయం కలుగును. ధనము కూడ బాగుగా కలసివచ్చును.

శతభిషం వారికి వ్యయము హెచ్చుగా ఉన్నను, అందుకు తగిన ఆదాయం కూడ ఉండును. దైవభక్తి, పరమార్థ చింతనము, పుణ్య ధర్మకార్యాలలో పాల్గొనుట, శుభకార్యాలు చేయుట మొదలగునవి జరుగును. 26 తేదీనుండి శరీరశ్రమ, మనస్సులో ఆలోచనలు హెచ్చుగా నుండును. ఉద్యోగులకు, విద్యార్థులకు, వర్తకులకు, వ్యవసాయదారులకు, అతి శ్రమమీద ఫలితం కొనసాగును.

పూర్వాభాద్ర 1, 2, 3పా. వారికి ధనాదాయం బాగుండును. ఉద్యోగులకు ప్రమోషను కలుగును. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశం కలుగును. ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలను పొందుట జరుగును. వ్యవసాయదారులకు బాగుగా లాభించును. కుటుంబ సంతాన సౌఖ్యం బాగుగా నుండును. సంఘంలో మంచి కీర్తి ప్రతిష్ఠలు, గౌరవము కలుగును. శుభయోగము బాగుగా నుండును. అయితే 11 తేదీవరకు శ్రమ హెచ్చుగా నుండును.

మీనం (పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి)

పూర్వాభాద్ర 4పా. వారికి కుటుంబంలో అన్నివిధాల సుఖసంతోషాలు కలుగును. ధనాదాయం బాగుండును. అందుకు తగిన ఖర్చు వెచ్చాలు కూడ పెరుగును. కళలు-సాహిత్యము, సంగీతము మొదలగువానిలో పాల్గొనుట జరుగును. వ్యవహారాలలో కొంత మాంద్యం జరిగినా, నెల చివరి వారంలో అవన్నియు జయప్రదం కాగలవు. కుటుంబ సౌఖ్యం, సంతానమునకు అన్నివిధాల అభివృద్ధి కలుగును.

ఉత్తరాభాద్రవారికి 9తేదీవరకు శరీరశ్రమ, వేడిమి కలుగును. సంసారంలో ఈతిబాధలు ఎక్కువ. ఎన్నోవిధాల ధనం ప్రవాహరూపంలో వచ్చినా, రాబడికి మించిన ఖర్చులు పెరిగి తొట్రుపాటు కూడ పడవలసి వచ్చును. అనవసరవ్యయం పెరుగును. కుటుంబంలో నలతలు కలిగి తొలగిపోవును. పెద్దవారితో, అధికారులతో పరిచయం కలుగును. శ్రమ హెచ్చుగా నుండును.

రేవతి వారికి 10 తేదీనుండి శరీరశ్రమ, అధికవేడిమి హెచ్చుగా నుండును. మొదటివారంలో భార్యకు నలత చేయును. బయట పదుగురిలో గౌరవాదరాలున్నా, ఇంట్లో సుఖము తక్కువగానే ఉండును. తలకు మించిన ఖర్చులు, మర్యాద కోసం, గౌరవం కోసం, డాబు దర్పాల కోసం, తలకు మించిన వాగ్దానాలు ప్రదర్శించుట జరుగును. ఎంత రాబడి వచ్చినా, మితిమీరిన ఖర్చులు పెరిగిపోవుట వల్లను, ఏమియు మిగలదు. శుభాశుభ మిశ్రమ యోగంగా నుండును.

సిద్ధాంతి: **నిష్ఠల వేంకట సత్యసుబ్రహ్మణ్యం**

ఈ సుషుప్తిలోనే....

ఓహ్! ఏమని చెప్పను!
ఇది మానవాతీతమైన మరో సృష్టి దర్పణం!
ఏ ఖేదజ్యోతి కనబడని అద్భుత దర్శనం!!
ఎండి బండబారిన నా గుండెలో
తుషార ధారలు ఝరిస్తున్నాయి ఇక్కడ
కన్నీటి కవితలు, నెత్తుటి బొమ్మలతో
అలిసిపోయిన నా చైతన్యం
పరవళ్లు త్రొక్కుతూ ప్రవహిస్తున్నది.
మొద్దుబారిన నా తనువు
ఈ మలయానిలాలకు పులకరిస్తున్నది.
ఛిద్రమైన నా మనస్సుకు బాధ తెలియడంలేదు.
పంచేంద్రియాలతో పనిలేదు ఈ సుందరలోకంలో!
అస్పృశ్యమైన ఫేణకణ తల్పంలో
ఎటో అంతరిక్షంలోకి తేలిపోతున్నాను.
విషాద క్షితిజ రేఖలను దాటిపోతున్నాను;
ప్రమోదాలను కేంద్రీకరించుకుంటున్నాను
ఓహో! ఘనీభవించిన ఈ గాఢాంధకార ప్రకృతిలో
ఎంతటి అపూర్వ నిర్వృతి!
ఈ కుందనానుభూతులకు ఉదాహృతాలు లేవు!
వద్దు, మిత్రమా వద్దు,
ఎంతటి ప్రళయమైనా సంభవించనీ కానీ
నన్ను మాత్రం భంగపరచకు–
బాహ్య ప్రపంచంతో నాకు పని లేదు,
నన్ను ఇలాగే ఈ సుందర స్వప్న జగత్తుకు
కేంద్రకంగా ఉండనీ!
ఈ సుషుప్తిలోనే; ఇలా నిమీలిత నేత్రాలతోనే
నా నుదుటివ్రాతను దర్శించుకోనియ్యి!

—ఆదిత్య

వర్షం

ఎక్కడో మొదలయింది వర్షం
దూతగా వొచ్చిన గాలి దూసుకు వచ్చింది.
దుమ్మూ ధూళీ వెల్లువలా కమ్ముకున్నాయి.
పక్షులన్నీ పరవశంగా
కోలాహలం చేస్తూ గుంపులుగా తిరిగాయి
ఆకాశానికి ఎదిగిన చెట్లన్నీ
అభివాదం చేస్తూ అవనతమయ్యాయి
పూలన్నీ వలపుతో వణికాయి.
తీగలన్నీ తిమ్మిరెక్కినట్లు
ఆకుపచ్చని రాగాల్లా ఆశ్చర్యపడ్డాయి.
మొదలైన మొదటి చినుకులు
ఆకుల అంచుల్లో వైతాళిక వజ్రాల్లా మెరిశాయి.
ఆకాశం పిలుపు విన్న ఆహ్లాదంతో
ఎగిసిపడే మనసుల్తో ఎవరి ముంగిళ్ళలో వాళ్ళు
నింగికేసి చూస్తూ
అజ్ఞాత గతమేదో ఆకాశం వెనకనించీ
చినుకు చేతుల్తో చేరబిలుస్తున్నట్లు
సృష్టిగీతం కోటిరాగాల్తో చుట్టుముడుతున్నట్లు
స్వర్గానికి వేసిన నిచ్చెనల్లా
జలధారలు పిలుస్తున్నట్లు
కన్నార్పని జనాలు మిన్నుకేసి
ఆర్ద్రమై, రసార్ద్రమై
కరిగి కరిగి వర్షంలో కలిసిపోతున్నట్లు.

—సౌభాగ్య

డా॥ మైనేని కృష్ణకుమారి

ఆంధ్రదేశములోని పంచారామ దేవాలయముల ఆవిర్భావము - ఒక పరిశీలన

ఆంధ్రదేశములో పంచారామములని ప్రసిద్ధి చెందిన శైవాలయముల యొక్క పుట్టు పూర్వోత్తరములను పరిశీలించుటయే ఈ వ్యాసములోని ముఖ్యోద్దేశము. ఈ ఐదు దేవాలయములు బౌద్ధమతము ప్రాతిపదికగా నెలకొల్పబడిన వనునది సాధారణముగా చరిత్రకారుల అభిప్రాయము. కాని దీనికి వ్యతిరిక్తముగా, ఈ వ్యాసములో చర్చింపబడనున్న పురావస్తు సంపదల ఆధారముగా నివియన్నియు శైవమతాధారములుగా నిర్మింపబడిన దేవాలయములేనని నిరూపించడమైనది. ఈ శివాలయము లన్నియు నదీతీర ప్రాంతములలోనే ప్రతిష్ఠింపబడుట గమనించదగ్గ విషయము. ద్రాక్షారామములోని భీమేశ్వరాలయము (తూర్పు గోదావరి జిల్లా), అమరావతిలోని అమరేశ్వరాలయము (గుంటూరు జిల్లా), పాలకొల్లులోని క్షీరారామేశ్వరాలయము (పశ్చిమ గోదావరి జిల్లా). గుణుపూడి భీమవరములోని సోమేశ్వరాలయము (పశ్చిమ గోదావరి జిల్లా), చాళుక్య భీమవరము (సామర్లకోట) లోని భీమేశ్వరాలయము అను ఈ ఐదు శివాలయములు కృష్ణా, గోదావరీ నదుల ఒడ్డున నెలకొల్పబడి పంచారామ క్షేత్రములుగా 12వ శతాబ్ది కాలమునుండి ప్రసిద్ధి కెక్కినట్లు శాసనాధారములు, మరియు ఆ కాలమునాటి వాఙ్మయముల వలన తెలియుచున్నది.[1] సాధారణముగా, 'ఆరామ' అను పదము బౌద్ధ నిర్మాణములకు సంబంధించి ఎక్కువగా వాడబడుటచే కొందరు పండితులు యివన్నియు తొలుత బౌద్ధారామములుగానుండి తదుపరి శైవక్షేత్రము లయ్యెనని ఊహాపోహ పడుటకు ఆస్కారము కలిగించుచున్నది. శాసనములలో పొందుపరచబడిన ఆధారములను పరిశీలించినచో శైవ దేవాలయములున్న ప్రదేశములకు 'ఆరామ' అను పదము ఆయా స్థలనామముల తరువాత ప్రయోగించబడినట్లుగా కన్పడుచున్నది. 'ఆరామ' అను పదము సంస్కృత పదము. ఆరామమనగా ఒక వనము, లేదా ఆశ్రయ మిచ్చెడిచోటు అని అర్థము.[2] దక్షప్రజాపతి యొక్క ఆరామ స్థలమే మార్పులు చెంది దక్ష + ఆరామ, తదుపరి ద్రాక్షారామముగా రూపొందినది. శాసనములలో ద్రాక్షారామముయొక్క స్థలనామము డాకరేమి, పెద డాకరేమి, ద్రాచ్యారామపురి, ద్రాక్షారామ, దాక్షారామ అని వేర్వేరు పేర్లతో ప్రస్తావించబడింది. అదేవిధముగా, తక్కిన శైవక్షేత్రములు, అమరారామ, కొమరారామ, భీమారామ, క్షీరారామములుగా శాసనములలోను, భీమేశ్వర పురాణము మున్నగు గ్రంథములలోను పేర్కొనబడినవి. దీనినిబట్టి చూచినచో 'ఆరామ' మనెడు పదప్రయోగము ఒక్క బౌద్ధమత నిర్మాణములకే పరిమితము కాకుండా, మధ్యాంధ్రయుగమున హిందూమతమునకు సంబంధించినటువంటి దేవాలయములకు, అనగా, ఆయా దేవుళ్ళయొక్క తోటలు అను అర్థము వచ్చునట్లుగా ఆయా ప్రదేశములకు అనువర్తించి వాడబడినట్లుగా మనకు తెలియుచున్నది.

పంచారామ క్షేత్రములయొక్క పుట్టు పూర్వోత్తరములకు సంబంధించి పౌరాణిక గ్రంథములందు, స్థల పురాణములందును ఇతర వాఙ్మయములందును కొంత సమాచార మీయబడినది. శివ పురాణములో చెప్పబడిన ఒక గాథ ననుసరించి దక్షప్రజాపతి తన కుమార్తెను శివునికిచ్చి వివాహము చేసెను. ఒక సందర్భమున దక్షుడు పెద్ద యాగశాలను గోదావరి నది సముద్రముతో కలియు పవిత్ర స్థలమునకు సమీపముగా ఒక గోదావరీ నదీపాయ ఒడ్డున నిర్మింపజేసెను. ఆ పవిత్ర యజ్ఞమును తిలకించుటకు దక్షుడు ఒక్క

దాక్షాయని, శివులను తప్ప తక్కిన కుమార్తెలను, అల్లుళ్ళను ఆహ్వానించెను. అంత, దాక్షాయణి తనను తండ్రి ఆహ్వానించనప్పటికి, తండ్రిపైనున్న మమకారముతో ఆ యాగమును తిలకించుటకు అచ్చటికి వెళ్ళగా, అక్కడివారెవ్వరును ఆమెను సరిగా గౌరవించి, ఆహ్వానించలేదట. దానితో దాక్షాయని ఈ సంఘటనను తీవ్రముగా స్పందించి అచ్చటనున్న అగ్నిలోకి దూకెనట. శివుడు ఈ విషయము వినినంతనే ఆగ్రహించగా, ఆ కోపములో వెలువడిన స్వేదమునుండి వీరభద్రుడు జన్మించెను. ఆ వీరభద్రుడే శివునికి కల్గిన ఈ అవమానమునకు ప్రతీకారముగా దక్షుని చంపివేసెను. అంత శివుడు హుటాహుటిన బయలుదేరి అగ్నిలో పడిన దాక్షాయణిని రక్షించి, తిరిగి తన అర్ధశరీర భాగముగా స్వీకరించెను. తర్వాత ఆ దాక్షాయణే హిమవంతుడి పుత్రిక ఉమ అను నామముతో జన్మించి శివుని వివాహమాడి, ఆటుపిమ్మట వారిరువును ద్రాక్షారామమందు నివసించెనట.[3] బహుశ, ఈ పురాణగాథను సంస్మరించియే కాబోలు, నేటికిని ద్రాక్షారామములో బ్రాహ్మణులు ఎటువంటి యజ్ఞములుగాని, క్రతువులుగాని చేయరు.

రెడ్డి రాజుల కాలములో శ్రీనాథుడను కవిపండితుడు వ్రాసిన భీమేశ్వర పురాణమను ప్రబంధ కావ్యములో పంచారామ క్షేత్రముల యొక్క ఆవిర్భావము గూర్చి ఆసక్తి కలిగించు మరియొక గాథ పొందుపరచబడినది. ఈ భీమేశ్వర పురాణమనునది ద్రాక్షారామములోని భీమేశ్వరాలయము యొక్క స్థల పురాణము. ఇది తెలుగులో వ్రాయబడినది. ఇదిగాక సంస్కృతములో భీమ ఖండమనునది కూడ కలదు. ఇదియు, శ్రీనాథుని రచనయే. దీనిని మాతృకగా తీసికొని తెలుగులో భీమేశ్వర పురాణమును శ్రీనాథుడు వ్రాసెనని కొందరు పండితుల అభిప్రాయము. పంచారామముల ఆవిర్భావము, ముఖ్యముగా, ద్రాక్షారామము గురించి నాలుగో ఆశ్వాసములో ప్రస్తావించబడినది. దీని ప్రకారము, అమృతమును సాధించుటకొరకై దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథనము గావించగా సాగరమందుండి అనేక విధములైన వస్తువులు ఉద్భవించెనట. చివరకు అమృతకలశముతో ధన్వంతరి రాగా, ఆ అమృతమును పంచుకొనుటకు దేవతలు, రాక్షసులు కలహించిరట. అంతట, విష్ణువు మోహినీ రూపమున వచ్చి రాక్షసులను సమ్మోహనపరచి అమృతమంతయు దేవతలకే చెందునట్లుగా పంచెను. జరిగిన మోసమును తెలిసికొని రాక్షసులు, దేవతలపై ప్రతీకారము చేయ నిశ్చయించుకొనిరి. నారదుని సలహాపై రాక్షసులు తీవ్ర తపస్సులు చేసి శివుని మెప్పించిరి. వారి ప్రార్థనలను మన్నించి శివుడు రాక్షసులకు అనేక వరములిచ్చెను. అప్పటినుండి రాక్షసులు దేవతలను బాధింప మొదలుపెట్టిరి. ఈ అకృత్యములన్నియు భరింపజాలక దేవతలందరు శివుని శరణు కోరగా శివుడు రాక్షసులను శిక్షించుటకు నిశ్చయించుకొనెను. పాశుపతాస్త్రమును శివుడు సంధింపగా రాక్షసులందరు, వారి పట్టణములన్నియు కాలి బూడిద యయ్యెను. కాని వారు ఆరాధించెడు శివలింగ మొక్కటియే చెక్కుచెదరక నిలిచియుండెను. త్రిపురాసురులకు మూలద్రవ్యమైన ఆ లింగమును శివుడు ఖండింపగా నది ఐదు ముక్కలయ్యెను. దానిలో నొకదానిని ఇంద్రుడు కృష్ణానదీ తీరమున నున్న ధరణికోటలో ప్రతిష్ఠింపగా నది తదుపరి అమరావతిలోని అమరేశ్వరాలయముగా ప్రసిద్ధి నొందెను. మరియొక భాగము సోమునిచే గుణుపూడినందు ప్రతిష్ఠించబడగా ఆ ప్రదేశము సోమారామముగాను, ఆలయము సోమేశ్వరాలయముగాను ప్రాచుర్యము నొందినది. మూడవభాగము రామునిచే ప్రతిష్ఠింపబడి క్షీరారామములోని రామలింగేశ్వర క్షేత్రమయినది. నాల్గవ భాగము చాళుక్య భీమవరములోను, ఐదవ భాగము ద్రాక్షారామములోను నెలకొల్పబడి భీమేశ్వరాలయములుగా నేర్పడినవి. ఈ విధముగా పంచారామ క్షేత్రముల ఆవిర్భావము గురించి, శివలింగము యొక్క ఐదు భాగములు వేర్వేరు ప్రదేశములలో ప్రతిష్ఠించబడినట్లు భీమేశ్వర పురాణములో చెప్పబడినది.

ద్రాక్షారామమునందు, ఆయా పరిసర ప్రాంతములలోను శ్రీనాథుడు నివసించుటచేతను, రెడ్డిరాజుల ఆస్థాన కవి పండితుడుగా నుండుట చేతను, ద్రాక్షారామము మున్నగు ప్రదేశములు శ్రీనాథునికి అత్యంత పరిచయ స్థలములు. కావున, భీమేశ్వర పురాణములో పొందుపరచబడిన విషయములు నాటి కాలమున ప్రజలలో బహుళ ప్రాచుర్యము పొందిన గాథలు కావచ్చును. ఈ పురాణ గాథలనే ప్రామాణికముగా తీసికొని కొందరు వైదిక, అవైదిక మతముల మధ్య జరిగిన వివాదములుగా సిద్ధాంతీకరించిరి.[5] అనగా, పంచారామములు ప్రాయికముగా బౌద్ధక్షేత్రములుగాను, తదుపరి శైవులతో జరిగిన మత వివాదముల కారణముగా నివి శైవులచే నాక్రమింపబడిన స్థలములుగాను వారు భావించిరి. ఇంకను, ఈ పురాణగాథను అనుసరించియే బౌద్ధులయొక్క మహాస్తూపమును నాశన మొనరించి, శైవులచే శివలింగ ప్రతిష్ఠ చేయబడినట్లు, బౌద్ధులకు, శైవులకు మధ్య మతబంధముగా వైరములు సంభవించినట్లు భావించబడింది. అదేవిధముగా, ద్రాక్షారామమువద్ద సప్త గోదావరీ నదిని సృష్టించుటకు సంబంధించిన విషయ సంవాదములు కూడ నీ విధముగానే విపులీకరించుట జరిగినది.

భీమేశ్వర పురాణములోని పంచారామముల ఆవిర్భావమునకు సంబంధించిన విషయములను తులనాత్మకముగా పరిశీలించినచో నిట్టి ఊహాపోహలకు తావుండదు. ముఖ్యముగా, నీ విషయము పౌరాణిక గాథలతో ముడిపడి వున్నది. దేవాసురులకు మధ్య జరిగిన ఘర్షణ

స్మృత విషయమై వచ్చినదియేగాని మరి వేరుగాదు. యిట్టి గాథలలోని విషయములను సేకరించునపుడు, వాటిని అధ్యయనము చేయునపుడు అవి ఏ సందర్భములో ప్రస్తావించబడినవి అను విషయము దృష్టిలో నుంచుకొనుట ఎంతైనా అవసరము. రాక్షసుడైనప్పటికి తారకాసురుడు శివానుగ్రహము పొందినాడని చెప్పుట అతని భక్తి తత్పరత, శివభక్తి యొక్క గొప్పదనమును తెలియజేయుచున్నది. ఆతడు శివభక్తి పరుడైనందు వలననే శివుడుగాని, విష్ణుమూర్తిగాని, తారకాసురుడు దేవతలను హింసించుచున్నప్పటికిని ఏమియు చేయజాలకపోయిరి. ఈ విధముగా నీ గాథయంతయు శివభక్తి పరుని ముందు ఎంతటి దేవుళ్ళైనను చివరకు ఆ పరమ శివుడైనను, శక్తి లేనివారన్న విషయము స్పష్టపరుచబడినది. అంతేగాక శివలింగము యొక్క గొప్పతనము, దాని ఆరాధన, ఆ భక్తులయొక్క గొప్పతనము మున్నగునవి ప్రస్తుతించబడినవేగాని, దీనిని ఏ విధముగాను శైవ బౌద్ధమతానుయాయుల మధ్య ఘర్షణలుగా చిత్రీకరించుటకు ఎట్టి ఆస్కారము లేదు.

క్రీస్తుశకము 9, 10వ శతాబ్దులలో నిర్మితములైన ఈ పంచారామ దేవాలయముల కాలమునాటికి ఒకవేళ అట్టి శైవ బౌద్ధ మతముల మధ్య ఘర్షణలు జరిగినప్పటికిని, లేదా ఈ దేవాలయములు బౌద్ధ నిర్మాణములపై జరిగినవో, ఆ విషయములు మధ్యాంధ్ర యుగమునాటి వీరశైవ మతవాఙ్మయములో కొంతవరకైనను ప్రస్తావించబడియుండవలెను. కాని అట్లు జరుగలేదు. పైగా, పంచారామముల ఆవిర్భావము గురించి ఏ విధమైన ప్రమాణము వానిలో నీయబడలేదు. ఒకవేళ బౌద్ధ నిర్మాణముల పైననే శివాలయములు నిర్మించినప్పటికిని, వారిమధ్య వున్న వివాదముల కారణములుగా ఏ విధముగా శైవులు బౌద్ధులకు పవిత్రమైన ఆయక స్తంభములను శివలింగముగా కొల్చెదరు? అందువలన బౌద్ధ నిర్మాణములలో నుపయోగింపబడిన ఆయక స్తంభములే శివలింగములని, బౌద్ధ నిర్మాణములపైననే శివాలయములు స్థాపించిరను వాదము సమంజసము కాదు. బౌద్ధ స్తూప నిర్మాణములకును, శివాలయములకును వాస్తురీతిలో ఎట్టి సరిపోలికలు లేవు. అవి రెండును భిన్నరీతిలో నిర్మింపబడిన నిర్మాణములే. ఈ సందర్భమున 12వ శతాబ్ది కాలమునాటికి సంబంధించిన శాసనములను పరిగణించుట ఎంతైనా అవసరము. ఈ కాలమున అమరావతిలో శైవము, బౌద్ధము అను రెండు మతములు విలసిల్లినవనుటకు ఆధారముగా కోటరాజైన రెండవ కేతరాజు శిలాశాసనములను ప్రస్తావించవచ్చును. క్రీ॥శ॥ 1184వ సంవత్సరమున ఈయబడిన ఈ శాసనంలో అమరావతిలోని బౌద్ధ స్తూపమును గూర్చి "చైత్య మత్యున్నతం యత్ర నానాచిత్ర సుచిత్రితమ్" అనియును, శివుడు అమరేశ్వరుడుగా ప్రసిద్ధి నొందిన శైవక్షేత్రముగాను అమరావతిగూర్చి చెప్పబడినది.[6] అంతేగాక, క్రీస్తుశకము 1844లో శ్రీలంకలోని ధర్మకీర్తి అను బౌద్ధ సన్యాసి ధాన్యకటకములోని బౌద్ధాలయమును బాగుపరుచుటకుగాను నీయబడిన ఒక దానశాసనము వలన[7] అమరావతిలో బౌద్ధాలయము ఆ కాలమునాటివరకు, అనగా క్రీస్తుశకము 1844 వరకు ఉచ్ఛస్థితిలో నున్నట్లును, ఆ కాలమువరకు సుదూర ప్రాంతములైన శ్రీలంక దేశములనుండి కూడా బౌద్ధమతానుయాయులు వచ్చుచుండినట్లు తెలియుచున్నది.

పంచారామ శైవక్షేత్రముల ఆవిర్భావము గూర్చి ఎన్. రమేశన్, టి. ఎన్. సుబ్రమణ్యం మరియు ఐ. కె. శర్మ మున్నగు పండితులు ఆ దేవాలయముల గర్భగృహములలోని లింగాకృతులను ఆధారముగా చేసికొని యివియన్నియు ప్రాయికముగా బౌద్ధచైత్యములైనట్లును, తదుపరి హిందూ దేవాలయములుగా రూపొందినట్లును, బౌద్ధచైత్యములలో నుపయోగింపబడిన ఆయక స్తంభములే శివలింగములుగా ఆరాధింపబడుతున్నట్లును సిద్ధాంతీకరించిరి.[8] అదే విధమైన అభిప్రాయమును బి. ఎస్. ఎల్. హనుమంతరావుగారును వ్యక్తీకరించిరి.[9] వారి వాదమును బలపర్చుకొనుటకు శివలింగముల పై భాగముననున్న గుంటలను, స్తూపముల నలుదిశల నెలకొల్పబడు బౌద్ధ చిహ్నములతోనుండు సున్నపురాయి బౌద్ధ స్తంభములుగా, లేదా ఛత్రయష్టిగా వారు వాదించిరి. అంతేగాక, ఈ ఐదు దేవాలయములు నిర్మించబడిన ప్రదేశములు బౌద్ధ అవశేషములతో నుండిన చారిత్రక ప్రదేశములుగా వారు గుర్తించిరి. ముఖ్యముగా, అమరావతిలోనున్న లింగము పైభాగమునుండి పీఠాంతర్భాగము వరకు పూర్తిగా వర్తులాకార స్తంభాకృతిలో నున్నవి. ఇది బౌద్ధ స్తంభముల ఆకృతికి పూర్తిగా భిన్న స్వరూపము. బౌద్ధ ఆయక స్తంభములు సాధారణముగా అష్టకోణాకృతిలో చెక్కబడి వుంటాయి. లింగము పైభాగముననున్న గుంటల ఆధారముగా నివి బౌద్ధస్తూపములని వాదించుట అంత సరికాదు. బౌద్ధ వాస్తుశిల్పమును నిశితముగా పరికించినచో స్తంభములకు ఛత్రములు అనుసంధించునపుడు తొలుచు గుంటలు ఛత్రము క్రిందిభాగమున నుండవలెను గాని, స్తంభము పైభాగమున కాదు. ఈ విషయము బౌద్ధ స్తూపములవద్ద లభించిన ఆధారముతో ఖచ్చితముగా చెప్పుటకు వీలగుచున్నది.[10] కావున లింగాకృతిగాని, లింగము పైభాగమున వున్న గుంటలవలనగాని నివి బౌద్ధ స్తూపములకు చెందినవే ననుటకు వీలులేదు. మరియును లింగ పైభాగమున వున్న గుంటలు ఒక నిర్దిష్టమైన పద్ధతిలో చెక్కినవిగా కాక వేరుగా నున్నవి. బహుశ, నివి నిరంతరము ఆలయములలో చేయు అభిషేకముల కారణముగా లింగము ముందుభాగముపై పడు జలధారలను నిరోధించుటకును, నీరు ప్రక్కలకు పడునట్లుగా దారులు చేయుటకు లింగము కిరుప్రక్కల చెక్కబడినవేగాని మరి, వేరుకాదు.

ఆంధ్రదేశములో శైవమతము యొక్క ప్రాచీనతను, తొలి హిందూ దేవాలయములయొక్క వాస్తు శిల్పమును, ఈ సందర్భమున పరిశీలించుట ఎంతైనా అవసరము. బౌద్ధమతము ఎక్కువగా నాదరించబడు ప్రదేశములలో నిర్మించబడిన కొన్ని హిందూ దేవాలయములు, ముఖ్యముగా బౌద్ధ చైత్య గృహముల మాదిరిగానుండి వాని ననుకరించి నిర్మించబడినట్లుగా నున్నవని కె వి. సౌందర రాజన్‌గారు అభిప్రాయపడినారు.[11] ఆ విధముగా, గజ పృష్టాకృతిలో నిర్మింపబడిన చేజెర్ల లోని కపోతేశ్వరాలయము, నాగార్జునకొండలోని పుష్పభద్రస్వామి దేవాలయము (నాల్గవ శతాబ్ది మొదటిభాగమునకు చెందినవి) బౌద్ధ నిర్మాణముల నమూనా ననుసరించి కట్టబడినవిగా వారు భావించిరి. వారి వాదమును సమర్థించుకొనుటకు చేజెర్ల దేవాలయములోని చిన్నదైన సున్నపురాయి శివలింగమును వారు పంచారామ క్షేత్రములలోని లింగములతోను, లింగము పైభాగమున వున్న గుంటలను వారు సరిపోల్చిరి. ఈ దేవాలయ వాస్తు నిర్మాణములనే ఆధారముగా తీసికొని కె. వి. సౌందరరాజన్, కె. కృష్ణమూర్తి మున్నగువారు గజపృష్టాకృతిలో వున్న హిందూ దేవాలయములు, అదే ఆకారములో నిర్మితములైన బౌద్ధ చైత్య గృహములనుండి గ్రహించబడినదిగా సిద్ధాంతీకరించిరి.[12] కాని, గుంటూరుజిల్లా చేజెర్ల గ్రామమున వున్న ఇటుకలతో గజ పృష్టాకృతిని నిర్మితమయిన కపోతేశ్వరాలయము వద్ద పురాతత్వ శాస్త్రవేత్తలు నిర్వహించిన పురావస్తు ఖనన పరిశోధనల వలన ఆ దేవాలయ పునాదులకు సంబంధించిన కొన్ని నూతనాంశములు వెలుగులోనికి వచ్చినవి.[13] దీని ప్రకారము, నీ దేవాలయము హిందూ దేవాలయ వాస్తు నిర్మాణములకు సంబంధించినదిగా 'మంచక' పద్ధతిన నిర్మింపబడిన దేవాలయముగా తెలియుచున్నది. గజపృష్టాకృతిలో నిర్మింపబడిన హిందూ దేవాలయములు ప్రాయికముగా బౌద్ధచైత్యములేనని, అవి బౌద్ధ మతము క్షీణదశలోనున్న కాలమున, అనగా క్రీ.శ. 7వ లేదా 8వ శతాబ్దులలో శైవాలయములుగా మార్పు చెందినవని గతములో చేసిన వాదన ఈ పురావస్తు పరిశోధనలో వెలువడిన ఆధారముల వలన వీగిపోవుచున్నది. అదేవిధముగా, గజపృష్టాకృతిలో వున్న గుడిమల్లములోని పరశురామేశ్వర దేవాలయమువద్ద జరిపిన పురావస్తు ఖనన పరిశోధనలో ఆ లింగముయొక్క ఎత్తు, లింగము ముందుభాగమున చెక్కబడిన మానవాకృతిలోని శివుని రూపము, వృత్తాకారములోని అగ్రపీఠము, దానిచుట్టును నిర్మింపబడిన చతురస్రాకార వేదికవంటి చుట్టుభాగమును మున్నగు విషయములు తెలియవచ్చినవి[15] తొలుత, అనగా క్రీ.పూ. 2వ శతాబ్దిలో, ఈ లింగము ఎటువంటి ఆచ్ఛాదన లేక, ఆ విధముగనే పూజింపబడెడిది. తర్వాత, అనగా రెండవదశలో క్రీస్తుశకము 1-2వ శతాబ్దులలో ఇటుకలతో గజపృష్టాకారములో నిర్మించినట్లు తెలియుచున్నది. ఈ కాలముననే కొన్ని చిన్న, చిన్న దేవాలయములు చతురస్రాకారములలో, ఇటుకలతో నిర్మించబడి శివలింగము మూలదైవముగా నున్నట్లు కర్నూలు జిల్లాలోని వీరాపురంవద్ద పురావస్తు శాఖవారు జరిపిన ఖనన పరిశోధనల వలన తెలియుచున్నది.[16] కాని, గుడిమల్లంవద్ద లభించిన ఆధారములను కె. కృష్ణమూర్తిగారు వేరు విధముగా విశ్లేషించిరి. గర్భగృహము వద్ద లభించిన చుట్టు పలకల నిర్మాణము బౌద్ధ నిర్మాణములకు సంబంధించినదిగా నున్నదనియు, దీనివలన బౌద్ధనిర్మాణములనే ప్రాతిపదికగా తీసికొని గుడిమల్లము లోని గజపృష్టాకృతి గల దేవాలయమును నిర్మించిరనియు వారి వాదనలోని సారాంశము.[17]

పంచారామ శైవక్షేత్రముల ఆవిర్భావమును తెలిసికొనుటలో పైన చర్చించిన రెండు భిన్నాభిప్రాయములను అనగా, 1) బౌద్ధ చైత్య నిర్మాణములే తదుపరి ఆంధ్రదేశములో శివాలయములుగా రూపొందినవని, 2) బౌద్ధ నిర్మాణములతో నెట్టి సంబంధము లేని హిందూ దేవాలయములు, (ముఖ్యముగా శైవాలయములు) క్రీస్తు శకము తొలి శతాబ్దములనుండియు వున్నవని - పరిగణన లోనికి తీసికొనుట ముఖ్యము. గుడిమల్లములోని పరశురామేశ్వర దేవాలయములో జరిపినట్లు ఆలయము పునాదులవద్ద పురావస్తు త్రవ్వకములు జరిపినచో మనము ఖచ్చితముగా పంచారామ క్షేత్రముల అవిర్భావము శైవమా, లేక బౌద్ధమా అను విషయములు నిర్ధారించవచ్చును. కాని, గుడిమల్లములోని శివాలయమువలె కాక, పంచారామ క్షేత్రములలోని శివాలయము లన్నిటను ప్రస్తుతము నిత్యారాధనలు జరుగుచున్నవి. అందువలన వాటిని ఈ విధముగా పరిశోధించుట కష్టసాధ్యము. అట్లు కాకున్నను, ఆయా దేవాలయములవద్ద లభించు చారిత్రక, పురావస్తు ఆధారములతో కూడా నీ విషయముపై పరిశోధన జరుపవచ్చును.

పంచారామ క్షేత్రములలో ముఖ్యముగా వాడబడిన సున్నపురాయి లింగము నాధారముగా చేసికొని, ఈ లింగము బౌద్ధ నిర్మాణములకు సంబంధించినదిగా భావించిరి. కాని, దీనికి వ్యతిరిక్తముగా, నాగార్జునకొండలోని పుష్పభద్రస్వామి ఆలయము, చేజెర్ల లోని కపోతేశ్వరాలయము లందలి శివలింగములు సున్నపురాతితో చేయబడినవే. ఇవి, పంచారామములలోని శివలింగములంత ఎత్తు లేకున్నను, లింగములు ఆ విధముగానే యున్నవి. ఈ రెండు దేవాలయముల వద్ద జరిపిన త్రవ్వకముల వలన హిందూ మతమునకు సంబంధించిన నిర్మాణములు, ఇతర ఆధారములు లభించినవేగాని, బౌద్ధమతమునకు సంబంధించినవి గావు. అమరావతిలోని అమరేశ్వరాలయము కప్పు లోపలి భాగమున వాడబడిన సున్నపురాయి శిల్పములు హిందూ దేవాలయముల నిర్మాణములలో వాటి వాడుకా విధానమునే సూచించుచున్నది. సున్నపురాయితో శిల్పములు ముఖ్యముగా లతలు, పుష్పములు చెక్కుట అనునది తరువాతి సాతవాహనులు, ఇక్ష్వాకుల కాలమునుండి వాడుకలోనున్న విధానమే.[18] అమరేశ్వర దేవాలయము పునర్నిర్మాణము జరిపినపుడు, మరియు ఆ దేవాలయమువద్ద జరిపిన త్రవ్వకముల వలన లభించిన బౌద్ధ శిల్ప ప్రతిమల వలన ఆ పరిసర ప్రాంతములలో నొక పెద్ద బౌద్ధ స్తూప మున్నట్లుగా తెలియుచున్నది.[19] ప్రస్తుతము అమరేశ్వర దేవాలయము క్రింది అంతస్తు అంతయు మూసివేయబడియున్నది. బహుశ నిది

మధ్యయుగములో, లేదా, తరువాతి కాలములోనో జరిగియుండ వచ్చును.

అమరావతిలో లభించిన చతుర్ముఖ లింగప్రతిమ (7 × 6 సెం.మీ) ఆకుపచ్చ సున్నపురాతితో చెక్కబడి సాతవాహనులకాలపు పనితనమును తెలియజేయుచున్నది. ఇది క్రీస్తుశకము ఒకటి, లేదా రెండవ శతాబ్దుల కాలమునాటికి చెందినదిగా పండితుల భావన. దీని వలన ఆంధ్రదేశములోని అమరావతిలో శైవ మత ప్రాచీనత క్రీస్తు శకము తొలి శతాబ్దములకు చెందినదిగా తెలియుచున్నది.[20] ఈ చతుర్ముఖలింగము లభ్యమయిన కారణముగా శివుని సదాశివునిగా, వ్యక్తిగత ఆరాధనలు జరుగుచుండినట్లు విశదమగుచున్నది. దీనికి సంబంధించి లభ్యమయిన మరియొక ఆధారము - అమరావతిలోని నంది విగ్రహము. సాతవాహనుల కాలమునకు చెందిన ఈ నంది విగ్రహము అమరేశ్వరాలయ ప్రాంగణమందు జరిపిన పురావస్తు త్రవ్వకములలో లభ్యమయినది.[21] ఈ విగ్రహము నిలువెత్తులో నుండి, సాతవాహనుల పనితనమును తెలియజేయుచున్నది. శివుని వాహనమైన ఈ నందీశ్వరుని శరీరము, మెడచుట్టును పువ్వులతోను, ఇతర అలంకారములతోను అందముగా చెక్కబడినది. బహుశ, నీ విగ్రహము గర్భగృహమునకు ఎదురుగా గాని, లేదా, ఒక ప్రత్యేక మండపములోగాని ప్రతిష్ఠింపబడియుండవచ్చును. నంది విగ్రహము యొక్క ఎత్తైన పరిమాణము చూచినచో, శివునకు పెద్ద ఆలయముండి నట్లుగా కన్పడుచున్నది. శైవమతమునకు చెందిన ఈ రెండు ముఖ్యాధారముల బట్టి, క్రీస్తుశకము తొలి శతాబ్దములలో ఆంధ్ర దేశమునందు మహా సదాశివతత్వము బహుళ ప్రజాదరణ పొంది నట్లుగా తెలియుచున్నది. పంచారామ శైవక్షేత్రములవద్ద జరిపిన క్షేత్ర పరిశోధనలలో ఒక్క అమరావతియందు తప్ప తక్కిన ఏ ఇతర క్షేత్రములందును బౌద్ధమతమునకు చెందిన ఎట్టి ఆధారములు లభ్యము కాలేదు.

మధ్యయుగము పూర్వభాగమందు వచ్చిన అనేక మౌలికమైన మార్పుల వలన బౌద్ధమతము తన ప్రత్యేకతను కోల్పోయి అనేక తాంత్రిక ఆచారములతో ముడిపడినది. బౌద్ధమతములో సంభవించిన ఈ వినూత్న పరిణామముల వలన ఆ కాలమందు, బౌద్ధమునకు, హిందూ మతమునకు ఎక్కువ భేదభావము లేకపోయినది. ముఖ్యముగా, బౌద్ధమతము వైష్ణవ మతమునందు చక్కగా నిమిడి పోయి బుద్ధుడు విష్ణుమూర్తి అవతారములలో నొకనిగా నారాధింపబడ సాగెను. ఆంధ్రదేశములోని ఆలంపూరునందు బుద్ధుడు విష్ణు అవతారములలో నొకనిగా ఆలయ శిల్పములందు చెక్కబడినాడు.[22] క్రీస్తుశకము పదవ శతాబ్దికి చెందిన ఈ శిల్పముల వలన నీ కాలము నాటికి బుద్ధుడు నారాయణుని అవతారములలో నొకనిగా, బౌద్ధ నారాయణునిగా కొలవబడినట్లు తెలియుచున్నది, ఈ కాలమున బుద్ధుడు, విష్ణువులకు గల దగ్గర సంబంధము, మనకు శాసనాధారముల వలన కూడ తెలియుచున్నది. క్రీస్తుశకము 1170లో కరీంనగర్ నందీయబడిన నొక శాసనములో కాకతీయ రుద్రదేవుని మంత్రి అయిన గంగాధరుడు దేవాలయము నొకదానిని కట్టించినట్లుగాను అందు విష్ణుమూర్తే బుద్ధుని రూపమును దాల్చినట్లును ప్రస్తుతించబడి నది.[23] అమరావతిలోని అమరేశ్వరాలయములో కోట కేతరాజు(2), అతని ప్రియురాండ్రు, బుద్ధదేవునికి దీపదానము లిచ్చినట్లుగా శాసన ములు కలవు.[24] అమరావతిలోని స్తంభ శిలాశాసనములను పరిశీ లించినచో, ఆ కాలమున బుద్ధదేవునికి ఒక ప్రత్యేక ఆలయముండి నట్లుగా తెలియుచున్నది.[25]

ఈ శిల్ప, శాసనాధారములన్నియు పరిశీలించినచో బౌద్ధ మతము శైవమతముకంటె వైష్ణవమతమునకే అత్యంత చేరువగా వచ్చినట్లు తెలియుచున్నది. అదియునుగాక, మధ్యయుగమునందు వీరశైవ మతప్రచారకులు తరచుగా నితరమతముల వారితోను, ముఖ్యముగా బౌద్ధులతోను, మత వివాదములలో మునిగినట్లు స్పష్ట మగుచున్నది. అందువలన, పంచారామ శైవక్షేత్రముల శిధిల మయిన ఏ బౌద్ధ నిర్మాణముల పైననో, లేక శైవమతములో బౌద్ధ మతము కాలక్రమమున యిమిడిపోయినట్లుగానో భావించి చేసిన సిద్ధాంతీకరణములు ఏ విధముగాను సమర్థనీయము గాదు. ఈ అధ్యయ నము వలన, యింతవరకు చరిత్రకారులలో బలముగా నాటుకొనిన అభిప్రాయములన్నియు ఈ విషయమై పునరాలోచించవలసిన అవసర మేర్పడినది.

అధోజ్ఞాపికలు

1. సౌత్ ఇండియన్ ఇన్స్క్రిప్షన్స్, వాల్యూం 4, 769; భీమేశ్వర పురాణము.
2. డి. సి సర్కార్, ఎపిగ్రాఫికల్ గ్లాసరీ (1966) పే. 26.
3. భీమేశ్వర పురాణము, నాలుగో ఆశ్వాసము, పే. 77 నుండి 88 వరకు.
4. అదే; పే, 88 నుండి 91 వరకు.
5. కె సూర్యనారాయణ, "సిగ్నిఫికెన్సు ఆఫ్ ది లెజండ్సు రిగార్డింగ్ ది పంచారామన్ ఇన్ ది వర్క్సు ఆఫ్ శ్రీనాథ" ప్రొసీడింగ్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెసు, 11వ సెషను, నగరము 1987.
6. ఇ. హల్ష, "టు పిల్లర్ ఇన్స్క్రిప్షన్స్ ఎట్ అమరావతి", ఎపిగ్రాఫియా ఇండికా వాల్యూం. 6, పే. 146-159; దేబల మిత్ర, బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్, పే. 200-201.
7. ఎ. ఘోష్, "ది ఎర్లీ ఫేజ్ ఆఫ్ ది స్తూప ఎట్ అమరావతి, సౌత్ ఈస్టు ఇండియ" ఏన్షియంట్ సిలోన్, సం. 3, ఆగస్టు, 79, పే. 100 మరియు 101.
8. ఎస్. రమేశన్, "ద్రాక్షారామ టెంపుల్", ఆరాధన, ఏప్రిల్ 1965, పే. 29-38; బి. కె. శర్మ, ది డెవలప్‌మెంటు ఆఫ్ ఎర్లీ శైవ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్ (ఢిల్లీ, 1982) పే. 78-79 మరియు 94.
9. బి. ఎస్. ఎల్. హనుమంతరావు, రెలిజియన్ ఇన్ ఆంధ్ర, పే. 180.
10. పి. ఆర్. కె. ప్రసాద్, "శైవిజమ్ ఇన్ ధాన్యకటక" పేపర్ ప్రజెంటెడ్ ఇన్ ది సెమినార్ ఆన్ శైవిజమ్, తెలుగు యూనివర్సిటీ, శ్రీశైలము, 1988.

11. కె. వి. సౌందరరాజన్, గ్లింప్సస్ ఆఫ్ ఇండియన్ కల్చర్—ఆర్కిటెక్చర్, ఆర్టు అండ్ రెలిజియన్, ఢిల్లి, 1981, పే. 22-24

12. కె. కృష్ణమూర్తి, "ఆరిజిన్ ఆఫ్ బ్రాహ్మణికల్ యాప్సిడల్ ష్రైన్స్ ఇన్ ఆంధ్ర "శ్రీనిధి-పర్స్పెక్టివ్స్ ఇన్ ఇండియన్ ఆర్కియాలజీ. ఆర్ట్ అండ్ కల్చర్, శ్రీ కె. ఆర్. శ్రీనివాసన్ ఫెస్ట్‌స్క్రిప్ట్, మద్రాసు, 1983 పే. 65-66; కె. వి. సౌందరరాజన్, పైది, పే. 23.

13. ఐ. కె. శర్మ, బ్రాహ్మణికల్ ఆర్కిటెక్చర్ డ్యూరింగ్ ది సాతవాహన పీరియడ్ ఇన్ ఆంధ్ర, ఇతిహాస, 1981, పే. 32.

14. ఎ. హెచ్. లాంఘర్స్ట్, "ది కపోతేశ్వర టెంపుల్ ఎట్ చేజెర్ల, ఇన్ గుంటూరు డిస్ట్రిక్టు" యాన్యువల్ రిపోర్టు ఆఫ్ ది ఆర్కియలాజికల్ డిపార్టుమెంటు; సదరన్ సర్కిలు, మద్రాసు, 1917-18, పే. 33-36; కె. ఆర్. శ్రీనివాసన్; టెంపుల్స్ ఆఫ్ సౌత్ ఇండియ, న్యూ ఢిల్లీ (1979) పే. 24.

15. ఐ. కె. శర్మ; పైది (1982) పే. 37-38.

16. ఐ. కె. శర్మ, రిపోర్టు ఆన్ ది యాంటిక్వేరియన్ రిమెయిన్స్ ఇన్ ది సబ్‌మర్జిబుల్ ఏరియాస్ అండర్ శ్రీశైలమ్ హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు, 1977.

17. కె. కృష్ణమూర్తి, పైది, పే. 66.

18. ఐ. కె. శర్మ, పైది (1982) పే. 142.

19. ఎన్. రామస్వామి, అమరావతి, ది ఆర్ట్ అండ్ హిస్టరీ ఆఫ్ ది స్తూప అండ్ ది టెంపుల్, ఆంధ్రప్రదేశ్ ఆర్కియాలాజికల్ సిరీస్ నం 41, హైదరాబాదు 1975.

20. ఐ. కె. శర్మ, పైది, (1982) పే. 37-38; మరియు చూడుడు, "ఎ చతుర్ముఖలింగ ఫ్రమ్ అమరావతి అండ్ ది స్ప్రెడ్ ఆఫ్ లకులీశ పాశుపతిజమ్" ఇన్ ఎమ్. ఎస్. నాగరాజరావు (ఎడిటెడ్, మధు-రీసంట్ రీసర్చెస్ ఇన్ ఇండియన్ హిస్టరీ, శ్రీ ఎమ్. ఎస్. దేశపాండే ఫెస్ట్‌స్క్రిప్ట్, న్యూఢిల్లీ, 1981, పే. 221-230.

21. ఐ. కె. శర్మ, పైది, (1982) పే. 77, ప్లేటు 37.

22. బి. ఎస్. ఎల్. హనుమంతరావు, పైది, పే. 129.

23. పి. వి. పి. శాస్త్రి (ఎడిటెడ్), ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ - కరీమ్‌నగర్ డిస్ట్రిక్టు, హైదరాబాదు, 1974), పే. 64-71.

24. ఎ. పి. ఇండి. వాల్యూం 6. నం. 15ఎ.

25. ఎమ్. కృష్ణకుమారి, "ఎ రి ఎగ్జామినేషను ఆఫ్ ది ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ది కోట ఛీఫ్ కేత 2" ఇండియ పాస్టు అండ్ ప్రజంట్, వాల్యూం. 2, నం. 2, పే. 51-55.

స్వేచ్ఛా గీతం

రఫి

భావాల అలలలో నిర్భీతిగా విహరించు-
భారతదేశమొక అడ్డుకాదు.
అడుగుపెట్టినచోటల్లా మానవతని పంచు-
కల్మషరాహిత్యమైన నీ ఆలోచనలకు అవధి లేదు.
ఈ చిరుమల్లె బృందావనాన్ని ఎంత పరవశభరితం
చేసినదో చూడు! తన పరిమళంతో...."
ఈ తీగ విశ్వాన్ని సైతం అల్లుకుపోయింది చూడు విశ్వాసంతో.."
వీరెవరో చూసావా?
జీవస్వేచ్ఛనే కాక భావస్వాతంత్ర్యాన్ని కూడా చంపుకు తింటున్నారు....
మా వేదనాశ్రువుల వరదలలో దారికానక కొట్టుకుపోతారు ఏ తీరాలకో వీరు....
రవి ఉదయాన్ని కాదనగలిగే ధైర్యం ఏ గుండెకూ లేదు....
కవి హృదయాన్ని ఖైదు చెయ్యడం ఎవరివల్లా కాదు!"

వర్షాలక్ష్మి

డా॥ పోచిరాజు శేషగిరిరావు

చిటపాలుగ వానధారలవి పడుచుండె
వైపు వాటము లెవడు పాఠమ్ము చెప్పెనో!
ప్రతి చినుకు గుండెలో ప్రిదులు చైతన్యమ్ము
పుడమితల్లికి మేని పులకరింత గదోయి!

చిటపటల చినుకులన్ చిందించు నొకవెంట
పటపట ధ్వనులతో నినదించు నొక వెంట
మెఱుపు తీవలు మింట మెఱసి చకితము చేయు
అంతలో మటుమాయమైపోవు తెరవెన్క.

కొమ్మకొమ్మయు తీగ రెమ్మ రెమ్మయు జడుల
తడిసి నవజీవమ్ము పడసినట్లనిపించు
నిక్షిప్తమైయున్న జీవలక్షణ మేదొ
తొలి వెల్గురేకయై తులకించు నేలపై

నేలతల్లికి వాననీటి కే బంధమ్ము?
ప్రాణశక్తిని వెలికిలాగు చిత్రమ్ముగా
చినుకులో జీవమ్ము చిప్పిల్లు లక్షణము
ఎట్లు జతగూడెనో! ఏ శాస్త్రమున తెలుక

వర్షధారలు గావు పాలధారలో యేమొ!
పాలధారలు కావు ప్రణయ పీయూషమ్మొ!
పీయూష ధారలన్ పిండు ధేనువు నెవడు
పెంచి పోషించునో? నించు రాగమ్ముతో

గ్రంథసమీక్ష

టు లివ్ టు బెనిఫిట్ మేన్‌కైండ్

(రచన: స్వామీ నిర్మలానంద, వెల: రు. 5-00, ప్రతులకు: విశ్వశాంతి నికేతన్, బి. ఆర్. హిల్స్-571317 కర్నాటక)

ప్రపంచంలోను, మన మనస్సులలోనూ శాంతి రావాలని మనం కోరుకుంటున్నాం. కానీ మనస్సునిండా కోరికలు, ఆకాంక్షలు పెట్టుకున్నంత కాలం శాంతి ఎన్నడూ లభించదు. తనను తను ప్రేమించుకున్నంతగా ఎదుటివాడిని ప్రేమించడం గొప్ప అనుభూతి అంటున్నారు నిర్మలానంద స్వామీజీ.

"టూ లవ్ టు బెనిఫిట్ మేన్‌కైండ్" అనే ఈ చిన్న పుస్తకంలో స్వేచ్ఛ, నిజమైన విశ్వాసం, ప్రకృతినుంచి పాఠాలు, మన పిల్లలు - వారి విద్య, స్వార్థచింతన, ఆధ్యాత్మిక పరిశోధన, ప్రేమ - న్యాయం మొదలైన అంశాలపై స్వామీజీ చక్కగా లోతుగా చర్చించారు.

స్వేచ్ఛ లేకుండా చక్కగా పోషింపబడిన గుర్రాల మాదిరిగా ప్రజలు ఉండి, వారు కష్టపడి పనిచేసి డబ్బు కోసమో లేక సంఘంలో గుర్తింపు కోసమో, ప్రతిష్ఠ కోసమో అనేకం ఉత్పత్తి చేసినప్పటికి అదంతా అర్థంలేనిది, వ్యర్థమైనదేనని స్వామీజీ నిర్వచించడం స్వేచ్ఛపట్ల ఆయన వెలిబుచ్చిన ఒక మంచి విషయం అని చెప్పక తప్పదు. ఇలానే వివిధ కోణాలనుంచి ఈ చిన్న పుస్తకంలో మానవాళి శ్రేయస్సుకు స్వామీజీ వివిధ అంశాలను మనకు విప్పిచెప్పారు.

జెన్ ఎ వే ఆఫ్ లైఫ్

వెల: రు. 7-50; రచన: స్వామీ నిర్మలానంద.

మనిషి జీవితంలో ధ్యానం ఎంత గొప్పదో, ఎంతగా జీవితాన్ని ప్రభావితం చేస్తుందో ఈ పుస్తకంలో నిర్మలానంద వివరించారు. భారత్‌లో ప్రారంభమైన ఈ జెన్ (మెడిటేషన్) చైనాలో అభివృద్ధి చెంది చివరికి జపాన్‌లో ఆచరించబడింది.

ఎన్‌లైటెన్డ్ అనార్కిజం

వెల: రు. 5-00, రచన: స్వామీ నిర్మలానంద

ఏదైనాసరే అతిగా ఉండటం చెడు ప్రభావమే అవుతుంది. మన జీవితాలలో అతిగా జోక్యం చేసుకొనడం ద్వారా ప్రభుత్వం మన స్వేచ్ఛని దురాక్రమిస్తున్నది వాస్తవం అని స్వామీజి అంటున్నారు. సాధ్యమైనంతవరకు ప్రజలు తమ గమ్యాన్ని తామే రూపొందించుకొనడానికి అనుమతించాలని ఆయన అంటున్నారు. మనిషి జీవనం పాలకులు-సంఘం వీటి సాహిత్య సంబంధాల గురించి స్వామీజి ఈ పుస్తకంలో వివరించారు.

అవర్ ఋషీస్

(వెల: రు. 10-00, రచన: స్వామి నిర్మలానంద) "భారతదేశ ఆధ్యాత్మిక సాంప్రదాయం. ఎన్నడూ భారతీయ లేదా హిందూ ధర్మానికి మాత్రమే చెందినది కాదు దాని సారం విశ్వవ్యాప్తమైనది" — అని స్వామీ నిర్మలానంద "అవర్ ఋషీస్" అనే ఈ పుస్తకం ముందుమాటలోనే పేర్కొన్నారు. సర్వప్రపంచం, మానవాళి గురించి మన ఋషుల దృక్పథం, వారి ఆలోచన ధోరణి నిర్మలానందం ఈ పుస్తకంలో సరళంగా వివరించారు. సాధువు ఋషి వీరిరువురి మధ్య ఆధ్యాత్మిక దృక్పథాలు గురించి ఆయన చక్కగా వివరించారు.

పొయిటికల్ రెలిజియన్

వెల: రు. 10-00, రచన: స్వామీ నిర్మలానంద, భారత్‌లో ధ్యానం (మెడిటేషన్) గా, చైనాలో చాన్‌గా, జపాన్‌లో జెన్‌గా ప్రసిద్ధి చెందిన జెన్ గురించి ఈ పుస్తకంలో మరింత విపులంగా చర్చించారు. స్వామీజీ మానసిక అశాంతి, విజ్ఞాన సంబంధమైన ఉక్కిరి బిక్కిరి అహంభావం, ఆధిపత్యంల గందరగోళంనుంచి బయటపడాలనుకునేవారికి జెన్ ఉపశమనం కల్గించే మలయమారుతం అంటున్నారు స్వామీజీ. మతపరమైన జీవితపద్యం జెన్ .అంటున్నారీయన ఆదిధ్యాన పురుషుడు, బౌద్ధుడు, జపాన్‌లోని జెన్ గురువులు ప్రబోధించిన విషయాలను ఈ పుస్తకంలో ప్రస్తావించి ఆధ్యాత్మికేతర జీవన విధానంలో ధ్యానం పరమార్థమని ఆయన వివరించారు.

మొత్తంమీద స్వామీ నిర్మలానంద వర్తమాన సామాజిక దృక్పథంతో ఈ పుస్తకాలలో ఆధ్యాత్మిక, ఆధ్యాత్మికేతర విషయాలను చర్చించారు. భారతీయత, భారతీయ సాంప్రదాయాలు, వాటి విలువల గురించి తెలుసుకొనగోరువారికి పుస్తకాలు తోడ్పడగలవనడంలో ఏమీ సందేహం లేదు.

—సర్వజిత్

డా॥ యం. గోవిందస్వామి నాయుడు

ఆంధ్రనాయక శతకం - శతకలక్షణాలు

శతకం సర్వజనాదరణీయం, శక్తివంతం అయిన సాహిత్య ప్రక్రియ. సంస్కృత ప్రాకృత భాషల్లోని శతకమే తెలుగులో కొన్ని విశిష్ట లక్షణాలతో అవతరించింది.

శతకాలు అన్ని వాఙ్మయాల్లో ఉన్నప్పటికీ ఆంధ్రదేశంలో వాటికి ఒక ప్రత్యేకస్థానం ఉంది, పూర్వం కవులు ప్రౌఢమయిన రచనలు చేయడానికి ముందు భగవదనుగ్రహప్రాప్తి కోసం, కవితా సృజనాభ్యాసం కోసం శతకాలు వ్రాస్తుండేవారు. క్రీ.శ. 12వ శతాబ్దినుండి ఇప్పటిదాకా ఆంధ్రంలో శతక రచన సాగుతూనే ఉంది.

తెలుగు శతకాల్ని కాలక్రమాన్ననుసరించిగాక వస్తువననుసరించి లాక్షణికులు పది విధాలుగా వర్గీకరించారు. (1) భక్తి శతకాలు (i) శైవభక్తి శతకాలు (ii) వైష్ణవభక్తి శతకాలు (iii) దేవీభక్తి శతకాలు (iv) వివిధ భక్తిశతకాలు (2) వ్యాజస్తుతి శతకాలు (3) వేదాంత శతకాలు (4) నీతి శతకాలు (5) అధిక్షేప శతకాలు (6) శృంగార శతకాలు (7) హాస్య శతకాలు (8) ప్రకీర్ణ శతకాలు (9) వివిధ వస్తుశతకాలు (10) కథాత్మక శతకాలు.

శతకాల్లో హృదయాన్ని స్పృశించి పులకరింపజేసేవి వ్యాజస్తుతి శతకాలు. "వ్యాజస్తుతిర్ముఖే నిందాస్తుతిర్వా రూఢిరన్యథా" అని వ్యాజస్తుతి అలంకారానికి కావ్యప్రకాశంలో ఇయ్యబడిన నిర్వచనం గమనింపదగింది. ఇందు స్తుతిలో నిందకాని, నిందలో స్తుతికాని అంతర్గతమై ఉంటుంది. దేశం విప్లవకారుల, ధూర్తుల అత్యాచారాలకు లోనై ఉపద్రవంలో ఉన్నప్పుడు భగవంతుడు మౌనం వహించి ఊరకుండడం ఉచితం కాదని, దేశాన్ని, భక్తుల్ని కాపాడాలని ప్రబోధించడం ఈ శతకాల్లోని ప్రధానాంశం. కవి ప్రయోగించే తీక్షణాలయిన మాటలు అతడు భగవంతుణ్ణి నిందిస్తున్నట్టున్నా భక్తుడయిన కవి చివరకు క్షమాపణ వేడుకొంటాడు. వ్యాజస్తుతి శతకాలు సాహిత్య ప్రియులకేగాక చారిత్రకులకు కూడా చాలా ఉపయోగకరాలు. రాజకీయ మత పరిస్థితుల్ని తెలుసుకోవడానికి ఇవి దోహదం చేస్తాయి. రాజకీయ సంఘటనల కారణంగా రచింపబడడం వల్ల వ్యాజస్తుతి శతకాల్ని చారిత్రక శతకాలుగా పరిగణింపవచ్చు.

వ్యాజస్తుతి శతకాల్లో ప్రధానంగా పేర్కొనదగింది ఆంధ్ర నాయక శతకం. దీని రచయిత కాసుల పురుషోత్తమ కవి. ఇతనికి పుల్లంరాజు అనే నామాంతరం కూడా ఉంది. ఇతడు కృష్ణాజిల్లా బందరు తాలూకా అవనిగడ్డకు సమీపంలోని పూర్వం చల్లపల్లి జమీందారీలో ఉన్న శ్రీకాకుళ గ్రామనివాసి. ఈయన "కాశ్యప గోత్రుండ కాసులవంశ చంద్రముండ అప్పలరాజ రమణమాంబ కూర్మి తనూజుండ" అని తన హంసలదీవి గోపాల శతకంలో స్వయంగా చెప్పుకొన్నాడు. పురుషోత్తమకవి భట్రాజుల వంశానికి చెందినవాడని విజ్ఞుల అభిప్రాయం. 'రట్టు సేయుదు గనుము నా భట్టుతనము' అని ఆంధ్రనాయక శతకం 42వ పద్యంలో ఉండే పాదమే వీరి ఊహకు హేతువు. పురుషోత్తమ కవి సంతతివాళ్లు నేటికీ శ్రీకాకుళంలో నివసిస్తుండడమే దీనికి ప్రోద్బలకం.

కృష్ణా మండలంలోని దేవరకోట ప్రభువైన శ్రీరాజా అంకినీడు బహద్దరువారి ఆస్థానకవిగా పురుషోత్తముడు ఉండినట్టు ఈయన వంశీయులవద్ద నిదర్శనాలున్నాయి. రాజా అంకినీడు బహద్దరు క్రీ॥శ॥ 1791లో రాజ్యానికి వచ్చి ఇరవైయేండ్లపాటు పరిపాలన చేశాడు. కాబట్టి ఈ పురుషోత్తమ కవి కూడా క్రీ॥శ॥ 1800 ప్రాంతంవాడని చెప్పవచ్చు. మానసబోధ శతకం, భక్త కల్పద్రుమ శతకం, హంసలదీవి గోపాలశతకం అనే ఇతర శతకాల్ని కూడా ఈయన రచించినట్టు ఆంధ్ర నాయక శతకంలోని కడపటి పద్యాన్ని (108) బట్టి తెలుస్తూ ఉంది. వీటిలో మొదటి రెండూ అలభ్యాలు.

ఆంధ్ర నాయక శతకం శ్రీకాకుళంలోని ఆంధ్ర విష్ణువును ఉద్దేశించి వ్రాయబడింది. రాయల కాలంనాటికి వైభవంతో వెలుగొందుతూ ఉండిన తెలుగురాయడు పురుషోత్తమ కవి కాలంనాటికి గత వైభవుడయ్యాడు. పూజా పునస్కారాలు, ఉత్సవాలు, ఊరేగింపులు అడుగంటాయి. ఆంధ్ర నాయకుని ఈ దుస్థితి ఆంధ్రకవి అంతరంగాన్ని కలచింది. సర్వసమర్థుడయిన దేవునికి కూడా ఇలాంటి దుర్గతి పట్టింది కదా! అని వాపోయాడు. తన ఆవేదన వెల్లడించాడు. వ్యాజస్తుతి చేశాడు. ఈ నేపథ్యంలో ఆంధ్రనాయక శతం ఆవిర్భవించి వెలుగులోకి వచ్చింది.

ఈ శతకంలో ఉన్న శతక లక్షణాల్ని కొంతవరకు పరిశీలించ వలసి ఉంది. సార్వత్రిక శతక లక్షణాల్ని గురించి "సంస్కృత ప్రాకృత శతకములలోని సంఖ్యా నియమము, మకుట నియమము, ఛందోనియమము, రసనియమము, ముక్తక లక్షణము, ఆత్మాశ్రయ కవితాధర్మము అను లక్షణములు తెలుగు శతకములలో రూపు దిద్దినవ"ని డా॥ కె. గోపాలకృష్ణరావుగారు తన 'ఆంధ్రశతక సాహిత్య వికాసము'లో వివరించారు. స్తుతిలో నిందగానీ నిందలో స్తుతిగానీ ఉండడం వ్యాజస్తుతి శతక ప్రధాన లక్షణమని ఆలంకారికుల అభిప్రాయం. కాసుల పురుషోత్తమకవి రచించిన ఆంధ్ర నాయక శతకంలో పై శతక లక్షణాలన్నీ భాసిస్తూ ఉన్నాయి.

1. సంఖ్యానియమం :

శతకం సంఖ్యాబద్ధమయిన చాటు ప్రబంధమని లాక్షణికులు నిర్వచించారు. ఈ కావ్య ప్రక్రియ పేరే సంఖ్యాత్మకమై శతనియతిని సూచిస్తూ ఉంది. 'శత' శబ్దానికి 'కమ్' ప్రత్యయం చేరి శతక మయింది. తొలి దశలోని శతకాల్లో సంఖ్యానియమం పాటింపబడినా తరువాతికాలాన శతకాలు ఈ నియమాన్ని అతిక్రమించాయి. శత సంఖ్యా ప్రాధాన్యాన్ని అనుసరించి శతకం నూరు పద్యాల్తో రచింపబడే సంప్రదాయం ఏర్పడింది. కాలక్రమంలో 101, 102, 106, 108, 126, 130, 1001, 1002, 1008, 1016, 1026, 1030 ఆదిగా శతాధిక, అష్టోత్తర శతాధిక, అష్టోత్తర సహస్రాధిక పద్యాల్లో శతక రచన చేయడం సంప్రదాయమైంది. కాసుల పురుషోత్తమ కవి కూడా సంఖ్యా నియమాన్ని పాటించాడు. తన శతకాన్ని 108 పద్యాలతో పరిమితం చేశాడు. అర్చనకు అష్టోత్తరశత భగవన్నామాల్ని ఉచ్చరించడం పవిత్రంగా భావింపబడింది. ఇదే సంప్రదాయమయింది. ఈ సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకొని కాబోలు ఆంధ్ర నాయక శతకాన్ని అష్టోత్తరశత పద్యాలతో కవి రచించాడు. "ధర నూట యెనిమిది తిరుపతులందు"(12) అనే పద్యంలో నూట యెనిమిది సంఖ్య కూడా ప్రయోగింపబడడంవల్ల ఈ అష్టోత్తర శతసంఖ్య కవికి ఇష్ట మయినట్టు తెలుస్తుంది.

2. మకుట నియమం :

శతకంలోని ప్రతి పద్యంలోనూ చివరి రెండు పాదాలుగానీ, ఒక పాదంగానీ, పాద భాగంగానీ ఒకటిగానే ఉంటుంది. దీన్నే మకుటమంటారు. క్రింది నరసింహ, రామలింగేశ, శ్రీకాళహస్తీశ్వర శతకాల్లోని

1. "భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
   దుష్టసంహార నరసింహ! దురిత దూర!"
2. "రామలింగేశ! రామచంద్ర పురనివాస!"
3. "..........శ్రీ కాళహస్తీశ్వరా!"

అనేవి క్రమంగా ఉదాహరణాలుగా పేర్కోవచ్చు.

పురుషోత్తమ కవి ఆంధ్ర నాయక శతకాన్ని రెండు పాదాల మకుటంతోనే రచించాడు. సీసాంత తేటగీతిలోని చివరి రెండు పాదాలు మకుటానికే కేటాయింపబడ్డాయి.

"చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ
హత విమతజీవ, శ్రీకాకుళాంధ్రదేవ!"

3. ఛందో నియమం :

ఈ నియమాన్ని ఆంధ్ర శతకకర్తలు సంస్కృత శతకాల నుండే గ్రహించారు. విభిన్న మకుటాలు పాటించినవారు వివిధ వృత్తాల్లో శతకరచన చేశారు. కొందరు శతకకర్తలు భిన్న వృత్తాల్ని చేర్చి శతకాల్ని రచించారు. చంపూకావ్య సంప్రదాయం కూడా శతకాల్లో చోటు చేసుకొంది. కానీ అధిక సంఖ్యాకులయిన శతక కవులు ఛందో నియమాన్ని పాటించే శతక రచన గావించారు. శతకాన్నంతా ఒకే ఛందంతో నడిపి ఉన్నారు. సుప్రసిద్ధాలయిన సుమతి, కృష్ణశతకాలు సీసంతో నడిచాయి. శ్రీ కాళహస్తీశ్వర శతకం శార్దూల సమన్వితం.

ఆంధ్ర నాయక శతకమంతా ఛందో నియమానుసారం సీస పద్యాల్లో సాగింది. సీసం శీర్షక శబ్దభవం. ఈ ఛందస్సుతో శతకం రచిస్తే ఆది శీర్షాన్ని (శిరస్సును) అలంకరించినట్టవుతుంది. సీసపద్య పాదాలు నాలుగిట్లోనూ చర్యల్ని చెప్పి గీతంలో భావాన్ని ఇమడ్చడం ఈయన రచనా లక్షణాల్లో ప్రధానమయింది.

4. రస నియమం :

ఏకైక రసనియమాన్ని శతకకర్తలు పాటించినా కొందరు అంగి అంగరసాల క్రమాన్ని అనుసరించారు. భక్తి, శృంగార, కరుణ, హాస్య, వీర రసాత్మకాలయిన తెలుగు శతకాలు వెలువడ్డాయి. కృష్ణభక్తి ప్రధానాలయిన శతకాల్లో హాస్యరసాత్మక సన్నివేశాలు చిత్రింపబడ్డాయి. రామాయణ కథాత్మక శతకాల్లో కొన్నిటిలో కరుణ రసం పోషింపబడింది. దేశభక్తి ప్రబోధాత్మక శతకాల్లో వీర రసాత్మక సన్నివేశాలు కొన్ని ఉన్నాయి.

ఆంధ్ర నాయక శతకంలోని పద్యాలు భక్తిప్రధానాలు. భక్తి ముక్తిప్రదం. కాబట్టి ఈ పద్యాలన్నిటా శమం ధ్వనిస్తూ ఉంది. అందువల్ల శాంతరసం అంగిగా, అద్భుత హాస్యరసాదులు అంగాలుగా పరిగణించడానికి వీలుంది.

5. ముక్తక లక్షణం :

శతకం ముక్తక సముదాయం గల సంఖ్యాపూర్వక రచనగా నిర్వచింపబడింది. తెలుగు శతకాల్లో ఈ లక్షణం బహుళంగా పాటింప బడింది. శతక పద్యాలు వేటికవి స్వతంత్రాలు. ఒక పద్యంలో ఉండే భావం తరువాతి పద్యంలో కొనసాగదు. ఇలాంటి పద్యాల్నే ముక్తకాలంటారు.

కొన్ని విషయాలు మళ్లీ మళ్లీ చెప్పినట్లు తోస్తున్నా ఆంధ్ర నాయక శతకంలోని పద్యాలు వేటికవి స్వతంత్రాలే. ముందు పద్యంతోగానీ తరువాతి పద్యంతోగానీ భావ సమన్వయం కనిపించదు. ఈ కారణంగా ఈ శతకంలో ముక్తక లక్షణం కూడా పాటింపబడి నట్టు వ్యక్తమవుతుంది.

6. ఆత్మాశ్రయ కవితాధర్మం :

కొన్ని నీతి శతకాల్లోనూ. తదితర శతకాల్లోనూ కవులు తమ ఆత్మానుభూతిని వ్యక్తీకరించారు. కాబట్టి ఇది కూడా శతకాలకు ప్రధాన లక్షణమని భావించవచ్చు. ఈ లక్షణం సంస్కృత శతకాల నుండి గ్రహింపబడింది.

పురుషోత్తమ కవి తన శతకంలో ఒకచోట ఆంధ్ర విష్ణును లాలిస్తాడు. ఇంకొకచోట దూషిస్తాడు. దీన్నిబట్టి మానసికంగా ఆయన దేవునికెంత దగ్గరయింది, దైవంపట్ల ఇతనికెంత చనువు ఉండేదీ తెలుస్తుంది. "నిత్యపూజాదికాలు కూడా జరిపించుకోలేక పోతున్నావు. సాటివాళ్లలో నీ పరువేం కావాలి? ధర్మాన్ని తప్పి నడిస్తే నింద రాదా?" అని ఆంధ్ర నాయకుణ్ణి హెచ్చరించాడు. "నూట యెనిమిది తిరుపతుల్లోనూ శ్రీకాకుళం గొప్పదని, ఆంధ్ర నాయకుడవని, వైకుంఠుడవే స్వయం వ్యక్తిగా అర్చావతారాన్ని పొందావని అంతా చెప్పుకొంటారు. అలాంటి నీకు నిత్య పూజాదికాలు జరక్కపోతే ప్రసిద్ధి ఎలా కలుగుతుంది? ప్రసిద్ధి లేకపోతే పోయె లోకులు నిన్ను ఆడిపోసుకుంటారు" అని తన బాధను వ్యక్తం చేస్తాడు.

వ్యాజస్తుతి :

భక్తులు భగవంతుణ్ణి చనువుకొద్దీ స్తుతిస్తుంటారు. నిందా రూపంగా చేసే స్తుతినే వ్యాజస్తుతి అని చెప్పుకోవచ్చు శతకంలో అధిక పద్యాలు వ్యాజస్తుతి లక్షణ సమన్వితాలు. ఒకదాన్ని మచ్చుకు పరిశీలించవచ్చు.

నాఁగలి రోఁకలన్నకు నిచ్చి శంఖాది
  పంచాయుధము లీవు పట్టినావు
తాటిటెక్కెంబు కోల్తల పెద్దకెత్తించి
  గరుడ ధ్వజంబీవు గట్టినావు
వెలరాని కలివోని వలువ జ్యేష్ఠునకిచ్చి
  కనకాంబరం బీవు గట్టినావు
మద్యమగ్రజునకు మత్తిలఁ ద్రావించి
  జున్నుబాల్ పెరుఁగీవు జుర్రినావు

తగవరివె యన్నదమ్ముల ధర్మమిదె
తీర్పవలెఁగాని మఱియొండు తీర్పఁగలడె?
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ
హత విమత జీవ, శ్రీకాకుళాంధ్రదేవ!"

(ఆంధ్ర నాయక శతకం-36)

కాసుల పురుషోత్తమ కవి రచించిన ఆంధ్ర నాయక శతకం శతక లక్షణాలన్నిటిని తనలో ఇముడ్చుకొని భక్తిప్రధానంగా భగవన్మహిమ, పారమ్య ప్రతిపాదకంగా వ్యాజస్తుతి పద్యాలతో ఆంధ్ర పాఠకలోకాన్ని ఆనందింపజేస్తూ ఉందనడంలో సందేహం లేదు.

అధోజ్ఞాపికలు

1. డా॥ కె. గోపాలకృష్ణరావు, ఆంధ్ర శతక సాహిత్య వికాసము. ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైద్రాబాదు.
2. ఆచార్య నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటము, నవ్య పరిశోధక ప్రచురణలు, 18-1-699, భవానీ నగర్, తిరుపతి.
3. కాసుల పురుషోత్తమకవి, ఆంధ్ర నాయక శతకం, సంపాదకీయం: డా॥ యార్లగడ్డ బాలగంగాధరరావు, నిర్మలా పబ్లికేషన్స్, విశాఖపట్నం-3.
4. డా॥ దివాకర్ల వేంకటావధాని, ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్, హైదరాబాదు.

కలగూరగంప

గూఢజ్యోతి

జూలై, 1988 భారతి సంచికలో శ్రీ 'తి' 'వేదసావిత్రి-భారత సావిత్రి' అన్న పేరుతో ఒక గంభీర వ్యాసాన్ని రాశారు. అందులో గాయత్రీ మంత్రాన్ని వేదసావిత్రిగ పేర్కొని, సవిత, సావిత్రి శబ్దార్థ విచారణచేసి, ఆ మంత్రార్థం "వెలుతురును ఉపాసిస్తాను. ఆ వెలుతురు నా మనస్సును ప్రేరేపించి నడిపించుగాక" అని రాశారు. ఇక్కడ వారు "మనస్సు"ను 'బుద్ధి' అన్న అర్థంలో వాడినట్లు సందర్భంవల్ల అవగతమౌతోంది. 'వెలుతురు' అంటే ఫిజిక్స్‌లో చెప్పే 4000-8000 ఆంగ్‌స్ట్రాముల తరంగదైర్ఘ్యం కల శక్తికిరణాలా?' అని ప్రశ్నించుకొని, మొదటి సూర్యకాంతిగ చెప్పి, సూర్యోపాసన, దాని సార్వజనీనత ప్రదర్శించారు. "వెలుతురు, సత్యము అనేవి సర్వదేశాల్లో తాత్త్వికులకు ఇష్టం" అని ఈ జ్యోతి 'గూఢంజ్యోతి'. 'ఋతంజ్యోతి' అని తాత్పర్యంగా చెప్పారు. వేదం రహస్యార్థమయమని విస్తరించి చెప్పి, ఆ విషయం అంతతో ముగించారు. ఈ మంత్రార్థ చర్చలో వారు ప్రదర్శించిన పాండిత్యం, నైపుణ్యం బహుధా ప్రశంసనీయాలు. అయితే ఈ గూఢజ్యోతిని గురించి మరింత వివరణ ఇస్తే బాగుండేది. చాలా సంగ్రహంగా సూత్రప్రాయంగా ఈ జ్యోతి ఫిజిక్స్‌లో చెప్పే వెలుగు కాదని, గూఢమైనదని చెప్పి ఊరుకున్నారు. వారి సూత్రానికి భాష్యప్రాయంగా నా ఈ రచన సాగుతుంది.

గాయత్రీ మంత్రాధిదేవతను గురించి అభిప్రాయ భేదాలున్నాయి. కొందరు మంత్రాధిదేవత పురుషుడని, అతడు సూర్యుడని చెప్తున్నారు: శ్రీ 'తి' దీన్ని అంగీకరించి సూర్యోపాసన గురించి, ఆదిత్యతేజాన్ని గురించి రాసారు. కొందరు దేవతను స్త్రీమూర్తిగ భావించి ఆమెను సావిత్రిగ ఉపాసిస్తున్నారు. మరికొందరు ఈ అధిదేవత స్త్రీ, పురుష వివక్షకు అతీతమని క్లీబమని 'భర్గస్' వెలుగగా భావించి ఆరాధిస్తున్నారు. శ్రీ 'తి' సూర్యచంద్రాగ్నులను భర్గోదేవతలుగా చెప్పి, 'వరేణ్యం కూడా వర్చస్సు (కాంతి) నే స్ఫురింపజేస్తూందన్నారు. నిజానికి ఉపాస్యదైవం స్త్రీ కాదు, పురుషుడు కాదు, నపుంసకము కాదు. అన్నిటికీ అతీతమైన ఒకానొక వస్తువని కావ్యకంఠ వాసిష్ఠ గణపతిముని తమ గాయత్రీ వ్యాఖ్యానంలో నిర్ణయించారు. చూడుడు:

మంత్రలింగంతు భర్గసోధ్యేయత్వ నిర్దేశాత్ నపుంసక పరం। (సూ. 14) వస్తుతస్తునస్త్రీ (సూ. 15), నపుమాన్ (సూ. 16), నపుంసకం (సూ. 17), సర్వలింగాపేతం యత్కించిద్వస్తు (సూ. 18), తస్య సర్వలింగాఃశాస్త్రీ వ్యవహారో దృశ్యతే। (సూ. 19)

ఈ ఒకానొక వస్తువు తేజస్సే. ఇదే గూఢజ్యోతి. దీన్నే 'భర్గస్' అని కొందరు వ్యవహరిస్తున్నారు.

మంత్రాధిదేవత సూర్యుడని భావించినప్పటికీ, ఇక్కడ నిజాని ఉపాస్యమైనది చక్షుర్గోచరమైన ఆదిత్య మండలం కాదు. ఆదిత్య మండలాంతర్వర్తి శ్రీమన్నారాయణుడే. ఇతడే హిరణ్యగర్భుడని వేదం పేర్కొంటోంది. ఇతడే సూర్యున్ని, చంద్రున్ని, అగ్నిని, నక్షత్రాలను, విశ్వంలో సమస్తాన్ని ప్రకాశింపజేసే పరమాత్మ. ఇతనిని పరంజ్యోతి అనడం కూడా సాంకేతికమే. నిజానికి పరమాత్మ జ్ఞానస్వరూపుడు. "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని శ్రుతి ఇతడినే వివరిస్తోంది. జ్ఞానస్వరూపుడైన పరమాత్మ లేక పరమేశ్వరుని శక్తియే 'సావిత్రి' అని నాయన వర్ణించారు. చూడుడు: జ్ఞానశక్తిః నాతిరిచ్యతే। (సూ-3); సవితుర్హిరణ్యగర్భస్యైవ। (సూ. 4). అందుచేత వెలుగు (సావిత్రి) జ్ఞానశక్తికి ప్రతీక అని తెలుస్తోంది. 'వేదంలో సింబాలిజం'లో సింబాలిజం ఉంటుందన్న శ్రీ'తి' వాక్యం యదార్థమే. ఈ వెలుగు కంటికందనిది. 'తి'గారి గూఢంజ్యోతి ఇదే. ఈ వెలుగు విశ్వమంతా ప్రవహిస్తోంది. 'నిఖిలేషు ప్రవహంతీ తపసా నిరుపాధికీన గమ్యాం' అని మునిగారు స్తుతించినదీ వెలుగునే. ఇది విశ్వాతీతం - కూడా. 'అత్యతిష్ఠతో దశాంగుళమ్' అన్న శ్రుతి ఈ శక్తినే విరాట్పురుషునిగ వర్ణిస్తోంది. ఇదే సూక్ష్మరూపంలో జీవుడి దేహంలో 'నీవారశూకవత్తన్వీపీతా భాస్వత్యణూపమా' అని వర్ణితమైంది.

ఈ రహస్యజ్యోతి (కనిపించని కాంతి) క్రైస్తవ యూదు మతాల్లో కూడా భావించబడింది. జూడో-క్రిష్టియన్ సంప్రదాయంలో పరమేశ్వరుడు తేజోరూపుడు. ఇతనికి 'యహ్వా' (యెహోవా అని జనప్రియ నామం) అని పేరు. ఈ మాటకు ఇంగ్లీషులో 'ఐ ఏమ్'(అహమస్మి) అని అర్థం. ఈ 'యహ్వా' వేదంలోకూడ కనిపిస్తోంది. 'నాయన' గారి పరిశోధనవల్ల ఈ 'యహ్వా' ఇంద్రుడికి పర్యాయపదమని ఋజువైంది. 'నాయన'గారు 'ఇంద్రసహస్రం'లో ఇలా అన్నారు: 'యెచమతి

మంతో యహ్వ ఇతినామ్నా | త్వామయి భజంతేభ క్త్యతిశయేన' ఈ ఇంద్రుడు మధ్యమ లోకాధిపతి కాడు: పురాణాల్లో కనిపించే అహల్యా జారుడు కాడు. ఇతడు మహేంద్రుడు, మహేశ్వరుడు, బ్రహ్మశబ్ద వాచ్యుడు, నాయనగారు 'ఐంద్రీయ బ్రహ్మసంహిత'లో ఈశ్వరాద భిన్నుడైన ఈ ఇంద్రుణ్ణి స్తుతించారు.

ఈ గూఢజ్యోతిని యూదు, క్రైస్తవ దార్శనికులు కూడా గుర్తించారు. వీరి సంప్రదాయంలో దీనికి 'షెకీనా' అని పేరు. జి. ఎం. హాప్కిన్స్, డిలాన్ తోమస్ మొదలైన క్రైస్తవ కవులీ షకీనాను భావించి, తమ కవిత ద్వారా ఉపాసించారు. నిజానికి డిలాన్ తోమస్ ప్రసిద్ధ కవిత 'ది ఫోర్స్ దట్ డ్రైవ్జ్ త్రూ ది గ్రీన్ ఫ్యూజ్ డ్రైవ్జ్ త్రూ మీ'' ఈ షెకీనానేనే వర్ణిస్తోంది. డిలాన్ తోమస ఈ విశుద్ధకాంతిని (ప్యూర్‌లైట్) సూర్యకాంతిగా వర్ణించడం, మనం గూఢజ్యోతి 'సావిత్రి'ని సూర్యునిగ వర్ణించడం వంటిదే.

జ్ఞానశక్తి స్వరూపిణి సావిత్రి సకల జగన్మాత-శుద్ధాకాశంలో పరచుకొన్న వెలుగు వెల్లువ. ఈమె 'అదితి'. ఈమె వ్యక్తిరూపిణి, అవ్యక్తరూపిణి కూడా. 'అదితిర్జాతా', 'అదితిర్జనత్వా' అని శ్రుతి. సవితృ శబ్దవాచ్యట్టున ఈమె ప్రథమాస్పృష్టి. ఈమెయే సరస్వతిగా ప్రసిద్ధురాలు. 'విద్యుద్రూపా సరస్వతి', అని శ్రుతి ఈమెయే వ్యక్తసృష్టిగా 'కాళి' అని, అవ్యక్తరూపంలో 'ధూమవతి' అని తంత్ర శాస్త్రం చెప్తోంది. శ్రీ 'తి' సరస్వతిని వెలుగు దేవతగా చెప్పి, ఈమె సావిత్రి అని ధ్వనించారు. వ్యాసుడు 'వేదసావిత్రి'ని భావించి, సావిత్రి కథను మలచినట్లే, శ్రీ అరవిందులు కూడా సావిత్రిని తీర్చి దిద్దారు. శ్రీ అరవిందుల సావిత్రి జ్యోతిర్మయి.

దేవతలంతా తేజోమూర్తులే. 'ధిల్' అనే ధాతువుకు ప్రకాశించు అని అర్థం సామాన్యం. క్రైస్తవ సంప్రదాయంలో పరమపిత (ఫాదర్) దుర్నిరీక్ష్యతేజుడు. స్వర్గంలో సింహాసనాధిష్ఠితుడైన అతని ముఖం ఎవ్వరూ చూడలేరు. అతడు 'సెరఫిమ్' 'చెరుబిమ్' అనే దేవదూతల పక్షాలచేత ఆచ్ఛాదితమై ఉంటాడు. బజారులో మనకు కనిపించే క్రీస్తు బొమ్మకు (కేలండర్ మొ॥వాటిలో) కూడా ఇరువైపులా శిశుముఖులైన దేవతలు ఎగురుతూ రావడం కనిపిస్తుంది. వీరి కాంతి కూడా అసాధారణ ఔజ్జ్వల్యం కలది. యూదు క్రైస్తవ సంప్రదాయంలో వీరు ప్రథమశ్రేణి దేవతలు (ఏంజెల్సు)గా పేర్కొనబడ్డారు. వీరి తరువాతి శ్రేణికి చెందినవారు 'ఆర్కేంజెల్స్' (ముఖ్య దేవతలు). ఇందులో సర్వప్రథముడు లూసిఫర్. మహోజ్వలమైన రూపమతనిది. 'లూసిఫర్' అన్నమాటకూ వ్యుత్పత్త్యర్థం 'గొప్ప కాంతి' అని. ఇతడు స్వర్గంలో దేవుడికి ప్రత్యర్థి. శ్రీ 'తి' సీటన్ వాక్యాల నుద్ధరించి ఇది నిందాస్తుతో. స్తుతినిందో చెప్పలేమన్నారు. నిజానికి రెండూకాదు. ఒకనాడు ఈ కనబడే సూర్యునికన్న (సూర్యుడు భగవంతుని సృష్టి, సీటన్ స్వయంభువు) ఎన్నోరెట్లు కాంతితో వెలిగిన లూసిఫర్, నేడు కాంతివిహీనుడై, సూర్యతేజస్సును చూసి కూడా ఈర్ష్య పడుతున్నారు. 'పేరడైజ్ లాస్ట్'ను 'స్వర్గచ్యుతి' అని అనువదించినవారిలో శ్రీ 'తి' మొదటివారు కాదు. మొసలికంటి హనుమంతరావుగారు స్వర్గపదభ్రష్టుని, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి మొ॥వారు 'స్వర్భంగ'మని అనువదించారు. అయితే నిజానికిది సరైన అనువాదం కాదు. 'పేరడైజ్' అంటే 'స్వర్గం' కాదు. సృష్టికి పూర్వం కూడా స్వర్గం ఉంది. అక్కడే లూసిఫర్ (సీటన్)కు దేవుడికి యుద్ధం జరిగింది. అప్పటికి 'కాలం' కూడా పుట్టలేదు. స్వర్గం దేవుని పట్నం. 'పేరడైజ్' భూమండలంపై పర్షియా ప్రాంతంలో ఉన్న ఒక ఉద్యానవనం. ఇంతకూ 'చ్యుతి' లేదా 'భ్రష్టత్వం' ఎవరికి? సీటన్‌కా? ఆదాం అ.న మానవుడికా? మిల్టన్ దృష్టిలో 'పేరడైజ్ లాస్టు'లో నాయకుడు ఆదాం (ఏడం). సీటన్ కాదు. అతడు కేవలం ప్రతినాయకుడు. సీటన్ స్వర్గంనుండి భ్రష్టుడవడం గౌణం. 'ఏడం' ''పేరడైజు''ను పోగొట్టుకొనడం ముఖ్యం. కనుక అనువాదం సరైనదికాదని నా అభిప్రాయం.

—డా॥ గంటి శ్రీరామమూర్తి

సాహిత్యము-తులనాత్మక పరిశీలన


భారతి (సెప్టెంబరు 1988)లో శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మగారి ''సాహిత్యము అఖండము అవిభాజ్యము'' అనే వ్యాసం చదివి ఇది వ్రాస్తున్నాను.

ఆ వ్యాసంలో ఈ వాక్యాలున్నాయి:

''ఇలియడ్‌లో - ఒకనాడు యుద్ధానంతరం గ్రీకు వీరుడు ఆగమెమ్నన్ విజయ కారణంగా ఒక పెద్ద విందు ఇచ్చాడు. అందులో ఆనాటి యుద్ధంలో చంపబడిన శత్రువుల మాంసం వండి వడ్డించబడింది. సంతోషంగా ఆరగించబడింది. కానీ రామాయణం చదివితే రావణ వధానంతరం రావణభ్రాత విభీషణుడు అన్నను దహన సంస్కారం చెయ్యడానికి రాముడ్ని అనుజ్ఞ ఇమ్మంటాడు. అప్పుడు రాముడంటాడు: మరణాంతాని వైరాణి నివృత్తం నః ప్రయోజనం, క్రియతాం అస్యసంస్కారో మమాప్యేష యథాతవ! మానవ నాగరకతా తారతమ్యం'లో ఉన్న ఈ విశేషం ఆశ్చర్యజనకం!''

పైని వాక్యాల చర్చించడమే నా వ్యాసోద్దేశం. శ్రీ శర్మగారు సాహిత్యము అఖండము అవిభాజ్యము అని మొదలుపెట్టిరి. ప్రాక్పశ్చిమ సాహిత్యాలనుండి ఇచ్చిన మొదటి తులనాత్మక

"ఏమండీ. ఆ భరించలేని నొప్పి ఏమైంది?"





మెలుపరచబడిన అమృతాంజన్ వాడడంతో.

కోమలమైన అమృతాంజన్‌ను చాలా సులభంగా రాసుకోవచ్చు.

మృదువైన అమృతాంజన్‌తో చాలా సులభంగా 'మర్దనా' వేయవచ్చు.

తలనొప్పులను, వొళ్ళు నొప్పులను, కీళ్ళ నొప్పులను, కండరాల నొప్పులను మరియు బెణుకులను మెలుపరచబడిన అమృతాంజన్ మునపటికంటే అతి త్వరితంగా వుపశమింపజేయగలదు !

మెలుపరచబడిన
అమృతాంజన్

మీ మోముపై చిరునగవులను శీఘ్రంగా- తిరిగి వికసింపజేయగలదు!

Amrutanjan Limited

OBM 149 TG R

ఉదాహరణలోనే సాహిత్యాన్ని ఖండంగా, విభాజ్యంగా చేసినారు. తూర్పు తూర్పే, పడమర పడమరే, అవి ఎన్నటికీ కలియవు అనే కిప్లింగ్ నిర్ణయాన్ని ధ్రువపరచినారు. వారి చివరి వాక్యంలోని "టోన్" గమనిస్తే, గ్రీకు నాగరకతకంటే భారతీయ నాగరకత ఎక్కువ, మంచిది, గొప్పది అనే "ధ్వని", జాత్యహంకారం కనపడతాయి. ఇందు శ్రీ శర్మగారు తులనాత్మక పరిశీలనలో ఫలించుతాయి. అని చెప్పిన సాహిత్య ఆనందం, జ్ఞానపర సాఫల్యం ఎక్కడున్నాయో తెలియడంలేదు. ఇది తులనాత్మక పరిశీలన కూడా కాదు. దీనిని విపరించడమే ఈ వ్యాసం ఇంకొక ఉద్దేశం.

* ఆగమెమ్నన్‌కు శ్రీరామునికీ పోలికలేదు. ఉంటే, అది నక్కకు నాగలోకానికున్నట్టి పోలిక అవుతుంది. రామాది పాత్రలు దేవుళ్లు. రావణాది పాత్రలు అసురులు. ఇలియడ్ పాత్రులు మానవులు. ట్రోజన్ యుద్ధం బాస్పరస్ జలసంధిపై ఆధిపత్యం కోసం యూరోపియనులకు (గ్రీకులు), ఆసియా వాసులకు (టర్కీ) జరిగిన తగాదా అనే సిద్ధాంతం వుంది. ఇంకొక అభిప్రాయం ఏమంటే, ఈ గ్రీకు "వీరులు" నిజానికి సముద్రచోరులు ("పైరేటులు") ఇట్టి తామస ఘటాల ప్రవర్తన ఎట్లుంటుందో వూహించండి.

* రాముడు రాముడూ కాదు. రావణుడు రావణుడూ కాదు, శ్రీ రామావతారం తత్వం ఒక దివ్య ప్రణాళిక ప్రకారం జరిగింది. ఫలితం జయ విజయుల శాపవిముక్తి, లోకకల్యాణం ఇలియడ్ రచనోద్దేశం, ఏగమెమ్నన్‌పై అకిలీజ్‌కు గల కోపాన్ని వర్ణించడం అంటాడు హోమరు. "మానిషాద" శ్లోకంలో శోకం వుంది, కోపం వుంది. ఇది "సబ్జ్ మేట్" అయి రామాయణమైంది. రామచరితంతో మొదలయి "సీతాయాం చరితాం మహత్"గా ముగుస్తుంది. షేక్సుపియరు నాటకం "రోమియో మరియు జూలియట్" కడపట "జూలియట్ అండ్ హర్ రోమియో" అంటాడు కవి.

* మంగళాదీని, మంగళమధ్యాని, మంగళాంతాని అనేది మన సాహిత్యదృష్టి. మనం గ్రంథాన్ని మొదటినుండి మొదలుపెట్టుతాము. పాశ్చాత్యులు కథ మధ్యనుండి మొదలుపెట్టుతారు ("రెస్‌మీడియా") ట్రోజన్ యుద్ధం, జరుగుతున్న పదియవ ఏడు తర్వాత జరిగిన సంఘటనలనుండి "ఇలియడ్" ప్రారంభమవుతుంది. పాశ్చాత్యులకు విషాదమే ఆనందం. భయ, దయల పుట్టించి మన మనస్సులలోని కశ్మలాన్ని కడిగివేయడం త్రాసద నాటక ధ్యేయమనే అరిస్టాటిల్ సిద్ధాంతం వారికి ప్రాతిపదిక. నాలుగు పీనుగులు పడివుండే "హామ్లెట్" నాటక తుదిరంగం చూడండి. "ఉదార హృదయం పగిలింది" అని హామ్లెట్ మరణాన్ని హొరేషియో వర్ణించినప్పుడు మంగళా శాసనధ్వనులు వినిపిస్తాయి. మనవారయితే హామ్లెటుకు పట్టాభిషేకం చేసివుండేవారు. డెన్మార్కు సింహాసనాసీనుడు కావలసిన హామ్లెట్ మరణించి మన హృదయ పీఠాసీనుడైనాడు.

* పాశ్చాత్యులకు నైతికత తక్కువ, భారతీయులకు నైతికత ఎక్కువ అనే "మిత్" మనవారికుంది. ఈ "మిత్"ను విస్ఫోటించుట మంచిది. తల్లినే పెండ్లాడినానని తెలిసికొన్న ఇడీపస్‌రాజు కనుగ్రుడ్లు పీకికొంటాడు. కొడుకునే పెండ్లాడినానని తెలిసికొన్న యొకాస్తే (ఇడీపస్ రాజు భార్య-తల్లి) ఆత్మహత్య చేసుకొంటుంది (చూ. సొఫోక్లిస్‌కృత "ఇడీపస్ రాజు" అనే గ్రీకుత్రాసదం) ఇదీ గ్రీకుల నైతికత. దేవి అమ్మవారినే తనకు భార్య కమ్మని ఒక "భక్తుడు" కోరడం, దానికాయమ్మ ఒప్పుకోవడంలో ఏదో తత్వార్థముందని మనం ఒప్పేసికొంటాము (చూ. విశ్వనాథకృత నవల "భ్రమరవాసిని") ఇది మన నైతికత. ఒక మోసకాని రీతి భలే ఆప్యాయంగా ("సహసా నఖంపచ....") వర్ణిస్తాడు పితామహుడు పెద్దన. ఈ తప్పువల్ల పుట్టినవాడు మనుపిత! (చూ. "మనుచరిత్ర") ఇది మన నైతికత. ఇట్టి తప్పునే చేసిన హెస్టర్‌ప్రిన్ (నాయిక)ను సంఘం నిలదీసి శిక్షిస్తుంది. ఆతతాయిగాడు డిమ్మెస్‌డేల్ పశ్చాత్తప్తుడై, తప్పు ఒప్పుకొని చస్తాడు (చూ. హాతార్న్ కృతనవల "స్కార్లెట్ లెటర్"), ఇది పాశ్చాత్యుల నైతికత. తనను మోసం చేసినవానిని టెస్ చంపి, ఉరికంబ మెక్కుతుంది. (చూ. హార్డీకృత నవల "టెస్, పవిత్ర స్త్రీ"), భారతీయులకు శ్రీరంగనీతులు చెప్పడమేకాని నైతిక, ధార్మిక ప్రవర్తన ఉందా అని! చేతులు పైకెత్తి ఇవి ధర్మంరా (చూ.

భారత సావిత్రి — మహాభారతం) అని మొత్తుకొన్న వ్యాసుని గోడు వినని ఈ భారతీ సంతతికి నైతికత ఉందా అని! "భారతీయత్ర సంతతి" అని విష్ణుపురాణం.

* బ్రతికి ఉండేవరకే వైరం. చచ్చిన తర్వాత ఏమి ప్రయోజనం? అంటాడు శ్రీరాముడు. అసలుకు ఈ "మర్యాదా మానవు"నికి రావణునిపైన ఆయన బ్రతికి వున్నప్పుడు వైర ముండినదా అని అడుగవలసివస్తుంది. శ్రీరాముడు అందరినీ క్షమిస్తాడు. రావణుని కూడా క్షమిస్తానంటాడు. అందుకే రామ రావణుల యుద్ధవర్ణన చదువుతుంటే నాకు నవ్వు వస్తూవుంటుంది. ఇదొక అసంబద్ధ సన్నివేశం (చూ. తరువాత) రామరావణులయుద్ధం రామరావణుల యుద్ధంవలెనే ఉండిందనే నిరుపమాలంకారం దీనివల్లనే ఏర్పడింది.

* ఏగమెమ్నన్, చనిపోయిన శత్రువుల మాంసం వండించి తిని ఆనందించే సన్నివేశాన్ని దేనితో పోల్చవలెనో, శ్రీరాముడు రావణ కళేబరాన్ని సంస్కారం చేసేందుకు అనుమతిచ్చిన సన్నివేశాన్ని, దేనితో పోల్చవలెనో చెప్పుతాను. మృత శత్రువుల మాంసం ఆనందంగా ఏగమెమ్నన్ ఆరగించే సన్నివేశాన్ని తమ్ముడైన దుశ్శాసనుని చంపి, వాని ఎద పగిల్చి, కారే రక్తాన్ని ఖండశర్కర కంటే, తల్లి పాలకంటే ఈ రక్తం తియ్యన అని గావుకేకలు వేసే భీమ చేష్టతో పోల్చవలెను. ఇదే భీముడు స్త్రీపర్వంలో గాంధారి అట్లెందుకు చేస్తివని అడిగితే, అట్లు నటించితినంటాడు (చూ. మహా భారతం) శ్రీరాముడు మృతశత్రువు శవమునెడ గౌరవం చూపించిన సన్నవేశాన్ని ఇలియడ్‌లోనిదే అయిన ఈ సమాన సంఘటనతో పోల్చవలెను: గ్రీకు వీరుడు ఆకిలీజ్, ట్రాయ్ వీరుడు హెక్టరును చంపుతాడు. సహజంగా ధీరోదాత్తుడైన ఆకిలీజ్ తత్కాలీన కోపం వల్ల హెక్టరు శవాన్ని ముప్పుతిప్పలు పెట్టి దానిని దాచుతాడు. హెక్టరు తండ్రి ముసలి "ప్రయం" ("ప్రియం?", రాజు ఏకాకిగా గ్రీకు స్కంధావారానికి వచ్చి, తన కొడుకు శవాన్ని కుక్కలకు వేయకుండా, తగు సంస్కారార్థం తండ్రి అయిన తనకు అప్పగించ వలసిందని ఆకిలీజును ప్రాధేయపడతాడు. అప్పటికి కోపతాపం చల్లారిన ఆకిలీజ్ వృద్ధరాజుపై దయదల్చి హెక్టరు శవాన్ని ఆయన కప్పగిస్తాడు (చూ. ఇలియడ్, ప్రక 24) ఇప్పుడు చెప్పండి ఈ తులనాత్మక పరిశీలన సమంజసంగా వుందో లేదో? ఆకిలీజ్ చర్య శ్రీరాముని చర్యతో ఏమాత్రం తీసిపోతుంది?

* తులనాత్మక పరిశీలకులు ఇది దృష్టిలో ఉంచుకోండి : రామాయణ మహాభారతాలు ఎడ్డాగాథలు (నార్వే), నైబెలెంజెన్‌లీడ్ కథ (జర్మనీ), కలెవాలా పురాణం (ఫిన్లాండు), రోలండ్ ఐతిహ్యం (ఫ్రాన్సు), ఇగోర్ గాథ (రష్యా), ఆర్థర్ చరిత్ర (ఇంగ్లండు), హయవాతాపాట (ఎర్ర ఇండియన్) వంటివి కావు. రామాయణ మహాభారతాలు ప్రతీక గ్రంథాలు. నిగూఢార్థకాలు వేదార్థ ప్రతిపాదకాలు. వేదమంత్రాలకు రూపకల్పనలు, నాటకీకరణాలు. ప్రాచీన ఇంగ్లీషు ఇతిహాసం "బ్యూవుల్ఫ్" కూడా ప్రతీక గ్రంథమే. అది మలేరియా దోమ జీవితచరిత్రకూ, తద్రోగ బీభత్సానికి ప్రతీక అనే సిద్ధాంతం కలదు.

* ఇలియడ్, ఒడిస్సే (హోమరు), ఏనియడ్ (వర్జిల్) వంటి వానికీ, రామాయణ మహాభారతాలకూ, నిర్మాణంలో ("స్ట్రక్చర్") సూక్ష్మభేదముంది. ఇలియడాదులు వీరగాథలు. జానపద గాథలు (ఫోక్‌లోర్), మౌఖిక సంప్రదాయాలు (ఓరల్ ట్రెడిషన్). అందు వీరులెలాగు ప్రవర్తించిరో వర్ణించబడి వుంటుంది. రామాయణ మహాభారతాలు మానవాస్తిత్వంలో తటస్థపడే అసంబద్ధతాలను ఎత్తిపట్టి చూపించే కూర్పులు, చిత్రవర్ణ ఫలకాలు (మొసేయిక్). మాంటేజులు. అందుకే రామాయణ మహాభారతాలు "అసంబద్ధతా ఇతిహాసాలు" (ది ఎపిక్స్ ఆఫ్ ది అబ్సర్డ్) అంటాను నేను. ఇది న్యూనతా పాదకం కాదు ఘనతా పాదకమే. వ్యాసవాల్మీకులు ఈ అసంబద్ధతాంశాలను ఆమూలాగ్రం పొందుపరుస్తూ పోయిరి. ఉదా: రాక్షసులను జయించుటకు మానవునికి తోడ్పడేవి కోతులు, పక్షులా? (రామాయణం) "అజాతశత్రువు" అనే అడ్డపేరున్న ఆయనతో పోరాడడానికి 11 అక్షౌహిణీ సైన్యం సిద్ధపడి "ధర్మక్షేత్రము"న నిలబడినారంటే ఏమనవలెను? ఇట్టివి అడుగడుగునకూ తగుల్తాయి. ఈ గ్రంథాలలోని సన్నివేశాలను ఒక్కొక్కదానిని అతి చిన్నగా విరుగగొట్టి, మిగిలిన అంశంలోని అర్థాన్ని గ్రహించవలెను. పరమాణువును అతి చిన్నదిగా విరుగగొట్టి చరమకణం (అల్టిమేట్ ఎలిమెంటరీ పార్టికల్)ను వెదుకుతారు. వేదమంత్రాల పదాలను విరుగగొట్టి ఫలించిన శబ్దం ఆధారంగా మంత్రార్థం తెలిసికోవలెనంటుంది మీమాంసా దర్శనం. రామాయణ భారతాలు "అర్థవాదాలు"గా పరిగణించవలెను. ఏది చేయరాదో ఏది చేయవలెనో, అందు జరిగినదానినిబట్టి నేర్చుకోవలెను. రామునివలె చేయుము, రావణునివలె కాదు. నలునివలె చేయుము, పుష్కరునివలె కాదు. ఇట్లుంటుంది రచనోద్దేశం. సకల మానవీయ సందర్భాలిందు వస్తాయి. అందుకే రామాయణ మహాభారతాలు ఆకృతిలో అసంబద్ధాలు. అర్థంలో గంభీరాలు. ఎంత వీరుడైనా అవతార పురుషుడైనా, కాలకబళితుడౌతాడు. రాజులు కాబేజులు అంతా పోవలసిందే.

నిరుటి హిమ సందోహాలవలె. అనిత్యాని శరీరాణి. భస్మాంతం శరీరం. నిత్యం ఏది? ధర్మం. ఈ తత్వం పాశ్చాత్యులకు సోక్రటీసు బోధించి నాడు. ఆత్మ నిత్యం అన్నాడు. మనస్సు దేన్ని ఒప్పుకుంటుందో అదే ధర్మం అన్నాడు. "రామో విగ్రహవాన్ ధర్మః" అని రామాయణం మొదలుపెట్టుతుంది. ధర్మా ర్థశ్చ కామశ్చ అని మహాభారతం ముగుస్తుంది. పాశ్చాత్యులు సోక్రటీజు తత్వాన్ని అవలంబించలేదు. పాశ్చాత్యుల భౌతిక వాదానికీ, ఆర్థిక సంపత్తికీ, ప్రపంచాధిపత్యానికీ సోక్రటీసు బోధల నిరాకరణే మూలం. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య తులనాత్మక పరిశీలనలో చాలా దూరం పయనించినాను. ఇప్పటికి సెలవు.

'త్రి'

కవిజనాశ్రయకర్త – పునఃపరిశీలనం– సందేహాలు

1988 జూలై భారతిలో డా॥ ఆర్. శేషశాస్త్రి, శ్రీ జె. సదానందంలు కలసికట్టుగా "కవిజనాశ్రయ కర్తృత్వము-పునః పరిశీలనము" వ్యాసం చివర అధోజ్ఞాపికలో "పరిశోధనాసక్తులు తమ ప్రతిక్రియను వ్యక్తం చెయ్యాల్సిందిగా విన్నపం" అంటూ సవినయంగా విసరిన సవాలుకిది ప్రతిక్రియ ఏమీకాదుగానీ ఆ వ్యాసం చదువుతూంటే బయల్దేరిన అనుమానాలని బయటపెట్టటానికి ఈ అవకాశం తీసుకుంటున్నాను. వాటి సమాధానాల కోసం జరిగే (వ్యాసం) సవరింపులవల్ల వాళ్ళన్న 'చిక్కుముడి' విడిపోవటం అంటూ జరిగితే వారూ నేనూ కూడా కృతార్థులం అయినట్లే.

1. "ఈ వేములవాడలో యశస్తిలక చంపువు కర్త సోమదేవ సూరి నిర్మించిన ఒకానొక జైనతీర్థంకరుని బసదిని గూర్చి శాసనం ఒకటి దొరుకుతూ వుంది. పూర్వం ఇదొక జైనకేంద్రం అనేది నిర్వివాదాంశం." (పుట 46) అన్నారు.

(ఎ) ఆ దొరుకుతూ వున్న శాసనం ఒకటి ఎక్కడుంది? దాని పాఠం ఏది?

(బి) 'ఒకానొక జైనతీర్థంకరుని బసదిని గూర్చి' అన్నారే! ఆ ఒకానొకడు నేమినాథుడే అని నిక్కచ్చిగా తేలిఉంటే ఢంకా బజాయించి చెప్పవచ్చుగా! 'ఒకానొక' అని తప్పించటం ఎందుకు?

(సి) నేమినాథ శబ్దాన్ని కందంలో పొదగలేకనే గణాలకోసం నేమీశ్వరుడని పద్యంలో ప్రయోగించాడా కవి అంటారా!

(డి) నేమి శబ్దానికి 'బద్దగ' అని ఏ కన్నడంలో అయినా రూపాంతరం ఉందా! నాథ శబ్దానికి ఈశ్వరశబ్దం అయితే పర్యాయమే. అయినా నేమినాధుని బసదికి బద్దగేశ్వరాలయం అంటూ ఈశ్వరాలయ ప్రశస్తి ఎలా కలిగింది? "కాలక్రమంగా బద్దగేశ్వరాలయమే భీమేశ్వరాలయమై యుండాలి"(పుట 46) అంటే అది నిశ్చయంగా నిర్ణయం కాలేదనేగా అభిప్రాయం?

2. ఇలా నాలుగు ముఖ్యమైన అనిశ్చిత విషయాలుండగా

(ఎ) పద్యంలో భీమేశ్వరు 'కరుణగల్గు – భీమసుకవినే'గా మార్పుకి గురి అయిందనీ వాస్తవపాఠం 'నేమీశ్వరు కరుణగల్గు—నే భీమకవిన్' అంటారీ జంట. ఎలా నమ్మటం!

(బి) ఈ జంట అనే వాస్తవ పాఠాలున్న ఆ వ్రాతప్రతి తంజావూరి పుస్తక భాండాగారంలోగాని మరే యితరచోట్లగాని లభించిన తాళపత్ర సంకలన గ్రంథ సంఖ్యా వివరాలేవి?

(సి) అసలా పాఠాలు మూలగ్రంథం చూసి గ్రహించారా లేక స్వంత ఊహలతో సవరణలు ప్రతిపాదిస్తున్నారా ఈ జంట!

(డి) తమ సవరణలు కాకపోతే వారన్న మార్పులకి గురి చేసింది శ్రీ జయంతివారా అంతకు పూర్వులెవరైనానా! అయితే ఆ పూర్వులెవరు? వారే మార్చారనేందు కాధారాలేవి? "జైనుడైన భీమన నుండి శైవుడైన భీమనకు కర్తృత్వం మారే సమయంలో నానారీతులుగా పాఠాల్ని మార్చటం జరిగింది" (పుట 48) అన్నారే ఆ కాలం ఏది? (ఏదో శకంలో శతాబ్దం అయినా చెప్పాలి గదా కనీసం)

3. "భీమసుకవి ఈ కృతి వ్రాసేప్పుడు జినవల్లభుడు సహాయానికి నిలిస్తే, ఇరువురికీ పెద్దవాడైన పంపడు ఈ ప్రయత్నాని కాశీస్సు లందించాడు" (పుట 47) అన్నారే–

(ఎ) కృతిని వ్రాసినవాడు 'భీమసుకవి' అన్నప్పుడు-పాఠాలు కొంత కొంత వాస్తవాలో అవాస్తవాలో అయినా ఈ ఒంటి ప్రతి పద్యాలు వేములవాడని కాదనటంలేదు గనుకా, కృతి వ్రాసిన భీమసుకవది ఆ వేములవాడ కాదని నిర్ధారణ చెయ్యబడలేదు గనుకా ఆ ఊరూ-కర్త పేరూ జత చేస్తే అయ్యేది 'వేములవాడ భీమసుకవి' అనే కదా!

(బి) బహుశః నృసింహ పురాణం వ్రాసి (పుస్తకం ఉన్నట్టు లేదు) తిట్టుకవిగా ప్రసిద్ధుడైన వేములవాడ భీమకవి కవిజనాశ్రయం వ్రాయలేదు – అని అభిప్రాయమయితే–

(సి) "ఇలాగే నిశితంగా పరిశీలిస్తే కవిజనాశ్రయాన్ని కూడా మల్లియరేచనగాని, వేములవాడ భీమకవిగాని రచించలేదని వేరొక

భీమన రచించాడని తెలియువస్తుంది." (పుట 45) అన్నదాంట్లో ఆ రెండో భీమనకి వేములవాడ ఊరికి సంబంధం ఉన్నట్లు సూటిగా లేకపోయినా, ఒంటిప్రతి 6 పద్యాల్లో అది సుస్పష్టంగానే ఉంది. కాబట్టి వేములవాడ భీమకవు లిద్దరున్నారనీ వారు వేర్వేరు కాలాలకి చెందినవారనీ, ముందువాడు కవిజనాశ్రయం వ్రాసి ప్రసిద్ధుడైతే రెండోవాడు తిట్టుకవిగా ప్రసిద్ధుడయ్యాడని చెప్పే సూటిగా తెలిసేది గదా! ఆ ఊరి దేవుడి కరుణ కలదని పద్యాల్లో ఉండటంవల్ల ఇతగాడిదీ ఆ ఊరే అనటం జరిగిందని సూచింపనూవచ్చు గదా!

(డి) జినవల్లభుడు వాచకాభరణ బిరుదం గలవాడుగా సహాయానికి వచ్చాడు సరే. అతడు పంపని తమ్ముడని శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రిగారు కుర్క్యాల శాసనపు నేపథ్యంలో విశ్లేషించి సహేతుకంగా నిర్ణయించారన్నారు బాగానే ఉంది. ఆ సోదరుల తండ్రి 'భీమపయ్య' కనుక భీమనాగ్రసుతుడని గ్రంథ సంజ్ఞాధికారం శివ పద్యంలో పంపని గూర్చిన ప్రస్తావనే అంటారు. అంటే 'భీమపయ్య' 'భీమన' అయ్యాడన్నమాట పద్యంలో.

అలా అయితే ఒంటి ప్రతి '6' పద్యాలూ చెందేది ఆ తండ్రి భీమనకేనేమో! తన కొడుకైన పంపని తానే భీమనాగ్రసుతుడని సగర్వంగా చెప్పుకోవటం అసహజమేమాత్రమూ కాదు.

ఆయనకి వేములవాడకి సంబంధం లేదనుకో అక్కరలేదు. వారు వేంగి దేశాన్నుంచే కర్ణాటం చేరారంటారు. అంతకుమును పెప్పుడో జైనబసది ఉన్న వేములవాడకి వెళ్ళనూవచ్చు అక్కడి ఆచార్యుని కరుణ పొందనూవచ్చు — ఇదే మోకాలికీ బట్టతలకీ ముడి పెట్టటం అంటే. మన జంట తెచ్చిన తంటా అంతకంటె తీసిపోయిందంటారా! కాకుంటే ఎవరీ జైనభీమన! వాదీంద్ర చూడామణికీ ఆయనకి గల సంబంధం ఏమిటి? మల్లియరేచనపేర కృతి అమర్చేట్లు చెయ్యటంలో తన వివరాలేవీ ప్రకటించుకోనివాడు మళ్ళీ తన పేరొక్కటీ ఎందుకు చెప్పుకొన్నట్లూ!

4. మార్పుకి గురి అయినా కాకపోయినా "జయంతివారు పరిశీలించిన పది కవిజనాశ్రయ ప్రతులలో ఒకదానిలో మిగతా ప్రతులలో కందే అధికంగా ఆరు పద్యాలుండి అందులో..." (పుట 44) భీమసుకవి ప్రశంస ఉంది అనేగా ఈ జంట అతన్ని కర్తగా అంగీకరించటం!

(ఎ) "ఒక్క ప్రతిలోనున్నవి అను కారణముతో వీరు (శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు) వీటిని తొలగించారు" (పుట 45) అన్నారు. శ్రీ వెంకటరావుగారు "ముఖ్యముగ ఛందోగ్రంథములం దప్పకవీయము పుట్టిన తరువాత మార్పులు చేర్పులు కూర్పులు విపరీతముగ జరిగినవి. వేయేల? అప్పకవీయము కొన్ని గ్రంథముల స్వరూపమే మార్చివైచినదన్నచో నిక తక్కిన పాఠభేదముల సంగతియే యెత్తుకొన నక్కఱలేదు. ఇంతేకాక ఆంధ్రశబ్దచింతామణి నన్నయ కంటగట్టి తన వాదమును నిలువబెట్టుకొనుటకు వేములవాడ భీమకవికి కవిజనాశ్రయ కర్తృత్వము నంటగట్టి..." (వావిళ్లవారి కవిజనాశ్రయము. ముందటి వ్యాసంలో పుట 6) అని వేములవాడ భీమ(తిట్టు)కవికి దాని కర్తృత్వము లేదనే అన్నారు. అంతవరకి జంట ఒప్పుకొన్నట్లే గదా!

(బి) అలా అయితే ఆరు పద్యాలు చేరిఉన్న ఒంటిప్రతి అప్పకవి సుకృతమని ఆ ఆరింటినీ త్రోసిపుచ్చారంటే కాదంటానికి వీరి కేమిటి ఆధారం!

5. "కవిజనాశ్రయకర్త వేములవాడ భీమ(తిట్టు)కవి కాదని బ్ర.శ్రీ వీరేశలింగము పంతులుగారును, మానవల్లి రామకృష్ణగారును, చిలుకూరి వీరభద్రరావుగారును అభిప్రాయపడియున్నారు. అదియే సత్యమని నా యభిప్రాయము. అని శ్రీ చాగంటి శేషయ్యగారు సెలవిచ్చారు" (పుట 46) అని యీ జంట సాక్ష్యం తెచ్చారు.

(ఎ) పై పెద్దల్లో ఎవరైనా తిట్టు భీమకవిని కాదని మరి ఎవరినైనా ప్రతిపాదించారేమో పరిశీలించాలి గదా!

(బి) చరిత్ర చతురానన శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు "కవిజనాశ్రయము రచించినది గోకర్ణనృపాలుడుగాని యితఁడు గాఁడు. భీమకవి నివాసస్థలము గోదావరి మండలములో గోదావరి

తీరమునను న్న వేములవాడ యను పుణ్యక్షేత్రము. (ఆంధ్రుల చరిత్రము ద్వితీయ భాగము పుట 257) అని సూచించారు.

(సి) గోకర్ణ నృపాలుడు కర్త అయితే దాన్ని అప్పకవి వేములవాడ భీమకవికి సంక్రమింపజేసాడని నమ్మే పక్షంలో ఒంటి ప్రతిలోని '6' పద్యాలూ చేర్పులైతే కావచ్చునేమో!

(డి) ఆ ఆరు పద్యాలే ఆధారంగా మరో 'భీమసుకవి' నామక కర్తను శైవతత్త్వం గలవాణ్ణి కాదని జైనతత్త్వం గలవాణ్ణి పుట్టించారు గదా ఈ జంట!

6. "మరల కడపటి మల్లియరేచన సుకవిజనాశ్రయుడీ ఛందంబుఁ జెప్పె జనులకుఁ దెలియన్ – అని ప్రథమపురుషతోనే ఈ గ్రంథం ముగిసింది. ఈ వైవిధ్యం ఎందువల్ల? కవి వేరొకడు కావడంవల్లే" (పుట 45) అన్నారీ జంట. మరి "సారమతిం గవీంద్రులు.... నన్నయభట్టు తెనుంగున న్మహాభారత సంహితా రచన బంధురుఁడయ్యె జగద్ధితమ్ముగన్" అన్నట్లుగా వ్రాయబడిందేమో!

7. తెలుగులో జైన సంప్రదాయాన్ని తెలిపే గ్రంథాల్లో ఇది ఒకటి అన్న అభిప్రాయం సరికాదు...ఛందస్సులో జైనఛందస్సూ వైదికఛందస్సు అని వేరుగా ఉండవు" (పుట 48-49) అన్నారు. కాని చ. చ. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు "కవిజనాశ్రయములో నాలుగాశ్వాసములును జైనకావ్యధర్మముల ననుసరించి వాగ్దేవతా స్తుతితోఁ బ్రారంభింపఁబడినవి" (ఆం. చ. ద్వి. భా. పుట 164) అని గుర్తించారే. అసలీ జంట కర్ణాటంలో పరిశోధన – ఫలవృక్షపు టంటు తెచ్చి ఆంధ్రలో నాటాలనే తాపత్రయం అంతటా అనుమానాల పుట్టల్నే చవిచూస్తోంది.

ఇంక సందేహాలని తవ్వుకోవటం వదిలేసి చ. చ. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారందించిన వివరాలనిస్తాను పరిశీలనకి పనికిరావచ్చు. "భీమన సోదరుఁడైన గోకర్ణుఁడు వాగీంద్ర చూడామణి యను జైన సమయాచార్యుని శిష్యుఁడు. వర్ధమాన పురాధీశ్వరుఁడు. ఇతఁడు భీమకవికిఁ గర్తృత్వ మారోపింపఁబడిన కవిజనాశ్రయమను ఛందో గ్రంథమును రచించి కళ్యాణపురాధీశ్వరుండైన చాళుక్య జగదేకమల్లుని సేనాపతియగు రేచభూపాలున కంకితము చేసెను. ఈ రేచనికిఁ గవిజనాశ్రయుఁడనియు, గోకర్ణునకు శ్రావకాభరణాంకుఁడనియు బిరుద నామములు గలవు......ఈ గోకర్ణుని గురువైన వాగీంద్ర చూడామణి తన పేరిటి లక్షణగ్రంథమును, ఆదిపురాణమును ఆంధ్రభాషలోవి రచించినటులఁ దెలియుచున్నది." (ఆం. చ. ద్వి. భా. పుట 164)

నేనాదినే చెప్పాను. ఇది ఆ జంట పరిశోధకుల వ్యాసాని కేమీ ప్రతిక్రియ కాదు. ఇవి పట్టువడవలసిన సత్యాలకి ప్రయత్నించే వారినందుకు ప్రేరేపించి ప్రోత్సాహపరచే సందేహాలు. ఆ సత్యాలా ముత్యాలతో నిత్యాంతసూత్రం ఏర్పడి ఆంధ్ర సాహిత్యవధూటి మెడలో ముత్తెపుదండ అలంకారం కావాలన్నదే ఆశయం.

—జొన్నవిత్తుల రామకృష్ణశర్మ

మినీ కవిత

'భారతి' సెప్టెంబరు 88 సంచికలో శ్రీ రావి రంగారావు వ్రాసిన 'చిరంజీవి మినీకవిత' వ్యాసం చదివి యీ నాలుగు మాటలు వ్రాస్తున్నాను.

మినీకవిత చిరంజీవిగా ఉండాలని ఆశించటంలోగాని, ఉంటుందని నమ్మటంలోగాని భిన్నాభిప్రాయానికి తావులేదు. మినీ కవితను విప్లవమని అన్నవారి ఉద్దేశాలను ఊహిస్తూ అది ప్రక్రియలో 'మార్పు' అనటం బాగానే ఉందికాని, "విప్లవ కవితోద్యమంలో ఒక ముఖ్యభాగంగా మినీ కవితను 'విప్లవ మినీకవిత' 'మినీకవితా విప్లవం' అని అంటున్నారని అనుకోనకూడదా?" అని ఊహించటం మాత్రం విడ్డూరంగా ఉంది. ఇదివరలో మినీకవితకు లక్షణ నిర్దేశం చేయటానికి ప్రయత్నించిన రంగారావుగారు దాని స్వరూప స్వభావాలను మాత్రమే పరామర్శించారుగాని, విషయాన్ని నిర్దేశించలేదు. ఇప్పుడు దాన్ని 'విప్లవ కవితోద్యమంలో ఒక ముఖ్యభాగంగా' కొందరు భావించారని ఊహించటం ఆశ్చర్యంగా ఉంది. 'మినీకవితా విప్లవం' అంటే అది కవితా ప్రక్రియలలో విప్లవమేనని ఎందరో నిర్దిష్టంగా స్పష్టపరిచారు కనుక రంగారావుగారి రెండో ఊహ సబబైనదికాదు.

సాహిత్య ప్రచారానికి ఈనాడు నిస్సందేహంగా పత్రికలే ప్రధానాధారం అయినా 'దినపత్రిక అనుబంధాలే' ఒక సాహిత్య ప్రక్రియ అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయని అనుకోవటం అర్థంలేనిమాట. రంగారావుగారు దినపత్రికలనే కొలబద్దలుగా ఎందుకు తీసుకున్నారో అర్థం కావటంలేదు. 'దినపత్రికల అనుబంధాల్లో...మినీకవిత గురించి చర్చలు, వ్యాసాలు కనిపించటం ఆగిపోయినంత మాత్రాన' 'దినపత్రికల్లో మినీ కవితలు రావటం దాదాపు లేదనే చెప్పాలి' అంటూ వారు దినపత్రికలకే ప్రాధాన్యమిచ్చారు. 1986 జనవరినుండి జూన్ వరకు గల ఆరునెలల కాలంలో 4దిన, 5వార, 9మాస, ఒక త్రైమాసిక మొత్తం 19 పత్రికలలో 404 మినీకవితలు ప్రచురించబడగా అందులో దినపత్రికలలో వచ్చినవి కేవలం 62 మాత్రమే అనగా 15.34 శాతమే. కాబట్టి దినపత్రికలకే అధిక ప్రాధాన్యత

నివ్వటం మంచిది కాదు. మినీకవితలపై చర్చలు, వ్యాసాలు రావటం లేదనటం కూడ సరికాదు 'ఎక్స్‌రే' పత్రిక 1987లో ఒక మినీకవితా వ్యాసాల ప్రత్యేక సంచికను ప్రచురించింది ఆదే పత్రిక 1985లో కూడా ఒక సంచికలో ఈ వ్యాసాలు వచ్చాయి 'భారతి' మినీకవితలను వాటిపై వ్యాసాలను ప్రచురిస్తూనే ఉంది ఇతర పత్రికలలో కూడా మినీ కవితలు, వాటిపై వ్యాసాలు వస్తూనేఉన్నాయి ఏ కవితా ప్రక్రియకైనా ప్రారంభ, ఉచ్ఛ, క్షీణదశలు సహజమే కదా! ఒక కవితా ప్రక్రియ ఉచ్ఛస్థితి ఎన్నాళ్ళు కొనసాగుతుందో నిర్ణయించవలసినది కాలమే. మినీ కవితాయుగానికి ఇంకా క్షీణదశ ప్రారంభం కాలేదనే నేను భావిస్తున్నాను

కొన్ని పత్రికలు మినీ కవితలకు తగినంత స్థానం ఇవ్వటం లేదని రంగారావుగారు బాధపడటంలో కూడా అర్థంలేదు. ఎన్నో పత్రికలు ఈనాడు మినీకవితలను ఆదరిస్తున్నాయి పైన పేర్కొన్న 19 పత్రికలలో ప్రచురింపబడిన 1149 కవితలలో మినీకవితల శాతం 85 16 ఇది గణనీయమైనదే. ఆ పత్రికలలో మినీకవితను ఆ ఆరు నెలల కాలంలో ప్రచురించని పత్రిక కేవలం ఒకటి మాత్రమే.

తమ వ్యాసంలో రంగారావుగారు "మినీకవిత రాసే కవి తన పద్యాల్ని ఎంత జాగ్రత్తగా ఎంచుకుంటాడో ఎంత 'నవ్యబంధుర శైలి'లో బిగిస్తాడో" వివరించటానికి 10వ తరగతి పరీక్షాపత్రాలు ముందే వెల్లడైన విషయంపై తాను, మరొక యువకవి వ్రాసిన కవితలను గూర్చి వివరించారు. ఇందులో ఒక వచన కవిత ఒక మినీ కవితగా ఎలా తయారైందో చూపించారు. నిజం చెప్పాలంటే అది ఒక యువకవి కవితా రచనాభ్యాసము, సాధన కవితోత్పత్తి హేతువులలో అభ్యాసము కూడ ఒకటైనప్పటికీ, తగినంత శక్తి, నిపుణతలు లేనప్పుడు అభ్యాసమే ఉత్తమకవితను సృజించలేదు తనకే 'అంతగా తృప్తి కలిగించని' తాను వ్రాసిన కవితలోని రెండు పంక్తులను చదివినప్పుడు ఒక యువకవి తనకు తట్టిన 'ఫ్లాష్'తో విశేషాభ్యాసంతో రూపొందించిన మినీకవితలో కవితాశిల్పం, చక్కని బిగింపు ఉన్నాయని అంటూ రంగారావుగారు దానికి దినపత్రికా సంపాదకులు తగిన గుర్తింపు ఇవ్వలేదని వేదన చెందారు రంగారావుగారు పేర్కొన్న ఆ మినీకవిత — 'పెళ్ళికి ముందురోజే కన్యాత్వాన్ని కోల్పోయింది పదో తరగతి పెళ్ళికూతురు' — కవితకు గల వివిధ, ఉత్తమ నిర్వచనాలలో, దేనినీ గుర్తుకు తెప్పించదు. రంగారావుగారు చెప్పే 'నవ్యబంధురశైలి' కూడ ఆ కవితలో నాకు కన్పించలేదు దానిని ఒకే దినపత్రిక ఉత్తరాల శీర్షికలో ప్రచురించింది అంటే అది దానికి తగిన గుర్తింపే అని నా అభిప్రాయం

పదో తరగతి పరీక్షాపత్రం పరీక్షకు ముందే వెల్లడి కావటం ప్రభుత్వ యంత్రాంగ వైఫల్యానికి అసమర్థతకు తార్కాణం. దాని వలన పరీక్ష వాయిదాపడటం విద్యార్థులలో అసంతృప్తిని, నిర్వేదాన్ని కలిగిస్తుంది. కవి యీ విషయాల నన్నిటిని మనసులో ఉంచుకొని దానిపై తన ప్రతిస్పందనను కవితలో చూపించాలి అది మినీకవిత కావచ్చు, పద్యం కావచ్చు, వచనకవిత కావచ్చు ఏదైనా పాఠకుని హృదయాన్ని సూటిగా తాకాలి పై మినీకవిత ఆ సంఘటనను ఆలంకారికంగా చూపించిందేకాని అందులో పరిపక్వత, రసానుభూతి తగినంతగా లేవు కనుకనే అది ఉత్తరాల శీర్షికకే పరిమితమైంది. అయితే, ఇంతకంటె పేలవమైన ఎన్నో మినీకవితలను పత్రికలు ఆదరించి ప్రముఖంగానే ప్రచురిస్తున్న విషయాన్ని గుర్తిస్తే పై మినీ కవితకు కొంత అనాదరణే జరిగిందని అనిపించక మానదు.

రంగారావుగారు తమ వ్యాసంలో కవిత్వ విమర్శకుల్ని ఒరిజినల్, డూప్లికేటు అంటూ విభాగించటం న్యాయంగా లేదు. దానికి వారిచ్చిన నిర్వచనాలు కూడ తృప్తిగాలేవు. పైగా ఇప్పుడు ఒరిజినల్ విమర్శకులు "ముగ్గురో నలుగురో" ఉన్నారని అస్పష్టంగా అనటం ఈ విషయంలో వారి అయోమయస్థితిని సూచిస్తోంది అంటే వేళ్ళమీద లెక్కించదగిన ఆ ఒరిజినల్ విమర్శకుల్ని కూడా వారు స్పష్టంగా గుర్తించలేకపోతున్నారన్నమాట ఇక, మినీకవితలు వ్రాస్తున్నవారు వచన, పద్యకవితల్ని వ్రాయటం చేతకానివారని అనుకోకూడదని, పద్య, వచన, గేయ కవిత్వం వ్రాయగలిగినవారు మినీకవితలు వ్రాయలేకపోతున్నారని వ్రాయటం సాహసం మినీ కవితలపై గల అభిమానం ఇలా వెర్రితలలు వేయకుండా ఉంటే మంచిది.

—సూర్యదేవర రవికుమార్

గ్రంథ విమర్శలు

సిప్రాలి (శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం-14)

[కూర్పు చలసాని ప్రసాద్, వెల రు 15-00 లు. ప్రతులకు (1)సి యస్ ఆర్ ప్రసాద్, సి 1882, ఎస్ వి యస్ కాలనీ, గుంటూరు (2) నవోదయ పబ్లిషర్స్; అరుణా పబ్లిషింగ్ హౌస్, న్యూ స్టూడెంట్స్ బుక్ సెంటర్, జయంతి పబ్లికేషన్స్, ఏలూరు రోడ్డు, విజయవాడ]

శ్రీశ్రీ రచనలను ప్రచురించే వరుసక్రమంలో ఇది పధ్నాల్గవది. ఇది వి ర.సం వారి ప్రచురణ అంటే అంతకుముందు అన్ని సంపుటాలు వచ్చినవని అర్థం కాదు. వారు ఒక ప్రణాళిక ప్రకారం అచ్చు వేస్తున్నారనుకుంటాను ఈ సంపుటిని సంపుటీకరించినవారు చలసాని ప్రసాద్‌గారు ఆయన ఏ కార్యక్రమం తలపెట్టినా చాలా సక్సెస్ ఫుల్‌గా చేస్తారు. రా. వి శాస్త్రీయంగాని, శ్రీశ్రీ వ్యాసాల సంపుటి గాని, అనంతంగాని ఇందుకు ఉదాహరణలే. సిరిసిరిమువ్వలు, ప్రాస క్రీడలు, లిమరుక్కులు కలిసి సంక్షిప్తీకరణలో సి ప్రా. లి అయింది. 1946 ఆ ప్రాంతాల మొదలైన ఈ అధిక్షేపాత్మక కవిత్వరచన శ్రీశ్రీ అనంతరకాలంలో కూడా సాగిస్తూనే వచ్చాడు

అధిక్షేప శతకాలు పూర్వం చాలా వచ్చినై. ఈ కాలంలోనూ చెదురు మదురుగా వస్తూనే ఉన్నై. వాటికి శ్రీశ్రీ అధిక్షేప రచనలకూ వ్యత్యాసం చాలా ఉంది ఇందులో సమకాలీన రాజకీయాలపైన, కవిత్వాది ఇతర విషయాలపైన వ్యంగ్యం, హాస్యం బాగా చోటు చేసుకున్నై. అంతేకాదు, వైయక్తిక కోపం హద్దులు దాటినప్పుడు సహనాన్ని కోల్పోయి కవిత్వేతర పదార్థాన్ని కొంత ఇందులో చేర్చటం కూడా జరిగింది.

సమకాలీన రాజకీయాలమీద, వ్యక్తులమీద హాస్యధోరణితో కూడిన ఛలోక్తులు, చురకలు ఈ కవితల్లో కనబడతై. గొప్ప రచనలు చేసే శక్తిలేనప్పుడు (శ్రీశ్రీ మాటల్లోనే) వాకింత చెత్త చేర్చినప్పటికీ, ఆ చెత్తలోనే శ్రీశ్రీ మార్కు కవిత్వధోరణి కనబడుతూనే ఉంటుంది

కంద పద్యాలన్నీ కవులకు, రచయితలకు, రాజకీయాలకు చెందినవే. కందపద్య రచనలో పాటించిన సంప్రదాయం, సంపాదక సాక్షాత్కారం, ఇష్టదేవతా ప్రార్థన మొదలైన శీర్షికలు వ్యంగ్యంతో కూడుకున్నవే ఆయన చెత్తగా భావించినా మనస్సులో మాత్రం కవితాస్పృహ లేకపోలేదు.

అందంగా మధురసని
ష్యందంగా, పవిత్ర హృదయ సంస్పందం..
కం దాలొక వంద దీచిం
చిందికి మనసయ్యె నాకు సిరిసిరి మువ్వా!

అనే పద్యంలో శ్రీశ్రీ కవిత్వ స్పృహ కనబడుతునే ఉంది ప్రాస క్రీడలు, లిమరుక్కులను గురించి కొత్తగా ఇవ్వాళ చెప్పవలసిందేముంది?

ఈ సంపుటికి చలసాని ప్రసాద్‌గారి పీఠిక, వివరణలు చదువరికి బాగా ఉపకరిస్తై. ప్రసాద్‌గారు భావించినట్టు ఈ సంపుటి విప్లవ సాహిత్యాన్ని సార్థకం చెయ్యటానికి ఎంతవరకూ తోడ్పడుతుందనేది ఆలోచనీయాంశం.

—టి. యల్. కాంతారావు

ప్రేమ్‌చంద్ సాహిత్య వ్యాసాలు

[వెల రూ. 7/- ప్రతులకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001, విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ, వగైరా నగరాలు]

'సత్యాన్ని వ్యక్తీకరించుచూ భాష ప్రౌఢంగానూ సుందరంగానూ వుండి మనస్సుమీద, మేధస్సుమీద ప్రభావం చూపేది మాత్రమే సాహిత్యం'—

ఈ నిర్వచనాన్ని అనుసరించి ప్రేమ్‌చంద్ ఆధునిక రచయితలకు ఒక చక్కని శ్రుతిపాఠం చెప్పినట్టు గ్రహించాలి ఉన్నది ఉన్నట్టు చెప్పడానికి వెనుదీయరాదు అభూత కల్పనల జోలికి వెళ్ళరాదు. అయితే ఆ చెప్పేది మాత్రం అవధిమించి పోకూడదు. ఈ అభిప్రాయం లౌకిక సాహిత్యం అవతరించిననాడే'

సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్
న బ్రూయాత్ సత్యమప్రియం - అని ఒక శ్రుతిహిత వాక్యసంపుటితో వెలువడింది సత్యమునే చెప్పాలి అది విన సొంపుగా ఉండాలి చెప్పే సత్యం కటువుగా ఉండరాదు—

ఈ సాహిత్య నిర్వచనం, రచయితల కర్తవ్యం—సునిశితమూ హృదయంగమమూ అయిన వాగ్ధోరణితో ప్రేమచంద్రుడు చెప్పిన వ్యాసాల సంపుటి నేటి రచయితలు (కొందరు) పారాయణగ్రంథముగా ఉపయోగించుకోవాలని నా సలహా.

కథావాఙ్మయం పాశ్చాత్యుల సృష్టికన్న ముందుగానే మన దేశంలో ఉత్పన్నమయిందని వినుకవి

నవల అనేది ఆరంభంలో సముద్రాంతరరీతిని వచ్చినా క్రమక్రమంగా వైరితలలు వేస్తూ 'కాపీ' కొట్టే పద్ధతిలో కాక స్వర పద్ధతిని వస్తూందని నా ఉద్దేశం అపరాధ పరిశోధక నవలలయిన 'వాడే వీడు', 'నేనే' 'కాటారాయి' అనే మూడూ యీనాటికీ నేను మరిచిపోలేను.

హిందీకి జాతీయభాషా నాయికగా పట్టాభిషేకం చేస్తే దాని ప్రభావముతో భారతీయ భాషల వాఙ్మయానికి విశ్వజనీనత కలిగించ వచ్చు అని యీయన అనడం నాకు నచ్చలేదు. అన్నిటికీ పునాదిగా చెప్పదగినదీ పాశ్చాత్యుల మన్ననలను కూడా పొందినదీ అయిన సంస్కృతమును జాతీయభాషగా ఏల చేయకూడదు? అని నా ప్రశ్న.

ప్రేమ్‌చంద్ చెప్పినట్టే 'భాషా ప్రాతిపదికపై' రాష్ట్రాల నిర్మాణం జరిగి దేశం భాషా దురభిమాన హాలాహలానికి చుట్టుకు పోయిందని గట్టిగా చెప్పేవారిలో నేనొకడను.

ఈ గ్రంథంలో అందరూ స్త్రీలూ పురుషులూ యువతులూ యువకులూ చీకాకుతో కాక చిత్తశుద్ధిగా చదివి అర్థం చేసుకోవలసే రచన.

'సినిమాలను గూర్చి —— ప్రేమ్‌చంద్ చెప్పినది. ఇంత నిస్సంకోచంగా వెలువడిన విమర్శ ఇది ఒక్కటే' అని చెప్పవచ్చు దాని వాక్యాలు నేను ఎత్తిచూపడం అనవసరం

సినిమాలు తీసేవారూ చూసేవారూ తప్పక చదవాలి

'విశాలాంధ్ర'వారు కాలోచితమైన గ్రంథం వెలుగులోకి తెచ్చినందుకు మనసా అభినందిస్తున్నాను.

శ్రీమత్సుందరకాండము

[రచయిత శ్రీ నరహరి నరసింహారావు, పాత గుంటూరు-గుంటూరు, వెల తెలుపలేదు]

ఆదికవి చెప్పిన రామాయణం వేదానికి కావ్యరూపం, వేద వేద్యుడైన విష్ణువు రాముడని- తత్త్వవేత్తల మాట మానవ జీవితమునకు పరిశుద్ధమైన బంగారుబాట వేసినది రామాయణం కథానాయకుడు రాముడు ఆదర్శ మానవుడు కాగా పురుషోత్తముడుగా ప్రసిద్ధుడయాడు ఆ పురుషోత్తముని చరిత్రలో సుందరకాండ - నీతి నియమాల ననుసరించి కోరే కోర్కెలను పారాయణ పద్ధతిని పఠిస్తే సంతృప్తిగా నెరవేరుస్తుందని అనుభవజ్ఞుల తీర్పు. అయితే 68 సర్గలు కల ఆ సంస్కృత కావ్యం చదవడం సాధ్యంకాక ఏమి చెయ్యాలి అనేవారికి తేలికగా చదువుకొని ఆశించిన ఫలితం పొందవచ్చుననే సత్సంకల్పముతో శ్రీ నరసింహారావు వాల్మీకి శ్లోకాలను ముందుంచుకుని ముఖ్యమైన కథాభాగమును సామాన్యమైన వాడుక భాషలో వచనరూపాన వెలయించారు అక్కడక్కడ మూలశ్లోకాలు ఇచ్చారు

సుందరకాండకు ఆ మహిమ ఆంజనేయుడు ప్రధానపాత్రగా కలిగింది. ఆ ప్రకృతి పురుషుల యోగక్షేమాలకు సూత్రధారుడు మారుతి ఆయన ఏకపాద రుద్రాంశ సంభూతుడు కాబట్టి సుందరకాండకు హనుమన్మహిమతో విశిష్టమైన ప్రభావం కలిగిందని గ్రహించాలి.

ఇందున్న హనుమన్మంగళాష్టకం కూడా పఠనీయమే

అందరూ పారాయణ గ్రంథముగా వినియోగించుకోదగిన కృతి

మహాభారతము

[ప్రవచనకర్త శ్రీ కంబాలూరు వేంకటేశ ఆచార్య, ప్రతులకు శ్రీవ్యాస రాజమఠము, పాత మునిసిపల్ ఆఫీసువీధి, కర్నూలు వెల రూ. 2-00]

భారతం పంచమ వేదముగా ప్రసిద్ధం మానవుడు నిత్య జీవితం దిద్దుకునే పద్ధతిని పరిశుద్ధముగా చెప్పేది భారతం. కాని ఆస్తి కోసం పినతండ్రి పెదతండ్రి కొడుకులు మూకుమ్మడిగా కొట్టుకు చావడం - ధర్మరాజు అంతటివాడు జూదం ఆడడం, నిండుసభలో కులకాంతకి అవమానం - ఇలాటివాటివల్ల దానిని ఏమనాలో తెలియదని ఒక వాదం ఉంది. ఏది యెలా ఉన్నా కృష్ణుడు పరమ పురుషుడుగా గ్రహించవలసి ఉంటుంది ఆయన ఆడించే పావులు అందలి పాత్రలు ఆ గంభీరార్థ సంపదను పాఠకులకు పంచిపెట్టడానికి శ్రీ వేంకటేశ ఆచార్య ఆచార్యపీఠం అధిరోహించి ప్రవచించిన ప్రథమపాఠం ఈ చిన్నికృతి

జూదంలో ఓడి కారడవిలో కాలక్షేపం చేస్తూన్న ధర్మజుణ్ణి చూడ్డానికి వచ్చిన కృష్ణునిమాట-

'నైతత్ కృచ్ఛ్రమనుప్రాప్తో భవాన్ స్యాద్వసుధాధిప!
(యద్యహం ద్వారకాయాంస్యాం రాజన్! సన్నిహితఃపురా'-
రాజా! నేను నీకు దగ్గరగా ద్వారకలో ఉంటే నీకీ కష్టదశ పట్టకపోను.

'అసాన్నిధ్యం తుకౌంతేయ! మమాన రేష్వభూత్తదా
యేనేదం వ్యసనం ప్రాప్తాభవంతో ద్యూతకారితమ్'

అప్పుడు నేను ఆనర్తదేశంలో లేకపోవడంతోనే జూదంవల్ల మీకీ దుఃఖం ప్రాప్తించింది - దీనిలో గూఢార్థం ఆచార్య ప్రకటించిన తీరు ధర్మరాజా! నీవు పాచికలు వేసేవేళ నన్ను స్మరణ చేసిఉంటే నవ ద్వారములతో కూడుకొన్న నీ దేహనగరంలో నా సాన్నిధ్యం ఉండేది. నీవావిధంగా నన్ను స్మరించలేదు. అందుకే యీ దుఃఖం ప్రాప్తించింది.

ద్రౌపది ఆపత్కాలంలో నన్ను స్మరించగా అక్షయ వస్త్ర ప్రదానంచేసి ఆమెను కాపాడేను.

ద్వారక అంటే తొమ్మిది ద్వారాలు(రంధ్రాలు) కల దేహమే నగరం - అని అన్నాడు.

ఇలాగే మరికొన్ని శ్లోకాల అంతర్యం వెల్లడించారు. ఇలాటి గ్రంథాలు వెలువడితే ఆ వాఙ్మయంపై సర్వులకూ సమ్మాన్యభావం కలుగుతుంది. ఆచార్య - యీ క్లిష్ట పరిశ్రమలో ఆంధ్ర వాఙ్మయానికి ఒక దివ్యాలంకారం త్వరగా సంఘటిస్తారని ఆశిస్తాను.

శ్రీ అరుణాచల స్తుతిపంచకము

[తమిళం: మహర్షి శ్రీరమణులు, తెనుగు సేత: శ్రీరామచంద్ర కౌండిన్య వెల: 5 రూ. ప్రతులకు: శ్రీరమణ అధ్యయన కేంద్రం, పవరుపేట, ఏలూరు 534 002, పశ్చిమ గోదావరి జిల్లా]

తమిళంలో మహర్షి పలికినది అరుణాచలాంతర్యం చెప్తుంది. శివుడే అరుణాచలరూపాన వెలసినవాడని స్కాందపురాణం చెప్తుంది. దాని స్వరూప స్వభావాలను స్కందావతరుడైన రమణమహర్షి వ్యాఖ్యానించగా దానికి తెలుగుచేసి శ్రీరామచంద్ర కౌండిన్యులు భక్తులకు ఈశ్వర ప్రసాద ప్రదానం చేశారని నిరాఘటంగా చెప్పవచ్చు. ఆ అరుణాచలమే తిరువణ్ణామలై' అని తమిళ నామం.

దీనిలో అక్కడక్కడ మహర్షియే తెలుగున చెప్పిన పద్యాలున్నా ఉన్నాయి. ముఖ్యంగా ఈ కృతిలో చదవవలసినది

'అరుణాచల అక్షరమణమాల' — 'మణి' అని ఉండాలను కుంటాను. ఇది గేయరూపాన ఉన్నది.

'వేళ్లు వారునహమ్ము వెడల ద్రోతువు నిన్ను
స్మరియించినంతనే అరుణాచలా' - ఆరంభం.
'వాతాహతుల చిక్కువడ్డ నౌకకు నీవ
కర్ణధారివి కావ అరుణాచలా!—

సులభంగానూ అర్థమౌతుంది. ఒక్కొక్కచోట కాస్త ఆలోచించాలి. శ్రీ మహర్షి మాటలలో... అనే శీర్షికతో ఉన్న విషయం చదివితే రమణుడెవరో అరుణాచలం ఏమో అర్థం అవుతుంది.

గీతామృతసారము

[మూలం: భగవద్గీత, తెలుగు పద్యం: శ్రీ ఆదిపూడి సోమనాథరావు. వెల రు. 10/- ప్రతులకు: శ్రీరమణ అధ్యయన కేంద్రం, పవరుపేట, ఏలూరు 534 002, పశ్చిమ గోదావరి జిల్లా]

భగవద్గీతలో ముఖ్యంగా తెలుసుకోవలసేవి - రమణ మహర్షి సంకలనంచేసి వివరించారు. వాటికి ఆదిపూడివారి తెనుగు పద్యాలు

'ఈశ్వర సర్వభూతానాం
హృద్దేశేఽర్జున! తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని
యంత్రారూఢాని మాయయా'-
'అఖిలభూత నియామకుడైన యట్టి
ఈశ్వరుం డెల్ల దేహుల హృదయమందు
నుండి ప్రాణుల త్రిప్పుచునున్నవాడు
వ్యక్తపడకుండు తన మహాశక్తిచేత'

నాల్గవ పాదం కార్యకారణ సంబంధాన్ని వ్యక్తంచేసే వ్యాఖ్య ఆదిపూడివారి కవితారీతి అట్టిది. ఆనాడు కాళిదాస కావ్యానువాదాలలో సోమనాథరావుగారి అనువాదం అగ్రగణ్యముగా వన్నె కెక్కింది.

దీనిలో రెండవభాగం 'భగవాన్ గీతాహృదయం'- ప్రశ్నోత్తర పద్ధతిలో ఆత్మతత్వ ప్రకాశనం అది. దానిని చదివితే మరి తాత్విక గ్రంథపఠనం వేరే అక్కరలేదని నా అభిప్రాయం.

ఒక అవతార పురుషుని వాక్కును ఈ విధంగా పుస్తక రూపాన ఆ దివ్యపురుషుడి చక్కని చిత్రము వెలువరించే అధ్యయన కేంద్రంవారు అభినందనీయులు.

అధర మందారం

[రచన: శ్రీ విజయసారథి, ప్రతులకు: (1) శ్రావ్య పబ్లికేషన్స్, 6-8-596/54/1, వెంకటరమణా కాలని, హైదరాబాద్-500 004; (2) డి. సుదర్శన్, 20-వార్డ్ నెం. 15, గెటర్‌పరామలంచ రోడ్, ఖరగ్‌పూర్-721 301, వెల: రు. 2/-]

నీలువైన పగడాలు
నీ పెదవులు
వాటిని కౌగలించుకున్న
నా పెదవులు
కలల పగోడాలు'-

శరీరం ఒక ఫ్లాస్క్. ఆ ప్రియురాలు అమృత సౌందర్య ఫ్లాష్. ఆ ఫ్లాస్క్‌నుంచి ఒంపిన పాలని ప్రియురాలి పెదవుల సాన్నిధ్యంతో తాపీగా హేపీగా తాగిన విజయసారథి అదృష్టవంతుడు.

—యామిజాల పద్మనాభస్వామి

నల్ల వజ్రం

(సింగరేణి నవల)

[యస్. ఆర్. పవన్‌కుమార్, అబంపి పబ్లికేషన్స్, గోదావరి ఖని, పది రూపాయలు]

సింగరేణి బొగ్గు గనులలోని కార్మికుల జీవితం, జీవన విధానం, పని, దాని విధానం, అందులోని రాజకీయాలు, ఘర్షణలు, మురా తత్వాలు. అధికారుల అధికారాలు, అమాయకుల అగచాట్లు అన్నీ చిత్రీకరించారు రచయిత. కథను శంకరయ్య పాత్రద్వారా నడిపించి, అతనిచుట్టూ తిప్పడం జరిగింది. తన బదిలీకోసం పడిన అగచాట్లలో చివరికి మేనేజరుకు రక్తదానమట్టం కూడా వుంటుంది. ఫలితం శూన్య మవడంతో అతను కార్మికశక్తిగా మారుతాడు. ఫలితం సమ్మెలు, బంద్‌లు - దొమ్మీలు...లాటీలు...జైళ్లు వగైరా!

నవలలోని సంభాషణలు తెలంగాణా తెలుగులో వున్నాయి. కథనం, వర్ణనయూ కూడా కొన్నిచోట్ల తెలంగాణా తెలుగులోనే వున్నాయి. ఈ విషయంలో రచయిత కొంత శ్రద్ధచూపి, తెలంగాణా భాష సంభాషణలవరకే పరిమితంచేస్తే బాగుండుండేది.

అసలు - కార్మికుడనేవాడు విడిగా ఎక్కడాలేడు. ఒకడికి యజమాని అయినవాడికి మరొకడు యజమాని వుంటాడు. ప్రతివ్యక్తి మరోవ్యక్తికి బాధ్యుడే అందరూ మేడ మెట్లవంటివారే! ఎటొచ్చీ కొన్ని క్రిందిమెట్లు — మరికొన్ని పైని మెట్లు — కానీ అన్నీ మెట్లే కదా!

భూపతిరాజు

తాజ్‌మహల్

(బహుమతి పొందిన కథల సంపుటి)

[వల్లూరు శివప్రసాద్, గౌతమి పబ్లికేషన్స్, గుంటూరు, పదిహేను రూపాయలు.]

ఈ పుస్తకం పేరుతోపాటు దాంట్లో పొందుపరచిన కథల ప్రత్యేకతను కూడా ప్రకాశకులు అట్టమీదే పొందుపరచారు. పరుచూరి రాజారామ్ రచయితను "బాధ్యత నెరిగిన కథకుడు"గా తన ముందుమాటలో ప్రశంసించారు. ఇందులో వున్న తొమ్మిది కథలూ వివిధ కాలాల్లో వివిధ పత్రికలలో వివిధ విధాల బహుమతులు సంపాదించుకున్నాయి. ఆ వివరాలు ప్రతి కథముందూ వున్నాయి.

కథలు బహుమతులు పొందివుండడం, పరిచయ వాక్యాలు పెద్దవారు వ్రాయడంవంటి వాటివల్ల ఆ పుస్తకం ముఖవిలువ పెరుగు తుంది. వీటివల్ల సమీక్షకునికి కాస్త యిబ్బంది(!)

ఇందులో కథలన్నీ మానవనైజం మీద, వాస్తవాల నాధారం చేసుకుని అల్లబడ్డాయి. కథనం నేరుగాను, చురుగ్గాను, కుదురుగానూ వుండడంవల్ల చదువరిని విసిగించదు.

తాజ్‌మహల్ కథలో తల్లి మరణవార్త వినిన రాఘవ ఆ సమయంలో తాను భద్రంగా దాచుకున్న తాజ్‌మహల్‌ని పగలగొట్టిన కొడుకును చితకబాదడం కాస్త ఎబ్బెట్టుగా వుంది. అర్పణ కథలో రాధకు ఓ ప్రమాదంలో రెండు కళ్ళూ పోతే ఆమె భర్త కృష్ణారావు డాక్టరు సహాయంతో తన ఎడమకన్ను ఆమెకు సహాయంచేసి, తాను ఆ స్థానే గాజుకన్ను పెట్టించుకుంటాడు. రాధకు రెండు కళ్ళూ వచ్చే స్తాయి. అదెలా!!

మోటారు మెకానిజం
మోటారుకారు రిపేరింగ్
డీజిలు ఇంజన్లు - రిపేరు

[విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, యస్. శ్రీనివాస్]

తమిళంలో వ్రాసిన యీ పుస్తకాలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ హైదరాబాద్‌వారు తెలుగున ప్రచురించారు. రచయిత ఇంజనీరింగులో పట్టభద్రులు. పశ్చిమ జర్మని, లండన్, పారిస్, హేంబర్గ్, జినోవావంటి నగరాలలోని వివిధ సంస్థలలో అధ్యయనం చేశారు.

ఈ పుస్తకాలలో మోటారు కారు మోటారు వాహనం...వాటి భాగాలు, అవి పనిచేయు విధానం, వాటికి వచ్చే రిపేర్లు - అవి పని చేయు విధానంవంటివన్నీ కూలంకషంగా, సచిత్రంగా చర్చించారు. డీజిలు ఇంజన్లు, వాటి భాగాలు, అవి పనిచేయు విధానం, వాటి రిపేర్లు కూడా చక్కగా వివరించారు. ఇవన్నీ వృత్తివిద్యకేగాక, వాహనాల నుపయోగించుకునేవారు కనీసం తెలుసుకోవలసినవి చాలా ఉన్నాయి. సాధారణ జ్ఞానానికి, విజ్ఞానానికి కూడా ఉపయోగిస్తాయి. విశేషించి వృత్తివిద్య నభ్యసించేవారికి ఉపయోగం.

తెలుగు అనువాదం కూడా బాగున్నది.

తపస్సు
(కథల సంపుటి)

[గన్ను కృష్ణమూర్తి, విజయభారతి పబ్లికేషన్స్, నిజామాబాద్, ఇరవై రూపాయలు]

పీడకలనుంచి పాపం పండికూనవరకూ మొత్తం 27 కథలున్న యీ 228 పేజీల పుస్తకంలోని రెండో కథ తపస్సు చాలా అపహాస్యంగా వుంది. కథానాయకునికి ఉవ్వెత్తున తానూ మహనీయుల కోవకు జేరిపోవాలని తపన కలిగి చేతిలో వున్న ఒకే ఒక్క పావలా ఓ ముష్టిదానికి వేస్తాడు. ఆనకి కనుపించిన ముష్టివానికి తన చొక్కా, ఆ తరువాత కనుపించిన ముష్టిదానికి తన ప్యాంటూ దానం చేసి, లోపల్లాగూ, బనీనుతో హైదరాబాద్ నగరంలో అర్థరాత్రి తిరుగాడుతూ వుంటాడు. ఆలోగా ఓ పోలీసు అతని బనీను చింపి, లోపల్లాగూ పుచ్చుకు స్టేషనుకు లాక్కుపోయి అక్కడ ఆ లాగూవానిని తన్ని జైల్లో పారేస్తాడు. అస్థిపంజరంలో హీరో ముష్టివానికో యాభై రూపాయలిస్తే వాడు దాన్ని ఏ విధంగానూ ఉపయోగించుకోకుండా తిరిగి ఆ దానకర్తకే తెచ్చిస్తాడు. ఇదో అవాస్తవిక కథ. కట్నంలో కూతురుకు కట్నమివ్వలేని శరభయ్య కట్నం పాట పాడుతున్న మగ పెళ్ళివారికి తన కూతురు తల నరికి ఓ పళ్ళెంలో పెట్టియిస్తాడు. చీపురుకట్ట లేక కొత్తగా యిల్లు మారిన ఓ కుటుంబం పడిన అగచాట్లు వగైరాలు.

కథలలో కొన్ని చాలా చిన్నవై అచ్చులోనే రెండు పేజీల్లో యిమిడిపోయి కథనం, కథాభావాన్ని కోల్పోయాయి. ఏదైనా చెప్పవలసినంత చెప్పకపోయినా, చెప్పాల్సినకన్నా ఎక్కువ చెప్పినా చికాకే! రచయిత చాలా కథలు కనీసం చెప్పాల్సినంతైనా చెప్పలేదు. కథావస్తువులు మంచివి దొరికినా సత్ఫలితం లేకుండా పోయాయి.

ఫాలాక్షుడు

మోటార్ సైకిల్, స్కూటర్, మోపెడ్ మెకానిజం - రిపేర్

[మూల రచన: ఎస్. శ్రీనివాసన్ బి ఇ., అనువాదం: జి. మోహనరావు, శ్రీమతి రాజం పరమేశ్వర అయ్యర్; పేజీలు 279; వెల: రూ. 20-00, ప్రతులకు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞానభవన్, 4-1-435 బ్యాంకు స్ట్రీటు, హైదరాబాద్-500 001]

పుస్తకం పేరులో ఉన్నట్లు మోటార్ సైకిల్, స్కూటర్, మోపెడ్‌ల మెకానిజానికి సంబంధించిన సమాచారం కావలసినంత ఈ పుస్తకంలో కన్పిస్తుంది. రెండు స్ట్రోకుల పెట్రోలు ఇంజను, నాల్గు స్ట్రోకుల పెట్రోలు ఇంజను పనిచేసే విధానం పాఠకుడికి చక్కగా అవగాహన అయ్యేవిధంగా చిత్రాలతో వివరించారు. ఇంజనులో ఉండే వివిధ భాగాలు అవి ఏ పనులకు నిర్దేశింపబడ్డాయో స్పష్టంగా తెలిసేటట్లు రచన చేశారు.

కార్బొరేటర్ అధ్యాయంలో జెట్ పనిచేసే విధానం మాత్రమే గాక ఫ్లోటింగ్ సిస్టమ్, అయిడ్లింగ్ సర్క్యూట్, కార్బొరేటరు ట్యూనింగ్, నైలాన్ ఫిల్టర్‌ల గురించి సమగ్రంగా వివరించారు.

ఇంజను సక్రమంగా పనిచేసి సాధ్యమైనంత ప్రమాణంలో శక్తి ఉత్పాదన జరిగేందుకు దానికి సరఫరా చేయబడే ఇంధన మిశ్రమం పెట్రోలు, గాలి తగినపాళ్లలో కలసిఉండాలి. దీనివల్ల ఇంధనంగా వాడబడే పెట్రోలు వ్యర్థం కాకుండా పరిపూర్ణంగా వినియోగింపబడుతుంది. బహిర్గతమయ్యే జ్వలించిన వాయువు, తెలుపు, నీలం మిశ్రమమైన వర్ణంలో తగినంత పరిశుభ్రంగా ఉండి వాతావరణాన్ని కలుషితం చేయదు.

బలమైన ఇంధనపు మిశ్రమంలో పెట్రోలు అధిక ప్రమాణంలోను గాలి అల్పప్రమాణంలోను ఉంటుంది. ఇంజను ఈ మిశ్రమం వల్ల వీలైనంత అధికశక్తి విడుదల చేసినప్పటికిని కొన్ని సమస్యలు ఎదురవుతాయి. మొత్తం పెట్రోలుమండక వ్యర్థంగా కొంత మండిన వాయువులతో బహిర్గతమయి వాతావరణ కాలుష్యానికి సహాయపడుతుంది. మిశ్రమం మరీ బలమైనదైతే ఇంజనులో జనించే శక్తి కుంటుపడుతుంది. బలహీనమైన ఇంధన మిశ్రమంలో పెట్రోలు అల్పప్రమాణంలోను గాలి అధిక ప్రమాణంలోను ఉంటాయి. దీని వల్ల ఎన్నో సమస్యలు ఎదురవుతాయి.

మోటారు సైకిళ్లు ఉన్నవారికి వాటిగురించి తెలియని ఎన్నో సాంకేతిక విషయాలు ఈ పుస్తకం చదివితే తెలుస్తాయి. ఇంజను పనిచేసేందుకు 'చోక్' స్టార్టర్‌గా పనిచేస్తుంది.

ఇంజనులో ఇంధన మిశ్రమం జ్వలించడంవలన ఏర్పడిన శక్తి క్లచ్‌కు చేరవేయబడుతుంది. అచటనుండి శక్తి ట్రాన్స్‌మిషన్ జరిగేందుకు రోలర్ చైన్లు ఎలా ఉపయోగపడతాయో చిత్రాలతో వివరించినరీతి పాఠకుడికి ఏమీ శ్రమలేకుండా అర్థమయ్యేట్లు ఉంటుంది. ఈ చైన్లు సాధారణంగా ఆయిల్‌లో లేదా నూనెలో పరిభ్రమిస్తూ ఉండడంవల్ల అవి మృదువుగా పనిచేస్తూ ఉంటాయి.

ప్లేట్‌కచ్‌ల నిర్మాణం ఉదాహరణలతో సులువుగా అర్థమయ్యేటట్లు ఉంది. మొదటి గేరు, రెండవగేరు, మూడవగేరు, నాల్గవ గేరు పనిచేసే తీరు పటాలతో వివరించడంవల్ల చాలా సులువుగా అర్థం చేసుకోవడం వీలవుతుంది.

వాహనంలో ఉండే కంట్రోలు పరికరాలు కిక్‌స్టార్టర్, పెడల్, లైట్ల స్విచ్, గేరును మార్చుట, క్లచ్ వేయుట, థ్రాటిల్, ముందు బ్రేకు, వెనుకబ్రేకు, పెడల్ వాటిగురించి కూడా తగినంత వివరణ ఇచ్చారు. అంతేకాదు వాహనంలో విద్యుత్ ఉత్పాదనకు కావలసిన అమరికలు చిత్రాల సహాయంతో ఎటువంటి అనుమానం పాఠకుడికి కలగకుండా ఉండేటట్లు వివరించారు.

మోటారు సైకిళ్ళ చక్రాలకుండే టైర్లు ట్యూబుల గురించి ఎన్నో కొత్త విషయాలు సామాన్యుడికి తెలియజేస్తూ ముందు చక్రం, వెనుక చక్రాలలో రకరకాల సైకిళ్ళ విషయంలో గాలి పీడనశక్తి ఎంతెంత ఉండాలో కూడా తెలియచెప్పారు.

రిపేర్ గురించి ప్రస్తావించేముందు రకరకాల పనిముట్లు చిత్రాల సహాయంలో పాఠకుడికి పరిచయం చేశారు. ఇందులో రెండు అంశాలు ప్రధానమైనవి. మొదటిది లోపం కనుగొనడం రెండవది దానిని రిపేరు చేయడం. వాహనం సక్రమంగా పనిచేయగలిగి యుండాలంటే దానిలో విధిగా జరగాల్సిన పనుల లిస్టు 174, 175వ పేజీలలో కన్పిస్తుంది.

ఇంజను ఎందుకు స్టార్టు కాదు? కారణం ఏమిటి? దానికి నివారణచర్య ఏమిటి? అదేవిధంగా ఇంజను స్టార్టు అవుతుంది కాని వెంటనే ఆగిపోతుంది ఎందుచేత? ఇంజను తక్కువ వేగంతో పని చేస్తూ ఉంటుంది. దీనికి కారణం? అంతేకాదు వీటన్నింటికి నివారణ చర్యలు ఏమిటి? ఇటువంటివాటి గురించి లోపాల వివరాలు, కారణాలు, నివారణ చర్యలు అనే హెడ్డింగులతో 185వ పేజీనుండి 206వ పేజీ వరకూ ఒక పట్టిక రూపంలో ఎన్నో విషయాలు వ్రాయబడ్డాయి.

రిపేర్ రాకుండా పలు భాగాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. గేర్‌బాక్సు, బ్యాటరీల సంరక్షణ ఎలా చేసుకోవాలి? ప్రతి వెయ్యి కిలోమీటర్ల అనంతరం సంరక్షణ చర్యలో భాగంగా ఏం చెయ్యాలి? అదేవిధంగా ప్రతి నాల్గువేల కి.మీ. అనంతరం, ప్రతి ఎనిమిదివేల కి.మీ. అనంతరం సంరక్షణ చర్యలు ఏమి తీసుకోవాలి, దైనందిన సంరక్షణలు ఏమిటి? ఆరుమాసాల కొకసారి నిర్వహించవలసిన సంరక్షణ కార్యక్రమాలేమిటి? వంటి విషయాల వివరణ మాత్రమేగాక 'వాడకందారు సులువుగా తను ఏం చెయ్యాలో తెల్పుకునేందుకు వీలుగా దీనికి సంబంధించిన అనేక విషయాలు 220 నుండి 226 పేజీవరకూ ఒక పట్టికలో తెలియచెప్పారు.

డి కార్బనైజింగ్ వాల్వుల టైమింగ్ రెండు విడివడి అధ్యాయాల్లో చర్చించారు. వర్కు షాపులకు కొన్ని సూచనలిచ్చారు. ఆఖరి అధ్యాయంలో ముఖ్యమైన రిపేర్లు సచిత్రాత్మకంగా వివరించారు.

ఈ పుస్తకం చదవడంవల్ల రెండు విషయాలు స్ఫురిస్తాయి. మొదటిది మోటారుసైకిళ్లు ఉన్నవారు పుస్తకం చదువుతే మోటారు సైకిలు నిర్మాణం, మెకానిజం గురించి తెలుసుకోగల్గుతారు. రెండవది మెకానిక్‌లు అలవాటుకొద్దీ రిపేరు చేయడం చూస్తూఉంటాం. వారు ఈ పుస్తకం చూస్తే మెకానిజం చేసే తీరులో ప్రతిభను మరికొంత పెంచుకోగలరనిపిస్తుంది. అనువాదం కూడా బాగుంది.

సి. వి. సర్వేశ్వర శర్మ

తెలుగు కథ

[ఆధునిక తెలుగు కథల సంకలనం, సంకలనకర్త: డి. రామలింగం, డెమీ 1/8, 28 + 461 పుటలు, 1988 ప్రథమ ముద్రణ, ప్రకాశకులు: కేంద్ర సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ; వెల రూ. 40]

ఒకడుంటే రాగం, ఇద్దరుంటే కథ. కథ ప్రథమ సాహిత్య ప్రక్రియ. మహాభారతం కథే. అయితే చాలా పెద్దకథ. మనం చర్చించేది చిన్నకథ. దీనిని ఉపాఖ్యానం, గల్పిక (బెంగాలీవాళ్ళది) కథ, కథానిక అని కూడా అంటారు. భారతదేశం కథలకు కాణాచి యని కొందరంటారు. ఋగ్వేదంలో, ఉపనిషత్తులలో చిన్న కథ లున్నాయి. బైబిలులో చిన్న కథలున్నాయి. బౌద్ధ జాతక కథలు సరేసరి. చిన్న ఛందస్సయిన కందపద్యం వ్రాయడమెంత కష్టమో, చిన్న కథను వ్రాయడమంత కష్టం. నవల గుమ్మడి కాయ మామిడిపండు వంటిది. అందలి బాగాలేని భాగాన్ని వదలి తక్కినదానిని తినవచ్చును. చిన్నకథ ద్రాక్ష, కలివిపండ్లవంటిది. తింటే అంతా తినవలెను. బాగాలేకున్న అంతా ఉమిసివేయవలసిందే. చిన్నకథ మీనియేచర్ పెయింటింగువంటిది. వ్రాసేటప్పుడే చిన్నగా వ్రాయవలెను. పెద్ద నవలను కుదించి వ్రాస్తే చిన్న నవల అవుతుందేమో కానీ, చిన్న కథ కాజాలదు. చిన్నకథ ఎంత చిన్నగా ఉండవలెను? "వనఫూల్" (బెంగాలీ రచయిత) పోస్టుకార్డులో పట్టేటంత చిన్నకథలు వ్రాసినాడు.

తెలుగులో నేడు ప్రతిఏటా వేలకొలది కథలు వస్తున్నాయి. ఇందులో ప్రతీదీ చదివి, ఏది మంచిదో ఏది చెడ్డదో నిర్ణయించడానికి ఒక సూపర్ కంప్యూటరు కావలెను లేదా బ్రహ్మయైనా దిగిరావలెను ప్రతి చదువు వచ్చిన అర్భకుడూ చిన్నకథలు వ్రాయడంతో మొదలు పెట్టుతాడు - చిన్న కథారచన టాల్‌స్టాయివంటి వయోవృద్ధుడు వ్రాయవలసినట్టిదని తెలియక! ప్రస్తుత గ్రంథం పేరు "తెలుగు కథ" శీర్షికబట్టి సిద్ధాంతగ్రంథ మనిపించవచ్చును. "తెలుగు కథలు" అనివుంటే బాగు. సంకలనకర్త ప్రఖ్యాత పాత్రికేయుడు, సాహితీవేత్త శ్రీ డి. రామలింగంగారు ఇది కేంద్ర సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీవారి రెండవ తెలుగు కథా సంకలనం, మొదటి సంకలనం "ఆంధ్రకథా మంజూష" అనే పేరుతో స్వామి శివశంకరుల సంపాదకత్వాన 1958లో వెలువడింది. ముప్పయిఏండ్ల తర్వాత నేడు రెండవ సంకలనం. 1935-1982 సం॥ల మధ్యకాలంలో వెలువడ్డ కథలనుండి ఎంపిక చేసిన సంకలనమిది.

ఇందు 30 కథలున్నాయి. చివర రచయితల జీవిత విశేషా లున్నాయి. లబ్ధప్రతిష్ఠులైన వాళ్ళ కథలే ఇందున్నాయి. ఉదా: పాలగుమ్మి, కొడవటిగంటి, గోపిచంద్, బుచ్చిబాబు, చా.సో, రాచకొండ, కాళీపట్నం. ఒకప్పుడు నేను గొప్పగా భావించిన రచయితల కథలు చదివితే ఇప్పుడు ఏమీ బాగాలేవు అనిపించింది. నా అభిరుచి, దృక్పథం మారినవా? లేక వీరివే ఇంతకన్నా మంచి కథలు లేవా? అనిపిస్తుంది. ఫలానావారి కథలనెందుకు వేయలేదు, ఫలానావారి ఫలానా కథను ఎందుకు ఎంపిక చేయలేదు అని అడగడం సులభమే. ఇల్లిందల సరస్వతీదేవిగారి ఒక కథ, మధురాంతకం "నీటి చెలమ", పాలగుమ్మి "గాలివాన" ఇందుండవలసినవి. తెలుగు కథలు విశ్వకథానికలతో తులతూగగలవా? అని ఆలోచించవలెను. ఉదా: టాల్‌స్టాయి "ఎ ప్రిజనర్ ఇన్ దకాకసస్", ఫ్రాన్సిస్ బ్రెట్ హార్ట్ "మిగిల్స్", "సాకీ" కథ "పార్కుబెంచి", గోగోలు "కోటు", మపాసా "నెక్‌లేస్", ఓహెన్రీ "మునిసిపల్ రిపోర్టు", రడ్యార్డు కిప్లింగ్ "పూరన్ భగత్"ల స్థాయికి మన కథలు వస్తాయా? ముసిలో దైనా బసిరెడ్డే మేలన్నట్లు, గురజాడ వ్రాసిన నాలుగైదు కథలే అన్నిటికంటె గొప్పవిగా అనిపిస్తాయి. పెద్ద గ్రంథంలో సురుచిర చిన్న కథలుంటాయి. ఉదా: మహాభారతం, సర్‌వాల్టరుస్కాటు వ్రాసిన నవల "రెడ్‌గాంట్‌లెట్"లో వచ్చే "ఓల్డ్ విల్లీస్ టేల్" అనే కథ, ఇంగ్లీషుభాషలో అత్యుత్తమ శిల్పాత్మకమైందని తజ్ఞుల అభిప్రాయం. డికెన్సు నవలలలోనూ, సందర్భవశాత్తు మనోజ్ఞ కథానికలు వస్తాయి.

తెలుగుకథ ఇంకా బాగా ఎదగకపోవడానికి కారణం రచయితలలో ఉండే ప్రచారాత్మక సాంఘికస్పృహ అని నా అభిప్రాయం. "కమిట్మెంటు" పేరుతో పేదరికం, దోపిడి, తిరుగుబాటు, వర్గపోరాటం, రియలిజంవంటి గుంజలకు కట్టివేయబడిన పెయ్యలవలె భావస్వాతంత్ర్యం ("భావాంబర వీధి విశ్రుత విహారిత్వం") కోల్పోయి మన ఇప్పటి కథకులు కథలు వ్రాస్తారు. వీరు గోర్కీ, చెకోవ్, జాక్‌లండన్, డబ్ల్యు డబ్ల్యు జేకబ్సువంటివాళ్ళ రచనలు అధ్యయనం చేస్తే మేలు.

ప్రస్తుత సంకలనం నిస్పృహ కల్గిస్తుంది. సంకలనకర్త తనకు తోచినంతమట్టుకు కృషిచేసినాడు. అందుకాయన అభినందనీయుడు. బెంగాలీ, ఒరియా, కన్నడం, మళయాళీల ప్రభావంలో ఉండే కేంద్ర సాహిత్య అకాడెమీవారు తెలుగుపై ఇంతమాత్రమైనా ఆదరణ చూపినందుకు వారూ అభినందనీయులే. పుస్తకం వెల రు. 40. ఎవరూ ధరపెట్టి కొని చదువరు గ్రంథాలయాల బీరువాలకు అలంకారప్రాయమై వుండగల పుస్తకం ఇది.

—సర్దేశాయి తిరుమలరావు

Printed & Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrik Press, Gandhinagar, Vijayawada-3. Editor . S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 61247